
ప్రభాత
ఆదివారం
వెలుగు
13.01.2019
www.v6velugu.com
హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 328 పేజీలు: 12+12+12+12 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | JAGTIAL | WARANGAL



కోటా బిల్లుకు రాజముద్ర

పెద్ద కులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం ఆమోదముద్ర వేశారు. రాష్ట్రపతి సంతకం చేయడంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల బిల్లు చట్టంగా మారింది. దీంతో ఆర్థికంగా వెనుకబడిన పెద్దకులాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్రపతి భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కోటా బిల్లును రెండురోజుల క్రితం పార్లమెంట్ ఆమోదించిన సంగతి తెలిసిందే.

టాకీస్

కట్ చేస్తే ఫ్లాష్‌బ్యాక్

కట్‌చేస్తే.. సహజంగా అయితే సీన్ మారుతుంది. కానీ కొన్ని సినిమాల్లో కథే మారిపోతుంది. అలాంటి సినిమాలెన్నో.



09

జనరల్

ఊళ్లకు బైలెల్లిన్రు

సంక్రాంతికి సొంతూళ్లకు హైదరాబాద్ వాసులు. హైదరాబాద్–విజయవాడ హైవేపై భారీ రద్దీ. 16 దాకా టోల్ రద్దు చేసిన ప్రభుత్వం.



04

తెలంగాణం

ఏకగ్రీవానికి ఎన్నికలు

పంచాయతీ ఎన్నికల్లో నయా ట్రెండ్. జోరుగా సాగుతున్న మాక్ పోలింగ్. గెలిచిన వారే సర్పంచ్




06

జనరల్

రైతు ఆశలకు 'కత్తెర'

మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి.. యాసంగి సాగుపై ఎఫెక్ట్.. సరిగా ఎదగని మొక్కలు.. దిగుబడి సగానికి తగ్గే అవకాశం.



02

ప్లే

తొలి వన్డే ఆసీస్‌దే

సిడ్నీ వన్డేలో 34 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి. రోహిత్ శర్మ సెంచరీ వృథా. మెరిసిన హ్యాండ్స్‌కోంబ్, రిచర్డ్‌సన్.



11



ఎట్లుంది మన జీవిక!

దాని తీర్గనే బడ్జెట్ రాయండి

- ఐదేండ్ల తర్వాత తెలంగాణను ఊహించి తయారు చేయాలె
- బడ్జెట్ కన్నా ముందు ఓ రిపోర్టు ఇయ్యండి
- రాష్ట్రానికి ఏం కావాల్నో ఫైనాన్స్ కమిషన్‌కు తెలవాలె
- కేంద్ర విధానాలన్నీ రాష్ట్రాల ప్రయోజనాలకు వ్యతిరేకమే
- ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్

రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసే రీతిలో బడ్జెట్ ఉండాలని, ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే అంశాలేమున్నాయో గుర్తించాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల బతుకుదెరువు ఏమిటి, వారికోసం ఏం చేయాలనే దానిపై దృష్టిపెట్టాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల బడ్జెట్‌రూపొందించేటప్పుడు గత నాలుగేండ్లలో ఎంత ఖర్చు చేశారో, రాబోయే ఐదేండ్లలో ఎంత అవసరమో పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టుల వద్ద పర్యాటకానికి అవకాశాలు, ప్రైవేటు యూనివర్సిటీలు, ప్రజల ఆరోగ్యం వంటి అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. పదిహేనో ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రానికి రానుందని, వారికి మన అవసరాలు పూర్తిగా తెలిసేలా ఉండాలని చెప్పారు. బడ్జెట్ రూపకల్పన, 15వ ఫైనాన్స్ కమిషన్ రాక, హైదరాబాద్ అభివృద్ధి, మంత్రులు, కార్యదర్శులకు శిక్షణ తదితర అంశాలపై శనివారం ప్రగతి భవన్‌లో సీఎం సమీక్షించారు.

04



శనివారం లక్నోలో ఎస్పీ, బీఎస్పీ సీట్ల సర్దుబాటుపై ప్రకటన సందర్భంగా మాయావతి, అఖిలేశ్ యాదవ్

ఉత్తరాన పొత్తు పొడుపు

చేతులు కలిపిన ఎస్పీ, బీఎస్పీ

- చిరకాల వైరానికి తెరదించిన నేతలు
- ఉపఎన్నికల విజయాలతో జోష్
- వ్యూహం ప్రకారమే హస్తానికి దూరం!

ఉత్తరప్రదేశ్‌లో చిరకాల ప్రత్యర్థులు ఒకటయ్యారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్న మాట మళ్లీ రుజువైంది. 20 ఏళ్ల పైచిలుకు రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ చేతులు కలిపారు. ఉమ్మడి శత్రువైన బీజేపీని ఎదుర్కోవాల్సిన అవసరమే వారిని ఒకే వేదికపైకి తెచ్చింది. దేశంలోనే ఎక్కువగా 80 లోక్‌సభ సీట్లున్న రాష్ట్రంలో, అందులోనూ ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న యూపీలో రెండు బలమైన విపక్షాలు జట్టు కట్టడం ఎన్నికల ముందు ఆసక్తి రేపుతోంది. కేంద్రంలో అధికారం అందుకోవడానికి కీలకమైన రాష్ట్రంలో ఈ కూటమి ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

03

ఎస్పీ 38, బీఎస్పీ 38

యూపీలో సీట్లు పంచుకున్న బువా–భతీజా

- కాంగ్రెస్ కు చోటు లేదు.. మిత్రపక్షాలకు రెండు సీట్లు
- వివరాలు వెల్లడించిన అఖిలేశ్, మాయావతి
- యూపీపై నేడు కాంగ్రెస్ నిర్ణయం

05

ప్రజలే నిర్ణేతలు

- సేవకులు కావాలో, అవినీతిపరులు కావాలో తేల్చేది వాళ్లే
- దేశ చరిత్రలో మచ్చలేని ప్రభుత్వం మది
- కాంగ్రెస్ చరిత్రంతా స్కామ్‌లే.. కూటములు విఫల ప్రయోగం
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రధాని మోడీ

వాళ్లు కేంద్రంలో మజ్బూర్ సర్కార్ (బలహీనమైన ప్రభుత్వం) ఉండాలని ఆశిస్తున్నారు. మేము మజ్బూత్ సర్కార్ (బలమైన ప్రభుత్వం)ను కోరుకుంటున్నాం. మజ్బూర్ సర్కార్‌తో అవినీతి రాజ్యమేలుతుంది. అవినీతిలో మునిగినవాళ్లు అలాంటి సర్కార్‌నే ఆశిస్తారు. ప్రధాన సేవక్‌ను నిర్ణయించేది దేశ ప్రజలే.



03

'పొగ ముంచు'తున్నది

రాష్ట్రాన్ని కమ్మేసిన పొగమంచు

- మీటర్ల దూరంలోనూ ఏముందో కనిపించని పరిస్థితి
- హైవే–44పై ఒకటెనుక ఒకటి 16 వాహనాలు ఢీ
- పలువురికి తీవ్ర గాయాలు



రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చాకలిగట్టు తండా వద్ద హైవేపై ఒకదాని వెంబడి మరొకటి ఢీకొన్న వాహనాలు

02

రాష్ట్రాన్ని పొగమంచు కమ్మేసింది. దట్టంగా అలుముకుంటున్న పొగ మంచుతో చాలా ప్రాంతాల్లో పొద్దున 10 గంటలు దాటినా అంతా మసకగానే కనిపిస్తోంది. ఇలా మబ్బుమబ్బుగ ఉండటంతో ముందున్న వాహనాలు, రోడ్డు సరిగా కనిపించక రంగారెడ్డి జిల్లా చాకలిగట్టు తండా వద్ద 44వ నేషనల్ హైవేపై పెద్ద ప్రమాదం జరిగింది. 16 వాహనాలు ఒకదాని వెనుక మరోటి ఢీకొట్టుకుని, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కార్లు, లారీలు దెబ్బతిన్నాయి. మరోవైపు పొగ మంచు కారణంగా రైళ్లు, విమానాల రాకపోకలు కూడా ఆలస్యమవుతున్నాయి. ఈ నెల 16 వరకు కూడా ఇలాంటి పరిస్థితే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాత్రిపూట ప్రయాణాలు వద్దని సూచించింది.



వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
82.00	82.00	82.00
కరీంనగర్	నిజామాబాద్	ఖమ్మం
84.00	82.00	82.00



బతుకు బురద పాలవుతోంది

అంతా వట్టిబోతోంది. అల్లంత దూరంలో తడంతా ఆవిరైపోతోంది. తెలవక వాటిలో అడుగుపెట్టిన మూగ జీవిని ఎండిపోతున్న బురద ఊబిలా మారి ఇలా చంపేస్తోంది. ఆస్ట్రేలియా సిడ్నీలోని కరువు పరిస్థితులు, విపరీతమైన వేడి పరిస్థితులకు నిదర్శనమీ చిత్రం. అక్కడి కాండిల్లా సరస్సుకు డ్రైనేజ్ కెనాల్ ఇది. తీవ్రమైన కరువు పరిస్థితులతో అందులోని నీరు ఇంకి, బురద ఎండిపోతోంది. ఆ బురదలో ఓ జంతువు ఇలా ఇరుక్కుపోయింది. నిక్ మోయిర్ అనే ఫొటోగ్రాఫర్ ఈ ఫొటోను డ్రోన్ సాయంతో క్లిక్‌మనిపించాడు. ఆ జంతువును కాపాడబోతే తన ప్రాణం ప్రమాదంలో పడే అవకాశం ఉండడం వల్లే ఆ ధైర్యం చేయలేకపోయానన్నాడు.



పొలిటి 'కైట్స్'

మోడీ, రాహుల్.. ఒకే వేదికను షేర్ చేసుకుంటారో లేదో తెలియదు కానీ.. ఈ పతంగుల్లో ప్లేస్ మాత్రం షేర్ చేసుకున్నారు. బెంగళూరులోని ఓ పతంగుల షాపులో చిత్రమిది.



వరల్డ్ బ్యాంక్ చీఫ్‌గా ఇవాంకా?

వాషింగ్టన్: ప్రపంచబ్యాంకు కొత్త చీఫ్‌గా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకాను అమెరికా నామినేట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ పదవికి జిమ్ యాంగ్ కిమ్ గత వారం రాజీనామా చేశారు. చీఫ్ పదవికి సభ్యదేశాలన్నీ నామినేషన్లు పంపొచ్చు. వాటిని పరిశీలించి బ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంటుంది. అయితే నియామక హిస్టరీని పరిశీలిస్తే అమెరికా నామినేట్ చేసిన అభ్యర్థే సంస్థ చీఫ్‌గా ఎంపికవుతూ వస్తున్నారు. ప్రపంచ బ్యాంకు ట్రెజరీ ఆఫీసర్ డేవిడ్ మల్పాస్, యూఎన్‌లో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ, అమెరికా ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ చీఫ్ మార్క్ గ్రీన్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

మెట్రో జర్నీ రికార్డు

శుక్రవారం ఒక్కరోజే 2.26 లక్షల మంది ప్రయాణం



హైదరాబాద్, వెలుగు: ప్రయాణికులను తరలించడంలో హైదరాబాద్ మెట్రో రైలు రికార్డు సృష్టించింది. శుక్రవారం ఒక్కరోజే 2.26 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చింది. ఒక్కరోజులోనే అత్యధికంగా ప్రయాణికులను చేరవేసి మెట్రో కొత్త మైలురాయిని చేరినట్లు అధికారులు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా సిటీ నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో సొంత ఊళ్లకు వెళ్తుండటంతో జర్నీకి మెట్రోనే కీలకంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లకు వెళ్లడానికి మెట్రో ప్రయాణానికే జనాలు మొగ్గు చూపారు. హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రా ప్రాంత వాసులు సంక్రాంతి పండుగకు సొంతూరికి వెళ్తుండటంతో ఎల్బీనగర్, ఉప్పల్, నాగోల్ బస్ రూట్లలో రద్దీ పెరిగింది. సిటీ నుంచి బస్సులో శివారు ప్రాంతాలకు వెళ్లే వాళ్లు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటే ఆలస్యమవుతుందని ఎక్కువ మంది మెట్రోను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

తొలి దశ అభ్యర్థులు నేడు ఖరారు

హైదరాబాద్, వెలుగు:

- రెండో దశ నామినేషన్లకు చివరి రోజు కూడా..
- పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై నాగిరెడ్డి సమీక్షలు

గ్రామ పంచాయతీ తొలి దశ ఎన్నికల్లో బరిలో ఉండే అభ్యర్థులు ఆదివారం సాయంత్రానికి ఖరారు కానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకల్లా నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తర్వాత ఎన్నికల అధికారులు జాబితాలు సరిచూసుకుని పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారు. వారికి గుర్తులు కేటాయిస్తారు. తొలి దశలో మొత్తంగా 4,468 పంచాయతీలకు ఎలక్షన్లు జరుగుతుండగా.. సర్పంచ్ పదవులకు 23,229 నామినేషన్లు, 39,616 వార్డులకు 93,501 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో రెండు మూడు సెట్లు దాఖలైన నామినేషన్లు, ఉపసంహరించుకునేవారు పోగా బరిలో ఉండే అభ్యర్థులు ఎందరనేది ఆదివారం సాయంత్రం తేలనుంది. ఇక రెండో దశ ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్లకు ఆదివారమే చివరి రోజు. సాయంత్రం 5 గంటల వరకు రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకున్న వారికే నామినేషన్ వేసే అవకాశం ఉంటుంది.

ప్రలోభాలు.. ఫిర్యాదులు

పోలింగ్ తేదీలు దగ్గరపడుతున్న కొద్దీ గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. పరస్పర ఆరోపణలు, విమర్శలు ఎక్కువవుతున్నాయి. కొన్ని చోట్ల దాడులూ జరుగుతుండటంతో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. శనివారం ఒక్కరోజే 22 ఫిర్యాదులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 14 కేసుల్లో చర్యలు కూడా చేపట్టారు. ఇక అక్రమంగా తరలిస్తున్న మద్యం అక్కడక్కడ పట్టుబడుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సిద్ధం చేసుకున్న పలు రకాల వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.4.82 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు.

3 జిల్లాల్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పర్యటన

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని జిల్లాల యంత్రాంగాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లు, ఓటర్ల జాబితాలో పొరపాట్లు, జిల్లాల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఆయన పర్యటించారు. ఇప్పటికే ఎన్నికల సంఘం తరఫున చేయాల్సినవన్నీ పూర్తయ్యాయని, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాల యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. ఆదివారం తొలిదశ అభ్యర్థుల ఖరారు ఉన్నందున ఏకగ్రీవమయ్యే చోట్ల నిబంధనల మేరకు వ్యవహరించాలని, ఏకగ్రీవ సర్పంచ్ ప్రకటనలన్నీ సంబంధిత అబ్జర్వర్ అనుమతితో జరగాలని ఆదేశించారు.

అన్నా.. జర తప్పుకోరాదె!

హైదరాబాద్, వెలుగు:

- పంచాయతీల్లో నామినేషన్ల విత్‌డ్రాకు బుజ్జగింపులు
- వెనక్కి తగ్గేవారికి ఆఫర్లు
- 320 చోట్ల ఏకగ్రీవాలు.. టీఆర్ఎస్‌వే ఎక్కువ
- మరిన్ని ఏకగ్రీవాలకు నేతల యత్నాలు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బుజ్జగింపులు జోరుగా కొనసాగుతున్నాయి. పోటీ తగ్గించుకునేందుకు కొన్ని చోట్ల, ఏకగ్రీవమయ్యేందుకు మరి కొన్ని చోట్ల తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తొలిదశ పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణకు ఆదివారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెండు నామినేషన్లే దాఖలైన చోట వెనక్కి తగ్గే వారికి 'ఆఫర్లు' ప్రకటిస్తున్నారు. అటు అధికార పార్టీ నేతలు కూడా వీలైనంత వరకు ఏకగ్రీవాలు చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏకగ్రీవమైతే గ్రామానికి రూ.10 లక్షలు ప్రోత్సాహకంగా వస్తాయని, గ్రామాభివృద్ధి చేసుకోవచ్చని సూచిస్తున్నారు. నామినేషన్ వెనక్కి తీసుకుంటే వారు సూచించిన వార్డు మెంబర్ ఉప సర్పంచ్ అయ్యేలా సహకరిస్తామని హామీలు ఇస్తున్నట్టు సమాచారం.

ఎలక్షన్ హీట్

పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో గ్రామాల్లో ఎన్నికల వేడి పెరిగిపోతోంది. పలుచోట్ల సర్పంచ్, వార్డు మెంబర్ల పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. తొలిదశలో ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున నలుగురు, వార్డు మెంబర్‌కు ఇద్దరు చొప్పున బరిలో ఉన్నారు. కొన్నిచోట్ల ఒకే పార్టీకి చెందినవారు ఇద్దరు, ముగ్గురు పోటీలో ఉన్నారు. జిల్లా కేంద్రాలకు దగ్గర ఉన్న చోట్ల, మండల కేంద్రాల్లో, అధిక ఆదాయం ఉన్న చోట్ల అభ్యర్థులు ఎంతైనా ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు. దీంతో బరిలో ఉన్న వారిని నామినేషన్లు వెనక్కి తీసుకునేలా చేయడం నేతలు, ఎమ్మెల్యేలకు పెద్ద తలనొప్పిగా మారింది. తమ నియోజకవర్గంలో సాధ్యమైనన్ని ఎక్కువ పంచాయతీలను ఏకగ్రీవం చేసి, పార్టీ పెద్దల దృష్టిలో పడొచ్చని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. దీంతో పంచాయతీ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అభ్యర్థితో మాట్లాడి నామినేషన్ వెనక్కి తీసుకోమని కోరుతున్నారు.

అధికార పార్టీవే ఎక్కువ

ఎన్నికల సంఘం జాబితా ప్రకారం సుమారు 320 పంచాయతీల్లో ఒకే నామినేషన్ దాఖలైంది. వీటిలో సుమారు 290 చోట్ల టీఆర్ఎస్ అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలుస్తోంది. అదిలాబాద్, మెదక్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎక్కువగా ఏకగ్రీవాలు అయ్యాయి.

ఎన్నారైలకు ప్రత్యేక పాలసీ

హైదరాబాద్, వెలుగు : గల్ఫ్ దేశాల్లో ఇక్కట్లు పడుతున్న రాష్ట్ర బిడ్డలను ఆదుకుంటామని, ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం త్వరలోనే ఎన్నారై పాలసీ తీసుకొస్తుందని నిజామాబాద్ ఎంపీ కవిత చెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ లండన్ శాఖ 8వ వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. ఉద్యమ

- గల్ఫ్ ప్రవాసీలను ఆదుకుంటాం: ఎంపీ కవిత
- తెలంగాణ భవన్‌లో యూకే ఎన్ఆర్ఐ సెల్ 8వ వార్షికోత్సవం

సమయంలో ఎన్నారైలు ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్నారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అందుకే ప్రజలు రెండోసారి భారీ మెజార్టీ కట్టబెట్టారని చెప్పారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ పాలసీ ఎంతో గొప్పదని, అమెరికా లాంటి దేశాలే కొనియాడుతున్నాయన్నారు. 33 దేశాల్లో టీఆర్ఎస్ ఎన్నారై శాఖలతో జెండా ఎగురుతోందని, వంద దేశాల్లో గులాబీ జెండా ఎగరేసేలా విస్తరిస్తామన్నారు. ఎన్నారైల సంక్షేమం కోసం రాష్ట్ర సర్కారు ఇప్పటికే రూ.వంద కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ దేశాల్లో స్థిరపడిన రాష్ట్ర పౌరులంతా గర్వంతో తలెత్తుకుని తిరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఎన్నారై సెల్ క్యాలెండర్‌ను కవిత ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ పాల్గొన్నారు.



టీఆర్ఎస్ లండన్ శాఖ 8వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎంపీ కవిత తదితరులు



శనివారం ఉదయం పెద్ద అంబర్‌పేట వద్ద హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై దట్టంగా కమ్ముకున్న పొగమంచు



హైదరాబాద్ శివారు తట్టి అన్నారం దగ్గర ఉదయం 10 గంటలకు పొగమంచులోనే వరి నాట్లు వేస్తున్న మహిళలు

'పొగ మంచు'తున్నది

హైదరాబాద్, వెలుగు:

- రాష్ట్రవ్యాప్తంగా దట్టంగా పొగమంచు
- ఉదయం 10 దాటినా రోడ్లపై ఏమీ కనిపించని దుస్థితి
- ఈ నెల 16 వరకు ఇదే పరిస్థితి
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- విజృంభిస్తున్న వ్యాధులు
- రాత్రి ప్రయాణాలు వద్దు: నిపుణులు

ఉదయం పది దాటినా లైట్లు వేసుకొని వాహనాలను నడపాల్సిన పరిస్థితి. రోడ్డుపై ముందు ఏం వెళ్తుందో తెలియని దుస్థితి. రాష్ట్రమంతా పొగ మంచు దడ పుట్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కమ్ముకోవడంతో జనం వణికిపోతున్నారు. చాలా ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల వరకు పొగమంచు కమ్ముకుంది. ఈ నెల 16 వరకు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం (ఐఎండీ) అధికారులు అంటున్నారు. ఆదిలాబాద్, భద్రాచలం, హన్మకొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, రామగుండం ప్రాంతాల్లో ఎక్కువ తీవ్రత ఉంటుందని వారు తెలిపారు. పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప రాత్రి 9 గంటల నుంచి ఉదయం వరకు ప్రయాణాలు చేయకూడదని హెచ్చరిస్తున్నారు. పొగమంచు కారణంగా శనివారం ఉదయం 7గంటలకు 44వ హైవేపై 16 వాహనాలు ఒకదాని వెనుక ఒకటి ఢీకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోనూ ప్రమాదాలు జరిగాయి.

భారీగా ట్రాఫిక్ జామ్

సంక్రాంతి సీజన్ కావడంతో జనం పట్నం నుంచి సొంతూళ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. వాటిలో వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి పల్లెలకు వెళ్లే రోడ్లన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. భారీగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని, నెమ్మదిగా వెళ్లాలని పోలీసులు, అధికారులు సూచిస్తున్నారు. పొగ మంచు తగ్గిన తర్వాతే వాహనాలను నడపడం ఉత్తమమని అంటున్నారు. రాత్రి 9గంటల నుంచి ఉదయం 10గంటల వరకు ప్రయాణాలు చేయకపోవడమే బెటరని చెప్తున్నారు. పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. డ్రైవర్లు బిక్కుబిక్కుమంటూ డ్రైవింగ్ చేస్తున్నారు. కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరికొన్ని రైళ్లు తాత్కాలికంగా రద్దయ్యాయి.

వాహనదారులూ జర పైలం

మరో నాలుగైదు రోజులు పొగ మంచు కమ్ముకునే పరిస్థితి ఉండటంతో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాహనాన్ని నడిపేటప్పుడు డ్రైవర్లు హ్యాండ్ గ్లౌజ్‌లు వాడితే మంచిది. వాహనానికి వెనుక, ముందు రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా అతికించాలి. వాహనానికి ఫాగ్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి. వాహన వేగాన్ని పరిమితం చేసుకోవాలి. ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్ టేక్ చేయొద్దు. రాత్రంతా మంచు కురవడంతో రోడ్లు తడిగా ఉంటాయి. బ్రేకులేసినా వాహనం జారి పడిపోయే ప్రమాదం ఉంటుంది. వాహనం లైట్లు సరిగా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి. రోడ్డుపై వాహనాలను ఆపొద్దు.

రోగాల దాడి

రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతుండటంతో రోగాలు దాడి చేస్తున్నాయి. న్యుమోనియా, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. గుండె సమస్యలతో బాధపడేవారు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని, శరీరం వెచ్చగా ఉండేలా చూసుకోవాలని అంటున్నారు. జలుబు, దగ్గు రెండుమూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే తప్పకుండా డాక్టర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు.

రాత్రి ప్రయాణాలు వద్దు

రాష్ట్రంలో మూడు, నాలుగు రోజులు రాత్రి, ఉదయం పొగమంచు కమ్ముకోనుంది. ప్రజలు సాధ్యమైనంత వరకు రాత్రిళ్లు ప్రయాణం చేయకపోవడం మంచిది. రాత్రి కురుస్తున్న పొగమంచు వల్ల రోడ్లు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అత్యవసర ప్రయాణాలు చేయాలనుకునే వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ కె. నాగరత్నం, ఐఎండీ డైరెక్టర్

బండెనక బండి కొట్టి.. 16 బళ్లు కొట్టి

షాద్‌నగర్, వెలుగు: బస్సులు, లారీలు, కంటెయినర్లు, కార్లు.. ఒకటెనుక ఒకటి వరుసగా 16 వాహనాలు ఢీకొన్నాయి. పొగ మంచు కారణంగా రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చాకలిగట్టు తండా వద్ద హైవేపై ఈ విధ్వంసం జరిగింది. సగానికిపైగా వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సంక్రాంతి సీజన్ కావడంతో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వాహనాల్లో వెళ్లే జనంతో 44వ జాతీయ రహదారి రెండురోజులుగా రద్దీగా ఉంటోంది. శనివారం ఉదయం రహదారిపై భారీగా పొగ మంచు కమ్ముకుంది. 7 గంటల ప్రాంతంలో చాకలిగట్టు తండా వద్ద బస్సులు, లారీలు, కంటైనర్లు, కార్లు.. ఇలా 16 వాహనాలు ఒకదాని వెనుక ఒకటి ఢీకొన్నాయి. ముందు, వెనుక యాక్సిడెంట్లతో వాహనాల్లోని ప్రయాణికులు హడలిపోయారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోగానే ఒకదాని వెనుక ఒకటి వాహనాలు వరుసగా ఢీకొని నిలిచిపోయాయి. పొగమంచును ముందే గమనించిన వాహనదారులు లైట్లు వేసుకుని మెల్లగా వెళ్తున్నా.. ఎదురుగా ఏమున్నది గుర్తించే పరిస్థితి లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మూడు ఆర్టీసీ బస్సులు, రెండు ప్రైవేటు బస్సులు, రెండు లారీలు, ఓ ఆటో, ఓ కారు ధ్వంసమయ్యాయి. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా.. పలువురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకొని గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా ఆరు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదం బారినపడిన వాహనాలను తొలగించేందుకు పోలీసులు, స్థానికులు శ్రమించాల్సి వచ్చింది. ఉదయం 10 గంటల వరకు కూడా రహదారిపై దట్టంగా పొగమంచు కమ్ముకుంది. ఢిల్లీ, హర్యానా వంటి ప్రాంతాల్లో పొగమంచు కారణంగా ఒకదాని వెనుక ఒకటి అనేక వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కానీ.. రాష్ట్రంలో ఇలా 16 వాహనాలు ఒకదాని వెనుక ఒకటి, అదీ పొగ మంచు కారణంగా ఢీకొనడం ఇదే తొలిసారి అని పోలీసులు అంటున్నారు.





రంగారెడ్డి జిల్లా చాకలిగట్టు తండా వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు, ట్రక్కు

హజ్ యాత్రకు 3,685 మంది ఎంపిక

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రం నుంచి ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లేందుకు 3,685 మందిని ఎంపిక చేశారు. శనివారం రాష్ట్ర హజ్ కమిటీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్ ఆధ్వర్యంలో డ్రా (ఖుర్రా) తీశారు. కేంద్ర హజ్ కమిటీ రాష్ట్రానికి 4,169 సీట్లను కేటాయించగా..13,368 మంది భక్తులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 70 ఏళ్లకు పైబడిన 484 మందిని నేరుగా, మిగతా వారిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు అత్యధికంగా 8,116 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,459 మంది ఎంపికయ్యారు. నిజామాబాద్ నుంచి 249, రంగారెడ్డి 245, సంగారెడ్డి నుంచి 211 మందిని ఎంపిక చేశారు. సిరిసిల్ల జిల్లా నుంచి 18 మందికి అవకాశం ఉండగా పది మంది, మహబూబాబాద్ జిల్లాలో 21 సీట్లకు నలుగురు, వరంగల్ రూరల్ జిల్లాలో 66 సీట్లకు ఐదుగురు మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో వారిని నేరుగా ఎంపిక చేశారు.

'బాలీవుడ్ నటులపై కేసు నమోదు చేయండి'

హైదరాబాద్, వెలుగు: రూ.20 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ 'క్యూనెట్'కు ప్రచారం చేసిన బాలీవుడ్ నటులపై కేసులు నమోదు చేయాలని ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. "బాలీవుడ్ నటులు షారుక్ ఖాన్, అమిర్ ఖాన్, అనిల్ కపూర్, వివేక్ ఒబెరాయ్, జాకీ ష్రాఫ్ తదితరులు క్యూనెట్ కంపెనీని ప్రమోట్ చేశారు. కాబట్టే ప్రజలు గుడ్డిగా నమ్మి, డబ్బు కట్టి పోగొట్టుకున్నారు. వారిపై యాక్షన్ తీసుకోవాలి" అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

రైతు ఆశలకు 'కత్తెర'

మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి

హైదరాబాద్, వెలుగు:

కత్తెర పురుగు దెబ్బకు మక్క పంట సాగు దారుణంగా తగ్గిపోయింది. వానాకాలంలో మొక్కజొన్న దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిన 'ఫామ్ ఆర్మీ వార్మ్' యాసంగి పంటపైనా ప్రభావం చూపుతోంది. కత్తెర పురుగుకు ఎలా అడ్డుకట్ట వేయాలో తెలియక రైతులు యాసంగిలో మక్క సాగు తగ్గించేశారు. సాధారణంగా ఏటా రబీలో లక్షా 66 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగవుతుంది. కానీ ఈసారి ఇప్పటివరకు 94 వేల హెక్టార్లలో (57 శాతం) మాత్రమే సాగు మొదలైనట్టు వ్యవసాయ శాఖ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

మహమ్మారిలా పురుగు

కొన్నేళ్లుగా కష్టానికి తగ్గ ఫలితం వస్తుండటంతో రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి పెట్టారు. కానీ ఈఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్నపై 'కత్తెర పురుగు' దాడి చేయడంతో రైతులు నష్టపోయారు. యాసంగిలో అయినా పంట చేతికి వస్తుందనుకుంటే ఇప్పుడూ ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఏటా నవంబర్ నుంచే మొక్కజొన్న వేయడం మొదలవుతుంది. అయితే మొక్కలు ఎదగడం మొదలైన నెలన్నర రోజులకే కత్తెర పురుగు మహమ్మారిలా విరుచుకుపడింది. గుర్తించే లోపే తీవ్రంగా నష్టం ఉంటోంది. కొత్త రకం తెగులు కావటంతో రైతులకు పెద్దగా అవగాహన లేదు. వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న పంట సాగు ఎక్కువగా సాగవుతోంది. ఇందులో ప్రతి చోటా కత్తెర పురుగు దెబ్బ తప్పడం లేదు. దీంతో దిగుబడి సగానికి పడిపోయే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎదగని మొక్కలు

ఒకప్పుడు అమెరికా, ఆఫ్రికా దేశాలకే పరిమితమైన కత్తెర పురుగు కొన్నేళ్ల కింద మన దేశంలోకి ప్రవేశించింది. తొలుత ఉత్తరాది రాష్ట్రాల్లో మొదలైన దాడి.. దక్షిణాది రాష్ట్రాలకు పాకింది. మన రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, బిహార్, తమిళనాడు, ఏపీ రాష్ట్రాల్లో మొక్కజొన్నపై కత్తెర పురుగు తీవ్ర ప్రభావం చూపుతోంది. పంట వేసిన నెల, నెలన్నర రోజులకే పురుగు దాడి చేస్తోంది. ఆకులకు రంధ్రాలు చేయడంతోపాటు కాండంలోకీ ప్రవేశించి మొక్కలు ఎదగకుండా చేస్తున్నాయి. కంకులు కూడా ఏర్పడటం లేదని రైతులు అంటున్నారు. కత్తెర పురుగు లేత ఆకులను మాత్రమే తింటుందని, మొక్కజొన్న కంకులను ఏమీ చేయదని వ్యవసాయ శాఖ అధికారులు తొలుత భావించారు. లింగాకర్షణ బుట్టలను మొక్కజొన్న చేలలో ఏర్పాటు చేయాలని, నైట్రోజన్ సంబంధిత ఎరువులను వాడాలని సూచించారు. కానీ పురుగు తీవ్రతతో పరిస్థితి చేయిదాటినట్టుగా కనిపిస్తోంది. నష్టాన్ని ఆలస్యంగా గుర్తించిన వ్యవసాయ యంత్రాంగం ఇప్పుడిప్పుడే చర్యలపై దృష్టి సారిస్తోంది. కత్తెర పురుగు దాడిని ఎలా ఎదుర్కోవాలో కరపత్రాలు ముద్రించి రైతులకు పంచుతున్నారు. అయితే వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని, తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్లు వస్తున్నాయి.




పురుగు కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న కంకులు. (కింద) మొక్కజొన్న పంటపై పురుగు

- యాసంగి సాగుపై ఎఫెక్ట్.. ఇప్పటిదాకా 57 శాతమే మొదలు
- సరిగా ఎదగని మొక్కలు.. దిగుబడి సగానికి తగ్గే అవకాశం
- ఆందోళనలో రైతన్న
- ఆలస్యంగా స్పందించిన వ్యవసాయ శాఖ



ఆదివారం | హైదరాబాద్
13.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu
03

ప్రజలే నిర్ణేతలు



శనివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశాల్లో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూపీ సీఎం యోగి. పక్కన ప్రధాని మోదీ, అమిత్‌షా

- కూటములు విఫల ప్రయోగం
- సిద్ధాంతాలు పక్కనబెట్టి ఒక్కటవుతున్నారు
- ప్రజల కన్నా వాళ్లకు పవరే ముఖ్యం
- అన్నదాతలు.. శక్తి దాతలు.. వారి కోసం ఎంతో చేస్తున్నాం
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రధాని

న్యూఢిల్లీ:

రాబోయే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ శంఖం పూరించింది. రెండురోజుల పాటు ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో దీని చుట్టే ప్రసంగాలు సాగాయి. ఎలా ముందుకు వెళ్లాలి? ప్రతిపక్షాలను ఎదుర్కోవడం ఎలా అని కార్యకర్తలకు అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. సమావేశాల చివరి రోజైన శనివారం ప్రధాని నరేంద్ర మోడీ సుమారు 80నిమిషాల పాటు ప్రసంగించారు. మళ్లీ ఎవరికి అధికారం అప్పజెప్పాలో దేశ ప్రజలే నిర్ణయిస్తారని ఆయన పేర్కొన్నారు. అవినీతి మచ్చ అంటని వాళ్లను ఎన్నుకుంటారో.. అవినీతిలో మునిగిపోయినవాళ్లను ఎన్నుకుంటారో ప్రజల ఇష్టమన్నారు. 'బంధుప్రీతి, అవినీతిని ప్రోత్సహించాలని కొన్ని పార్టీలు భావిస్తున్నాయి. వాళ్లు కేంద్రంలో మజ్బూర్ సర్కార్ (బలహీనమైన ప్రభుత్వం) ఉండాలని ఆశిస్తున్నారు. మేము మజ్బూత్ సర్కార్ (బలమైన ప్రభుత్వం) ను కోరుకుంటున్నాం. మజ్బూర్ సర్కార్‌తో అవినీతి రాజ్యమేలుతుంది. అవినీతిలో మునిగినవాళ్లు అలాంటి సర్కార్‌నే ఆశిస్తారు' అని ప్రతిపక్షాలపై ఫైర్ అయ్యారు. 'దేశ ప్రధాన సేవక్‌ను నిర్ణయించేది దేశ ప్రజలే. ఎవరైనా దోచుకునే వారిని ఇంట్లో పనిమనిషిగా పెట్టుకుంటారా? సేవ చేసేవారిని పెట్టుకుంటారా? దేశ భవిష్యత్తు కోసం రాత్రి, పగలు నిబద్ధతతో కష్టపడి సేవచేసేవారు కావాలో.. అవినీతిపరులు, దోచుకునే వారు కావాలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తేలుస్తారు' అని అన్నారు. దేశ చరిత్రలో అవినీతి కేసు లేని ఒకే ఒక్క ప్రభుత్వం ఉందంటే అది తమదేనని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతికి తావు లేకుండా పాలన సాగించవచ్చని తాము రుజువు చేసినట్లు తెలిపారు. బీజేపీని రెండోసారి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ పొత్తులను ఆయన లైట్‌గా తీసుకున్నారు. కేంద్రంలో బంధుప్రీతికి ఆస్కారమిచ్చే బలహీనమైన ప్రభుత్వం ఉండాలని ఎస్పీ, బీఎస్పీ కోరుకుంటున్నాయని విమర్శించారు.

రాముడి గుడికి కాంగ్రెస్ అడ్డు

అయోధ్య రామమందిరం వివాదం ఏళ్ల తరబడి కొనసాగుతూ ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందని ప్రధాని మోడీ ఆరోపించారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ ముందుకు సాగకుండా సొంత న్యాయవాదులతో అడ్డంకులు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. దేశంలో ఇప్పటికీ పేదరికం ఉందంటే దానికి కాంగ్రెస్ పాలనే కారణమన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ యంత్రాంగమంతా అవినీతిమయమైందని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్‌తోపాటు అగస్టా వెస్ట్ లాండ్ కేసులను ఆయన ప్రస్తావించారు. 'కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలమయం. ఇంతటి ఘన చరిత్ర గల కాంగ్రెస్ నాయకులు ఎదుటి వారి మీద అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంటుంది. కొందరు ప్రజల సొమ్మును, ప్రజల భూములను దోచుకొని, రాచరిక పాలన అందించారు. ప్రస్తుతం వారు బెయిల్‌పై తిరుగుతున్నారు. అలాంటివాళ్లు మమల్ని విమర్శించడమా? ఆ నాయకులకు న్యాయం మీద నమ్మకం లేదు. నమ్మకం మీదే నమ్మకం లేదు. వారికి అధికారం మీదే వ్యామోహం' అంటూ రాహుల్, సోనియాగాంధీపై పరోక్ష విమర్శలు చేశారు. డిఫెన్స్ డీల్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ తప్పించుకొని తిరుగుతున్న మధ్యవర్తిని ఇండియాకు తీసుకొచ్చి విచారిస్తున్న తొలి ప్రభుత్వం కూడా తమదేనని అగస్టా వెస్ట్‌లాండ్ కేసు మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్ అంశాన్ని ప్రస్తావించారు.

వాళ్లకు సిద్ధాంతాలు లేవు

'కాంగ్రెస్‌పై పోరాటం చేయడానికి పుట్టిన పార్టీలు ఇప్పుడు అదే కాంగ్రెస్ తో కలిసి పనిచేస్తున్నాయి' అంటూ పరోక్షంగా టీడీపీని ఉద్దేశించి మోడీ వ్యాఖ్యానించారు. సిద్ధాంతాల కంటే అధికారమే ముఖ్యం అన్నట్లుగా కొన్ని రాజకీయ పార్టీలు ప్రవర్తిస్తున్నాయని, కుర్చీల కోసం విలువలకు పాతర వేస్తున్నాయని ఆయన అన్నారు. బ్లాక్ మనీకి, అవినీతికి వ్యతిరేకంగా తాము ముందుకు వెళ్లడం వారికి నచ్చడం లేదని, అయినా తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. దేశ రాజకీయ చరిత్రలో కూటముల ప్రయోగం విఫలమైందని, కూటములు టార్గెట్ తనను గద్దెదించడమేనని దుయ్యబట్టారు.

పేదల మేలుకే కోటా

పేదలకు మేలు చేయడానికి కోటా బిల్లు తీసుకువచ్చినట్లు ప్రధాని మోడీ స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకువచ్చిన బిల్లు చరిత్రాత్మకమైందని అన్నారు. కోటా బిల్లు వల్ల ఇతర వర్గాల ప్రయోజనాలు ఏమాత్రం దెబ్బతినవని భరోసా ఇచ్చారు. బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవన్నారు. ఈ బిల్లు వల్ల యువ శక్తికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. దేశ ప్రజల ప్రయోజనం కోసం ఎన్నో నిర్ణయాలు తీసుకున్నామని, 'బేటీ బచావో, బేటీ పడావో' లాంటి మంచి నిర్ణయాలను కూడా కొందరు హాస్యాస్పదంగా చూశారని దుయ్యబట్టారు.

సీబీఐ అంటే ఎందుకంత భయం ?

సీబీఐ పేరు చెబితేనే కొన్ని రాష్ట్రాలు భయపడుతున్నాయని ప్రధాని అన్నారు. తమ రాష్ట్ర పరిధిలో సీబీఐ విచారణకు ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అనుమతి ఇవ్వకపోవడాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అక్రమాలు లేకపోతే సీబీఐని చూసి భయపడాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. 'అప్పట్లో యూపీఏ సర్కార్ అనేక అంశాల్లో మమ్మల్ని వేధించింది. నాడు గుజరాత్ సీఎంగా ఉన్న నాపై ఎన్నో దాడులు చేయించింది. సీబీఐని ఉసిగొల్పింది. అమిత్‌షాను జైల్లో కూడా పెట్టించింది. నిజాయితీగా ఉన్నాం కాబట్టి మేము భయపడలేదు. ఆనాడు గుజరాత్‌లో సీబీఐని కట్టడి చేయడానికి నేను ఏ రోజూ ప్రయత్నించలేదు' అని అన్నారు.

రైతు ఆదాయం 2020 నాటికి రెండింతలు

రైతులు ఆదాయాన్ని 2020నాటికి రెండింతలు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోడీ తెలిపారు. 'అన్నదాతలను గత ప్రభుత్వాలు ఓటు దాతగానే చూశాయి. మేము మాత్రం శక్తి దాతగా చూస్తున్నాం. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను మాత్రమే కాదు.. 2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు పగలు, రాత్రి మేము నిజాయితీగాపనిచేస్తున్నాం. పండించిన పంటకు 1.5 రెట్లు కనీస మద్దతు ధర దక్కేలా చూస్తున్నాం. రైతులకు ఎంతో చేయాల్సి ఉంది. అన్ని సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని అనుకోవడం లేదు. అయినా చేసి తీరుతాం' అని భరోసా ఇచ్చారు. 'కాంగ్రెస్ హయాంలో రుణాలను రెండు రకాల పద్ధతిలో ఇచ్చేవారు. ఒకటి కామన్ ప్రాసెస్.. రెండోది కాంగ్రెస్ ప్రాసెస్. కామన్ ప్రాసెస్ సామాన్యుల కోసమైతే.. కాంగ్రెస్ ప్రాసెస్ అవినీతిపరుల కోసం. ప్రజల సొమ్మును అవినీతిపరులకు అప్పజెప్పారు' అని విమర్శించారు.

ఉత్తరాన పొత్తుపొడుపు

పాతికేళ్ల తర్వాత ఏకమై బీజేపీకి సవాలు విసురుతున్న ఎస్పీ, బీఎస్పీ

వెలుగు బ్యూరో:



ఢిల్లీకి దగ్గరి దారిగా ఉత్తరప్రదేశ్‌ను చెప్పుకుంటారు. జాతీయ రాజకీయాల్లో యూపీకి ఉన్న ప్రాధాన్యం వల్లే దేశానికి ఎక్కువమంది ప్రధానమంత్రులను అందించిన ప్రత్యేకతను సొంతం చేసుకుంది. 2014 ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో బీజేపీ పూర్తి మెజారిటీ సాధించడానికి, ఎన్డీయే అధికారంలోకి రావడానికి యూపీలో సాధించిన సీట్లే కీలకం. అప్పట్లో ఎవరూ ఊహించని విధంగా 80 సీట్లలో బీజేపీ ఏకంగా 71 సీట్లు సాధించింది. ఎన్డీయే మిత్రపక్షం అప్నాదళ్‌కు మరో రెండు సీట్లు వచ్చాయి. రాష్ట్రంలో ఎస్పీ, బీఎస్పీలు బలమైన పార్టీలుగా ఉండగా, జాతీయ పార్టీలుగా బీజేపీ, కాంగ్రెస్‌లకు పరిమితంగా బలం ఉన్న పరిస్థితుల్లో నాటి ఫలితాలు అందరికీ షాకిచ్చాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య తర్వాత సానుభూతి ప్రభావంతో రాజీవ్ గాంధీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత మూడు దశాబ్దాల పాటు ఏ పార్టీకీ సొంతంగా మెజార్టీ రాలేదు. మళ్లీ యూపీలో క్లీన్ స్వీప్ చేయడం ద్వారానే బీజేపీ 281 సీట్లు సాధించి తిరుగులేని బలం సంపాదించుకుంది. ఇప్పుడు అక్కడే బీజేపీకి సవాలు ఎదురవుతోంది.

కమలానికి కులనొప్పి?

కులరాజకీయాలకు కంచుకోట లాంటి యూపీలో మహాకూటమి ఏర్పాటు బీజేపీకి ఇబ్బంది కలిగించేదే. దీనిపై ఇప్పటికే సంకేతాలు వచ్చాయి. 2014 ఎన్నికల తర్వాత 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తిరుగులేని విజయం సాధించిన బీజేపీ ఆ తర్వాత ప్రతి ఉప ఎన్నికలోనూ ఓడిపోతూ వచ్చింది. దీనికి కారణం ఎస్పీ, బీఎస్పీలు చేతులు కలపడమే. చివరికి సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య సొంత సీట్లైన గోరఖ్‌పూర్, ఫుల్ పూర్ లలోనూ కూటమి అభ్యర్థులు విజయాలు సాధించారు. తర్వాత బీజేపీ ఎంపీ మరణం వల్ల జరిగిన ఖైరానా ఉప ఎన్నికలోనూ ఇదే సీన్ రిపీటైంది. ఈ ఎన్నికల్లో అజిత్ సింగ్ నేతృత్వంలోని ఆర్ఎల్డీ అభ్యర్థికి మహాకూటమి పూర్తిగా మద్దతిచ్చింది. దీంతో బీజేపీ అభ్యర్థి మృగాంక సింగ్‌ను అటు పార్టీ బలం, ఇటు తండ్రి చనిపోయిన సానుభూతి కలిసినా గెలిపించలేకపోయాయి.

1.5 శాతమే తేడా

2014 ఎన్నికల్లో బీజేపీ, మిత్రపక్షాలకు 43.63 శాతం ఓట్లు పడ్డాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీలు విడివిడిగా సాధించిన ఓట్లు కలిపితే 42.12 శాతం అవుతుంది. రెండు కూటముల మధ్య తేడా 1.5 శాతం మాత్రమే. 2017 అసెంబ్లీ ఎన్నికల ప్రకారం చూస్తే బీజేపీ కూటమి 41.7 శాతం ఓట్లు సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి పోటీ చేసినా ఎస్పీ సొంతంగానే 22 శాతం ఓట్లు సాధించింది. విడిగా పోటీచేసిన బీఎస్పీ ఓట్లు శాతం కలిపితే రెండు పార్టీలకూ 42.5 శాతం ఓట్లు పడ్డాయి. అంటే బీజేపీ కూటమి కంటే 0.8 శాతం ఓట్లు ఎక్కువ వచ్చాయి. దీంతో తాము చేతులు కలిపితే బీజేపీని మట్టికరిపించవచ్చన్న ధీమానే మహాకూటమికి దారితీసింది. యూపీలో అత్యధికంగా ఓబీసీల జనాభా 42 శాతం ఉంటే అందులో 10 శాతం మంది యాదవులు ఉన్నారు. ముస్లిం వర్గాలు మొదటి నుంచీ ఎస్పీకి అండగా ఉంటున్నాయి. యాదవులు కాకుండా ఇతర వర్గాల ఓబీసీలు 32 శాతం వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువమందితో పాటు 20 శాతం జనాభా ఉన్న అగ్రకులాలవారు బీజేపీకి మద్దతుగా ఉంటున్నారు. ఇక బీఎస్పీకి 21 శాతం జనాభా ఉన్న ఎస్సీలు కంచుకోటగా ఉన్నారు. ఇప్పుడు మహాకూటమిగా మారడం వల్ల యాదవ, దళిత, ముస్లిం ఓట్లు ఏకమవుతాయని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. గతంలో ఉన్న మోడీ హవా ఇప్పుడు లేదనీ, వ్యతిరేక ఓటు కూడా తమకు కలిసొస్తుందని భావిస్తున్నారు. దీంతో మహాకూటమికి 40కిపైగా సీట్లు వచ్చే అవకాశం ఉందని ఇటీవలి సర్వేలు చెబుతున్నాయి.

కాంగ్రెస్ తో ఎందుకు దూరం?

యూపీలో మహాకూటమిలో కాంగ్రెస్ లేకపోవడం ఆసక్తి రేపింది. పైగా ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్ బరేలీ, అమేథీలను వదిలి మిగిలిన సీట్లను ఎస్పీ, బీఎస్పీలు పంచుకున్నాయి. రాజకీయ వ్యూహం ప్రకారమే మహాకూటమికి కాంగ్రెస్ ను దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు 7 శాతమే. గాంధీ కుటుంబం కంచుకోటలైన అమేథీ, రాయ్ బరేలీ తప్ప ఎక్కడా గెలవలేదు. ఇవి కాకుండా మరో 10, 12 సీట్లలో మాత్రమే కాస్త పోటీ ఇవ్వగలిగే స్థాయిలో మాత్రమే కాంగ్రెస్ కు నాయకత్వం, కేడర్ మిగిలింది. దీంతో ఆ పార్టీని కూటమిలో కలుపుకొని ఎక్కువ సీట్లు ఇవ్వడం బీజేపీకి మేలు చేస్తుందని ఎస్పీ, బీఎస్పీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలో కాంగ్రెస్ ఉంటే పోటీ మొత్తం మోడీకి, ఇతర పార్టీలన్నిటికీ మధ్య జరుగుతోందన్న భావన వస్తుంది. ఇది హిందూ ఓట్లు, మైనారిటీ ఓట్ల మధ్య పోరాటంగా ప్రచారం చేసే అవకాశం ఉందని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. అందుకే 'అవగాహన ' ప్రకారమే కాంగ్రెస్ ను దూరం పెట్టినట్లు భావిస్తున్నారు. బీజేపీ గెలిచే అవకాశం ఉన్నచోట్ల కాంగ్రెస్ అగ్రకులాల అభ్యర్థులను నిలబెడితే కమలనాథుల అగ్రకులాల ఓటు బ్యాంకు చీలిపోతుందన్న వ్యూహంతో మహాకూటమి ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి గెలిచిన మూడు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెట్టడం వల్ల అగ్రకులాలవారి ఓట్లు చీలిపోయినట్లు అంచనాలున్నాయి. మూడుచోట్ల గెలిచిన అభ్యర్థుల మెజారిటీ కంటే కాంగ్రెస్ కు పడిన ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇలానే వచ్చే ఎన్నికల్లోనూ కొన్ని చోట్ల కాంగ్రెస్ సొంతంగా బరిలోకి దిగే అవకాశం ఉంది.

యూపీలో 2014 లోక్ సభ ఫలితాలు

పార్టీ	సీట్లు	ఓట్లశాతం
బీజేపీ, అప్నాదళ్	73	43.63
ఎస్పీ	5	22.35
బీఎస్పీ	0	19.77

2017 అసెంబ్లీ ఎన్నికలు

పార్టీ	ఓట్లశాతం
బీజేపీ, మిత్రులు	41.7
ఎస్పీ, కాంగ్రెస్	28.5
బీఎస్పీ	22.5

యూపీలో కులాలవారీ జనాభా శాతం

ఓబీసీలు	42
ఎస్సీలు	21
అగ్రకులాలు	20
ముస్లింలు	17

లబ్ధిదారులను కలవండి

క్యాడర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సూచన

న్యూఢిల్లీ:

మూడు హిందీ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలతో నైతిక స్థైర్యం కోల్పోవద్దని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ చీఫ్ అమిత్ షా పిలుపునిచ్చారు. వచ్చే లోక్ సభ ఎన్నికలు చాలా కీలకమైనవన్నారు. 'మూడు రాష్ట్రాల ఎన్నికల్లో మన శత్రువులు గెలిచారు. అయితే వారు మనల్ని ఓడించలేదు. ఫలితాలు సరిగా రాలేదంతే. మనం ఇంకా బరిలోనే ఉన్నాం. పార్టీ కార్యకర్తలు నైతిక స్థైర్యం కోల్పోవద్దు. ఈ ఏడాది మనకు మంచి అవకాశం ఉంది' అని శనివారం బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఆయన దిశానిర్దేశం చేశారు. 'లోక్ సభ ఎన్నికలు మనకు కీలకం. భారీ విజయం సాధిస్తే, పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించే అవకాశం బీజేపీకి దక్కుతుంది' అని అన్నారు. మోడీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో లబ్ధి పొందిన 22 కోట్ల మందిని కలవడంతో పాటు, 13 అంశాల కార్యక్రమాలపై కార్యకర్తలు దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఉదయం 10.30 గంటల్లోపు కార్యకర్తలు, వారి కుటుంబసభ్యులు, స్నేహితులు ఓటేయాలని అమిత్ షా సూచించారు. 22 కోట్ల మంది లబ్ధిదారుల ఆశీర్వాదం ఉన్న తమను ఏ కూటమి ఓడించలేదని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఓటరును కలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ రాష్ట్రాలకు వెళ్లి బీజేపీని గెలిపించి, ప్రధాని మోడీని రెండోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.

మళ్లీ బీజేపీదే గెలుపు: జైట్లీ

రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ధీమా వ్యక్తం చేశారు. సాటిలేని మోడీ నాయకత్వాన్ని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ క్యాడర్‌కు ఆయన సూచించారు. రాబోయే ఐదునెలల కాలం ఎంతో కీలకమైందని, పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోడీ నాయకత్వం బీజేపీకి అతి పెద్ద బలమని పేర్కొన్నారు.

'ప్రజాస్వామ్యం కోసం ప్రతిపక్షాలు ఏకం'

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలు నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరిగే యుద్ధం వంటివని కాంగ్రెస్ చెప్పింది. బీజేపీ నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయని తెలిపింది. బలమైన ప్రభుత్వం కావాలో, లేక బలహీన సర్కార్ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్న ప్రధాని మోడీ కామెంట్‌ను తప్పుబట్టింది. కాంగ్రెస్ ఎన్నడూ బలహీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ చెప్పారు. రైతుల కోసం కేంద్రం చేసిందేమీ లేదని, మూడు హిందీ రాష్ట్రాల్లో బీజేపీ ఓటమే ఇందుకు నిదర్శనమని అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితులు దిగజారాయని విమర్శించారు.

ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు?

- తీర్పు రిజర్వు చేసిన మండలి చైర్మన్

హైదరాబాద్, వెలుగు: టీఆర్ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్సీలపై వేటుకు రంగం సిద్ధమైంది. కొద్ది రోజులుగా జరుగుతున్న విచారణ శనివారం పూర్తికాగా, తీర్పును మండలి చైర్మన్ స్వామిగౌడ్ రిజర్వు చేశారు. 19 నుంచి కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం కానున్నందున, అంతకుముందే వేటు వేయొచ్చని సమాచారం.

టీఆర్ఎస్‌వి తప్పుడు ఆరోపణలు

శుక్రవారం ఎమ్మెల్సీ రాములు నాయక్ తరఫు న్యాయవాది, శనివారం యాదవ రెడ్డి, భూపతి రెడ్డి తరఫు న్యాయవాదులు స్వామిగౌడ్ ఎదుట వాదనలు వినిపించారు. యాదవ రెడ్డి, భూపతి రెడ్డి ఏ పార్టీలో చేరలేదని, టీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని చెప్పినట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ ఇచ్చిన పేపర్ క్లిప్పింగ్స్, వీడియోలు తప్పు అని, వాటి ఆధారంగా నిర్ణయం తీసుకోవద్దని చైర్మన్ దృష్టికి భూపతి రెడ్డి తరఫు న్యాయవాది సృజన్ రెడ్డి తీసుకెళ్లారు. పార్టీ మారిన వారిపై వేటు వేయాలని టీఆర్ఎస్ తరఫున న్యాయవాది మోహిత్ రావు విన్నవించారు. తర్వాత స్వామిగౌడ్ తీర్పును రిజర్వు చేశారు.

వారు అనర్హతకు అర్హులు: పల్లా

అనర్హతకు ఆ ముగ్గురు ఎమ్మెల్సీలు అర్హులేనని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. నెల రోజులుగా జరుగుతున్న విచారణ పూర్తయిందని, త్వరలోనే నిర్ణయం వస్తుందని తెలిపారు. మండలి మీడియా పాయింట్‌లో పార్టీ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, న్యాయవాది మోహిత్ రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "టీఆర్ఎస్ నుంచి ఎన్నికైన వారు అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ మారారు. ఎన్నికల్లో పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించిన పేపర్ క్లిప్పింగులు, వీడియోలు స్వామిగౌడ్‌కు అందచేశాం. వాటి ఆధారంగా వేటు వేయాలని కోరాం" అని పల్లా చెప్పారు.

ఎన్ఐఏకి ఎలా అప్పగిస్తారు?

- జగన్ పై దాడి కేసులో కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టిన చంద్రబాబు

విజయవాడ, వెలుగు: రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిపై దాడి కేసును ఎన్ఐఏకి ఎలా అప్పగిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. దీనిపై నిరసన తెలుపుతూ శనివారం ప్రధాని నరేంద్ర మోడీకి ఐదు పేజీల లేఖ రాశారు. "ఎన్ఐఏ చట్టం ప్రకారం అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ, సరిహద్దు సమస్యలు, టెర్రరిస్ట్ కేసులను మాత్రమే ఎన్ఐఏకి అప్పగించాలి. పౌర విమానయాన చట్టం 1982 ప్రకారం ఈ కేసు ఎన్ఐఏ పరిధిలోకి రాదు. 2008లో గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు మోడీ ఎన్ఐఏ చట్టాన్ని వ్యతిరేకించారు" అని అన్నారు. హోంశాఖ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోడీని చంద్రబాబు డిమాండ్ చేశారు.

ఐకానిక్ బ్రిడ్జికి భూమిపూజ

కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ పవిత్ర సంగమం దగ్గర కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి చంద్రబాబు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.1,387 కోట్లతో 3.2 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి అమరావతిని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారితో కలుపుతుంది. దీనికి కూచిపూడి ఐకానిక్ బ్రిడ్జిగా పేరు పెడతామని బాబు ప్రకటించారు.

ఏపీలో ఓటర్లు 3.69 కోట్లు

విజయవాడ, వెలుగు: ఏపీలో ఓటర్ల తుది జాబితాను ఎలక్షన్ కమిషన్ శనివారం ప్రకటించింది. ఏపీలో ఓటర్ల సంఖ్య 3 కోట్ల 69 లక్షల 33 వేల 91గా తేల్చింది. పురుషులు కోటి 83 లక్షల 24 వేల 588 మంది ఉండగా, మహిళా ఓటర్లు కోటి 86 లక్షల 4 వేల 742 కోట్ల మంది ఉన్నట్లు చెప్పింది. థర్డ్ జెండర్ ఓటర్లు 3,761 వేల మంది ఉన్నారు. 40.13 లక్షల మంది ఓటర్లతో తూర్పుగోదావరి అత్యధిక ఓటర్లు ఉన్న జిల్లాగా నిలిచింది. అత్యల్పంగా విజయనగరంలో 17.33 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ తెలిపింది.

యూపీలో శాయశక్తులా పోరాడతాం

ఎస్పీ–బీఎస్పీ కూటమిపై రాహుల్ గాంధీ

దుబాయ్: ఉత్తర ప్రదేశ్‌లో బలం పుంజుకుని వచ్చే లోక్ సభ ఎన్నికల్లో శాయశక్తులా పోరడతామని కాంగ్రెస్‌పార్టీ చీఫ్‌రాహుల్ గాంధీ చెప్పారు. యూపీలో ఎస్పీ, బీఎస్పీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించిన గంటల వ్యవధిలోనే రాహుల్ స్పందించారు. దుబాయ్‌లో పర్యటిస్తున్న ఆయన అక్కడ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ను దూరం పెట్టి ఆ రెండు పార్టీలు ఒక్కటవ్వడాన్ని రాజకీయ నిర్ణయంగా చెప్పారు. ఆ రెండు పార్టీల నేతల పట్ల తనకు గౌరవముందన్నారు.

‘ధూప దీపా’నికి మస్తు దరఖాస్తులు

హైదరాబాద్, వెలుగు :

నిధులలేమితో తెరుచుకోని ఆలయాలకు దన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ధూప దీప నైవేద్యం’ పథకానికి విశేష స్పందన వస్తోంది. ఈ పథకం కిందకు మరిన్ని దేవాలయాలను చేర్చాలనే వినతులు వెల్లువలా వస్తున్నాయి. నిత్యపూజలు జరిగే ఆలయాల్లో ఆదాయానికి ఏ ఇబ్బందీ ఉండదు. నిర్వహణ, అర్చకులు, సిబ్బంది జీతాలు భక్తుల కానుకలు, విరాళాలపై వెళ్లిపోతుంటాయి. కానీ చిన్నచిన్న గ్రామాల్లోని గుడులకు అంతగా ఆదాయం ఉండదు. గుడి కట్టిన కొత్తలో దాతల సాయం అందినా.. క్రమేణా కటకట తప్పదు. దీంతో గుడితలుపులు తీసే వారుండరు. అటువంటి ఆలయాలను నిలబెట్టేందుకే ప్రభుత్వం ధూప దీప నైవేద్యం పథకాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పథకం కింద ఆదాయంలేని 1,805 ఆలయాలకు కామన్ గుడ్ ఫండ్ కింద ప్రభుత్వం నెలకు రూ.6 వేలు ఇస్తోంది. వీటిలో రెండు వేలు నిర్వహణ, నాలుగు వేలు పూజారి వేతనం. ఈ ఏడాది మరో 1,840 ఆలయాలనూ ఈ స్కీమ్‌లో చేర్చనున్నారు. అయితే ఈ పథకంలో మా ఊరి దేవాలయాన్నీ చేర్చండంటూ దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. వీటిని పరిశీలించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ.. నిబంధనల ప్రకారం దేవాదాయ శాఖకు సిఫారసు చేస్తోంది.

రాష్ట్రం ఏర్పడ్డాక పెరిగిన ఫండ్

ఉమ్మడి రాష్ట్రంలో ఈ స్కీమ్ కింద ఒక్కో ఆలయానికి రూ.2,500 ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2015లో ఈ మొత్తాన్ని రూ.6000లకు పెంచారు. ఈ స్కీమ్ కిందకు మరిన్ని దేవాలయాలను తీసుకొచ్చే ఉద్దేశంతో 2017లో ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో 5,289 అప్లికేషన్లు రాగా వాటిని పరిశీలించి 1,840 ఆలయాలను ఎంపిక చేశారు.

ఇప్పటికీ అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలాఉంటే రాష్ట్ర వ్యాప్తంగా అనేక దేవాలయాలు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే పది వేల ఆలయాలు నిర్మాణంలో ఉన్నాయని అర్చక సంఘాల నేతలు చెబుతున్నారు. గతంలో కంటే ఆలయాల సంఖ్య మరింత పెరుగుతోందని వారంటున్నారు. ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ఆలయాలకు భారీగా చందాలిస్తున్నారని, జనం కూడా నిధులు పోగుచేసి ఆలయాలు నిర్మించుకుంటున్నారని చెబుతున్నారు.



- ఇప్పటికే 1,805 ఆలయాలకు నిధులు
- నెలకు రూ.6 వేల చొప్పున ఇస్తున్న ప్రభుత్వం
- త్వరలో మరో 1,840 గుడులకూ వర్తింపు
- మరికొన్నింటినీ చేర్చాలంటూ సిఫారసులు

రాష్ట్రంలో దేవాలయాలు:	12,302
సొంత ఆదాయంతో నడుస్తున్నవి:	646
ట్రస్ట్ బోర్డులున్నవి:	360
ధూప దీప నైవేద్యం స్కీమ్‌లో ఉన్నవి:	1,805
త్వరలో ఈ స్కీమ్ కిందకు రానున్నవి:	1840

పర్యవేక్షణ ఉండాలి

ఆదాయంలేని ఆలయాలకు ధూప దీప నైవేద్యం కింద సాయం అందడం మంచి పరిణామం. ఈ స్కీమ్‌లో మరిన్ని ఆలయాలను చేర్చాలనే డిమాండ్లు వస్తున్నాయి. నిధుల వినియోగంపై పర్యవేక్షణ అవసరం.

- భానుమూర్తి శర్మ, తెలంగాణ అర్చక సంఘం

ధాన్యం సేకరణ విధానం భేష్

కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ కార్యదర్శి శ్రీరవికాంత్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో ధాన్యం సేకరణ విధానం బాగుందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ కార్యదర్శి శ్రీరవికాంత్ ప్రశంసించారు. ప్రతి ఐదు కిలో మీటర్లకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులకు మద్దతు ధర ఇస్తుండడాన్ని అభినందించారు. శనివారం ఆయన పౌరసరఫరాల భవన్‌లో ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లాకు చెందిన రైతు మల్లారెడ్డి, కొత్తగూడెం జిల్లాకు చెందిన భాస్కర్, వరంగల్ జిల్లాకు చెందిన రహీమ్, మంచిర్యాల జిల్లాకు చెందిన రేషన్ లబ్ధిదారుడు వెంకటేష్‌తో వీడియోకాల్‌లో మాట్లాడారు. గత ఏడాది కంటే ధాన్యం దిగుబడి ఎందుకు ఎక్కువ వచ్చింది? కనీస మద్దతు ధర లభిస్తుందా? ధాన్యం విక్రయించిన తర్వాత ఎన్ని రోజులకు డబ్బులు ఇస్తున్నారు? వంటి అంశాలపై ఆరా తీశారు. రైతు ఖాతాలో డబ్బు జమ చేయడం, ఐరిస్, బయోమెట్రిక్, రేషన్ పోర్టబిలిటీ వంటివి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని ప్రశంసించారు. రాష్ట్రంలో ధాన్యం దిగుబడి ఎలా పెరిగిందని ఆయన అడిగిన ప్రశ్నకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సమాధానమిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సకాలంలో కురిసిన వర్షాలు, 24 గంటలు కరెంట్, రైతు బంధు వంటి పథకాలు కారణాలని వివరించారు. గత ఏడాది 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈ ఏడాది ఈ ఇప్పటివరకు 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నట్టు వివరించారు.



శనివారం ప్రగతి భవన్‌లో వివిధ అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

ఎట్లుండి మన జీవిక

బడ్జెట్ అట్లనే ఉండాలె ■ బతుకుదెరువు ఏందో, అవసరాలేందో లెక్కలు తీయండి: సీఎం కేసీఆర్

హైదరాబాద్, వెలుగు:

- ఐదేండ్ల తర్వాత తెలంగాణ ఎలా ఉండాలో చూడండి
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం కేసీఆర్

‘‘తెలంగాణ ‘జీవిక’ఏంది, ఇక్కడి జనం బతుకుదెరువు ఎట్లా ఉంటది, జీవనోపాధి ఏంటి.. ఇలాంటి విషయాలు ముందు గుర్తించండి. దాని ఆధారంగా బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయండి. ఏడాది కోసం కాదు, ఐదేళ్ల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చేయండి. ఈ రోజు తెలంగాణ ఎక్కడుంది, ఐదేళ్ల తర్వాత ఎలా ఉండాలన్న కల్పనతో ప్రణాళిక తయారుచేయండి. బడ్జెట్ ప్రతిపాదనల కన్నా ముందు ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించండి’’అని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రజల అవసరాలన్నింటినీ పరిష్కరించే తీరులో బడ్జెట్ ఉండాలని సూచించారు. శనివారం ప్రగతి భవన్‌లో బడ్జెట్ రూపకల్పన, 15వ ఫైనాన్స్ కమిషన్ రాక, హైదరాబాద్ అభివృద్ధి, మంత్రులు, కార్యదర్శులకు శిక్షణ తదితర అంశాలపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్షించారు.

బతుకుదెరువు కేంద్రంగా..

రాష్ట్ర బడ్జెట్ ప్రజల బతుకుదెరువు ఆధారంగా రూపొందాలని కేసీఆర్ అన్నారు. ప్రభుత్వం కేవలం చట్టాలను రూపొందించే వ్యవస్థ మాత్రమే కాదని, ప్రజలకు ఒక దోహదకారిగా, మార్గదర్శిగా, సహాయకారిగా, ఉత్ప్రేరకంగా ఉండాలని చెప్పారు. వివిధ రంగాల అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం టాస్క్‌ఫోర్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. బడ్జెట్ అభివృద్ధిని పెంపొందించే రీతిలో ఉండాలని, ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే అంశాలేమున్నాయో ముందు గుర్తించాలని స్పష్టం చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తాను ప్రజలకు ఏం చేయగలననే ఆలోచిస్తున్నానని తెలిపారు. తొందరేమీ లేదని, నిదానంగా ప్రతిపాదనలు తయారుచేయాలని, ఈ క్రమంలో మన బలం, బలహీనతలు ఏమిటో గుర్తించాలని సూచించారు. ఐదేళ్లలో ఎంత ఆదాయం వస్తుందో అంచనా వేసి, ఎట్లా ఖర్చు చేయాలో అవగాహనకు రావాలని చెప్పారు.

వాస్తవాలను దృష్టిలో పెట్టుకోండి

సాగునీటి అంచనాల సమయంలో నీటి వనరులను దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారు. నడుస్తున్న ఆర్థిక సంవత్సరం సహా రానున్న ఐదేండ్ల కాలానికి కలిపి ఇరిగేషన్ శాఖ కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్రం నుంచి అన్ని సాగునీటి ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులను సాధించడం గొప్ప కార్యమని అభివర్ణించారు. ఈ విషయం బడ్జెట్‌లో ప్రతిఫలించాలన్నారు. గొర్రెల పంపిణీకి మంచి ప్రజాదరణ వచ్చిందని, దాన్ని మరింత ముందుకు తీసుకెళదామని చెప్పారు. చేపల పెంపకం, చేనేత రంగం పురోగతిని సాధిస్తున్నాయని, చేనేత రంగానికి అంతర్జాతీయ మార్కెట్లో అవకాశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ సగటు వినియోగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని, బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనకు ముందు ఇలాంటి అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

ఫైనాన్స్ కమిషన్ తీరు సరిగా లేదు

పదిహేనో ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని, అదో ఆనవాయితీ అని కేసీఆర్ వివరించారు. వాళ్లు వచ్చే ముందే ఒక మైండ్ సెట్‌తో ఉంటారని, రాష్ట్రాల అవసరాలను పూర్తిగా గుర్తించరని పేర్కొన్నారు. వాస్తవానికి వాళ్లు ముందుగా రాష్ట్రానికి వచ్చి ప్రభుత్వాలతో చర్చించాలని, ప్రాధాన్యతలను తెలుసుకుని, టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సాంస్కృతిక, ఆర్థిక జీవన విధానం ఉంటుందని, ఫైనాన్స్ కమిషన్ కేవలం విధాన రూపకల్పనకు పరిమితమైతే మంచిదని వ్యాఖ్యానించారు. స్వాతంత్రం నాటి నుంచి కేంద్రం, రాష్ట్రాల్లో వివిధ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయని, ఎవరూ గుణాత్మక మార్పు తీసుకురాలేకపోయారని విమర్శించారు. ఆయా ప్రభుత్వాల విధానాలతో ప్రజల్లో అసంతృప్తి పెనవేసుకుపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ వంటివి ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఆ తప్పుల్ని పరిశీలించుకోవాల్సి ఉందని, దేశ ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం నడుం బిగించాల్సి ఉందని చెప్పారు. ‘‘నేను నీతి ఆయోగ్ సమావేశంలో ఈ విషయంపై మాట్లాడాను. కేంద్రం, రాష్ట్రాలకు అడ్డం పడకూడదు, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల విషయంలో ఉదారంగా ఉండాలని చెప్పాను. కానీ కేంద్రం చిన్న చిన్న నిధుల కోసం కూడా ఎన్నో కండిషన్లు పెడుతుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు ఉండాల్సిన తీరులో లేవు. విధానపర నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వాలను అగౌరవ పరిచే రీతిలో ఉంటున్నాయి..’’అని కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకే రాష్ట్రం తరఫున ఫైనాన్స్ కమిషన్‌కు సమర్పించే మెమోరాండం ఇక్కడి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉండాలని చెప్పారు.

మంత్రులు, కార్యదర్శులకు శిక్షణ

కేబినెట్ విస్తరణ అనంతరం మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులకు వారి విధులు, బాధ్యతలపై శిక్షణ ఇప్పించాలని సీఎం సూచించారు. ఇందుకోసం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (అస్కీ) ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశ ఆర్థిక వ్యవహారాలు, సచివాలయ విధి విధానాలు, బడ్జెట్ రూపకల్పన నిబంధనలు, అందుకు పరిమితులు, ప్రాధాన్యాలకు అనుగుణంగా శిక్షణ ఉంటుందన్నారు. అన్ని శాఖల్లో చేపట్టే కార్యక్రమాలు సంబంధిత మంత్రులు, కార్యదర్శులకు తెలిసేలా శిక్షణ ప్రణాళిక ఉంటుందని చెప్పారు. సీఎం సమీక్షలో సీఎస్ ఎస్‌కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, సీఎంవో అధికారులు నర్సింగ్ రావు, స్మితా సబర్వాల్, సందీప్ సుల్తానియా, మానిక్ రాజ్, స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారి, ఉన్నతాధికారులు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, నీతూ ప్రసాద్, జీటీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం, విద్యపై దృష్టి పెడదాం

కాళేశ్వరం అద్భుతమైన పర్యాటక కేంద్రంగా రూపొందుతుందని, దాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలను పరిశీలించాలని కేసీఆర్ సూచించారు. పర్యాటక రంగంలో రాబడికి ఏమేం అవకాశాలున్నాయో పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వ్యవసాయాన్ని మరింత ఆధునీకరించే దిశగా దృష్టి పెట్టాలని, యూనివర్సిటీల్లో ఇందుకు అవసరమైన పరిశోధనా సౌకర్యాలున్నాయేమో పరిశీలించాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలను బడ్జెట్ ప్రతిపాదనల్లో పెట్టాలన్నారు. ప్రైవేటు వర్సిటీల వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలపై దృష్టి కేంద్రీకరించాలని, ఇతర దేశాల విద్యార్థులూ రాష్ట్రానికొచ్చి చదువుకునేలా చూడాలన్నారు. ఆరోగ్యవంతమైన తెలంగాణను చూడాలని, వైద్య రంగంలో మానవీయ కోణంలో సంస్కరణలు తీసుకురావాలని చెప్పారు. పారిశ్రామిక రంగ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

గ్లోబల్ సిటీగా మార్చాలె

‘‘హైదరాబాద్ గ్లోబల్ సిటీ. దేశంలోని ఐదు పెద్ద నగరాల్లో ఒకటి. ఇక్కడి ప్రజల కోసం కనీసం వంద పార్కులు అవసరం. నగరాన్ని రక్షించడానికి, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సిటీ మాస్టర్ ప్లాన్ రెడీ చెయ్యాలె. ఆ ప్లాన్‌లో ఒక్క పేరాను మార్చాలంటే కేబినెట్ నిర్ణయం తీసుకునేంత పటిష్టంగా నియమావళి రూపొందించాలె. రానున్న ఐదేండ్లలో నగరాన్ని అద్భుతమైన గ్లోబల్ సిటీగా రూపొందించేందుకు ఎంత ఖర్చు చేయాల్సి ఉంటుందో బడ్జెట్ ప్రతిపాదనల్లో పెట్టండి.’’

ఊళ్లకు బైలెల్లిన్రు

సంక్రాంతికి సొంతూళ్లకు హైదరాబాద్‌వాసులు | హైదరాబాద్–విజయవాడ హై వేపై భారీ రద్దీ | పంతంగి టోల్ గేట్ వద్ద 3 కి.మీ. ట్రాఫిక్‌జామ్



శనివారం ఉదయం 9 గంటల సమయంలో భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద టోల్‌గేట్ కన్పించనంతగా కురుస్తున్న మంచు, బారులుతీరిన వాహనాలు



సంక్రాంతి రద్దీతో శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోవడంతో అవతలి వైపు నుంచి రైలెక్కేందుకు ప్లాట్‌ఫారం దిగి పరుగులు తీస్తున్న జనం. పండుగకు ఊళ్లకు వెళ్లేవారితో రెండు రోజులుగా రాజధానిలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి.

యాదాద్రి, వెలుగు:

పట్నం పల్లెకు బైలెల్లింది. సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు హైదరాబాద్ నగరవాసులు సొంతూళ్ల బాటపట్టారు. దీంతో శనివారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద తెల్లవారుజాము నుంచి వాహనాలు బారులు తీరాయి. పొగమంచు కూడా తోడవడంతో 3 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. టోల్ చెల్లించేందుకు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. టోల్‌గేట్ దాటేందుకు ఒక్కో వాహనానికి 2 గంటలకు పైగా సమయం పట్టింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

12 గేట్లు అటువైపే

65వ నంబర్ జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు నిత్యం 17 వేల నుంచి 18 వేల వాహనాలు వెళ్తుంటాయి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు పెద్దఎత్తున హైదరాబాద్‌లో స్థిరపడటం, సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు బయలుదేరడంతో హైవేపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద 16 గేట్లు ఉన్నాయి. విజయవాడ వైపు వెళ్లేవారి కోసం 12, హైదరాబాద్ వైపు వెళ్లే వారి కోసం 4 గేట్లు తెరిచారు. అయినప్పటికీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కేవలం శనివారం ఒక్క రోజే దాదాపు 40 వేలకు పైగా వాహనాలు విజయవాడ వైపు వెళ్లినట్టు టోల్‌గేట్ అధికారులు వెల్లడించారు.

16 దాకా టోల్ రద్దు

సంక్రాంతి సందర్భంగా జాతీయ రహదారులపై రద్దీ నేపథ్యంలో టోల్‌గేట్ల వద్ద ఫీజుల వసూళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి సంక్రాంతి పండుగ మరుసటి రోజు బుధవారం (16వ తేదీ) వరకు టోల్ వసూళ్లను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

తింటరు.. తిరుగుతరు

- తెలంగాణలో మాటలు ఎక్కువ, చేతలు తక్కువ
- ఐఏఎస్ అజీమ్ వివాదాస్పద వ్యాఖ్యలు

సికింద్రాబాద్, వెలుగు: ‘తెలంగాణలో తింటారు. తిరుగుతారు. మాటలెక్కువ. పని తక్కువ. కొందరైతే అసలు పనే చేయరు. మరికొంత మంది ‘మై ఏక్‌కు మార్‌తుమ్. దోకు మార్‌తుమ్, తీన్‌కూ మార్‌తుమ్’ అంటుంటారు’ అని రాష్ట్ర యూత్ సర్వీసెస్ డైరెక్టర్ అండ్ కమిషనర్ మహమ్మద్ అజీమ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నేషనల్ యూత్ డే సందర్భంగా శనివారం హుస్సేన్‌సాగర్ సమీపంలోని యూత్ హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రా వాళ్లు తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేస్తారన్నారు. సమావేశం తర్వాత యువజన సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి మహేశ్, కార్యదర్శి ఎలగాని వెంకటేశ్ గౌడ్ మాట్లాడారు. అజీమ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. ఆయన అలా మాట్లాడటం రాష్ట్ర యువతను అవమానపర్చడమేనన్నారు. అజీమ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

చెన్నైలో రూ.8 కోట్ల బంగారం పట్టివేత

చెన్నై: చెన్నై ఎయిర్ పోర్టులో రూ.8 కోట్లు విలువైన 24 కిలోల బంగారం పట్టుబడింది. దక్షిణ కొరియాకు చెందిన ఇద్దరు ప్రయాణికుల నుంచి ఈ బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

కుంభమేళా.. సంపాదన భళా

మేళాతో చిన్న వ్యాపారులకు మంచి ఆదాయం

- మూడు రెట్లకు మించి సంపాదన
- రెండు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు
- హోటళ్లలో ఇప్పటికే 50 శాతం బుకింగ్

లక్నో/అలహాబాద్: కుంభమేళా.. ప్రపంచంలోనే అతి పెద్ద జాతర.. కుప్పలుతెప్పలుగా జనాలొచ్చే పండుగ.. ఎంత మంది ప్రజలొస్తారో అంత భారీగా వ్యాపారమూ జరుగుతందిక్కడ. రెండు నెలల ముందు నుంచే ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతాయి. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో ఈసారి జనవరి 15 నుంచి మార్చి 4 వరకు అర్ధ కుంభమేళా జరగబోతోంది. గంగా, యమునా సంగమం వద్ద నివసించే చిన్న వృత్తుల వాళ్లకు మేళా జరిగే రెండు నెలలు నిజంగా పండుగే. ఆ రోజుల్లో వారి ఆదాయం మూడు రెట్లవుతుంది. పూలు, పండ్లు, తినే పదార్థాలు అమ్మే వారు, పూజారులు, ఆటో డ్రైవర్లు, బోట్‌మెన్, బార్బర్లు సుమారు రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు సంపాదిస్తారు. ఇక హోటల్ ఇండస్ట్రీ, టూర్ ఆపరేటర్లు, మెడికల్, ఎకో టూరిజంలో సుమారు 2 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలొస్తాయి. ఏడాదికి 50 శాతం ఆక్యుపెన్సీ ఉండే హోటల్ ఇండస్ట్రీలో మేళా సందర్భంగా సుమారు 15 నుంచి 25 శాతం ఆక్యుపెన్సీ పెరుగుతుంది. రూంల ధరలు రెండు రెట్లకు మించి పెంచినా ఇప్పటికే సగం రూంలు బుక్కయ్యాయి. ఇక 600 మంది పడవ నడిపే వారు కూడా తమ ఆదాయం కనీసం మూడు రెట్లవుతుందని భావిస్తున్నారు. సాధారణ రోజుల్లో రూ. 300 నుంచి రూ. 800 సంపాదిస్తే మేళా రోజుల్లో ఆదాయం మూడు రెట్లకన్నా ఎక్కువవుతుందని వాళ్లు చెబుతున్నారు. పూజారులూ రోజూవారీ ఆదాయం రూ. 600 నుంచి రూ. 12 వేల వరకు పెరుగుతుందంటున్నారు.

రూ. 7 వేల కోట్లతో ఏర్పాట్లు

సుమారు 15 కోట్ల మంది వేడుకలకు హాజరవుతారన్న అంచనాతో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో రూ.2,800 కోట్లను మేళా నిర్వహణకు, రూ.4,300 కోట్లను అభివృద్ధి పనులకు కేటాయించింది. మరో రూ.247 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తోంది. నిధుల్లో ఎక్కువగా అలహాబాద్ నగర అభివృద్ధికే ఖర్చు చేస్తున్నారు. ఏడాదిన్నరలో 9 ఫ్లై ఓవర్లు కట్టారు. 6 రైల్వే అండర్‌పాస్‌ల వెడల్పు పెంచారు. 64 ట్రాఫిక్ క్రాసింగ్‌లు, 264 రోడ్లను మరమ్మతు చేశారు. 2013లో జరిగిన మహా కుంభమేళాకు అప్పటి సర్కారు రూ.1,214 కోట్లు ఖర్చు చేసింది.

యూత్ లీడర్‌షిప్ క్యాంప్‌కు రండి

గవర్నర్‌కు ఎంపీ కవిత ఆహ్వానం

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ జాగృతి నిర్వహించే యూత్ లీడర్‌షిప్ క్యాంపు సదస్సుకు రావాలని గవర్నర్ నరసింహన్‌ను ఎంపీ కవిత కోరారు. సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే 19న హాజరవుతున్నారని, 20వ తేదీ సాయంత్రం ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను కోరారు. శనివారం రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానం అందజేసిన తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించారు. ‘18వ తేదీ నుంచి 20వరకు నోవాటెల్ హోటల్‌లో ఈ సదస్సు ఉంటుంది. పది వేర్వేరు వేదికల్లో సెమినార్లు, డిబేట్లు జరుగుతాయి. తొలి రోజు యువత, అభివృద్ధిపై ప్రముఖ జర్నలిస్టు శేఖర్‌గుప్తా చర్చాగోష్ఠి ఉంటుంది. రెండో రోజు యువతలో నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేట్, ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. గాంధేయమార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు.. అంశంపై చర్చ ఉంటుంది. మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 17 అంశాల లక్ష్య సాధన కోసమే సదస్సు నిర్వహిస్తున్నాం. దీనికి 103 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు’ అని ఆమె తెలిపారు.

ఆదివారం | హైదరాబాద్
13.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

ఎస్పీ38, బీఎస్పీ 38

సీట్లు పంచుకున్న బువా-భతీజా

లక్నో : ఒకప్పటి బద్ధ శత్రువులు ఎస్పీ, బీఎస్పీ ఉత్తరప్రదేశ్ లో పొత్తు కుదుర్చుకున్నాయి. ఈ ఏడాది జరిగే లోక్ సభ ఎన్నికల్లో చెరో 38 సీట్లలో కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. మరో రెండు సీట్లను మిత్రపక్షాలకు ఇస్తున్నట్లు ప్రకటించాయి. న్నాయి. కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ గెలిచిన రాయ్ బరేలి సెగ్మెంట్లలో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాయి.రాష్ట్రంలో మొత్తం 80 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతి శనివారం ఇక్కడ మీడియా సమావేశం ఏర్పాటు చేసి సీట్ల పంపకానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే టార్గెట్ చేసుకుని ఎస్పీ ,బీఎస్పీలు గ్రాండ్ అలయన్స్ గా ఏర్పడ్డాయి. అయితే కాంగ్రెస్ కు మాత్రం కూటమిలో చోటు కల్పించలేదు. కాంగ్రెస్ ను పొత్తుకు దూరం పెట్టడంపై బీఎస్పీ చీఫ్ మాయావతి వివరణ ఇచ్చారు. అలయన్స్ లో కాంగ్రెస్ ఉన్నా ఆ పార్టీ ఓట్లు మిగతా మిత్రపక్షాలకు పడవని ఆమె చెప్పారు. గతంలో జరిగిన అనేక ఎన్నికల్లో ఈ విషయం రుజువైందన్నారు. దీంతో కాంగ్రెస్ లేకుండానే అలయన్స్ ఏర్పాటు చేయాలని అఖిలేశ్ తో కలిసి తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాయావతి చెప్పారు. దేశ ప్రయోజనాల కోసమే ఎస్పీతో తాము జత కట్టినట్లు చెప్పారు.

బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే

అనేక అంశాల్లో కాంగ్రెస్ , బీజేపీ ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్, దేశంలో ఎమర్జెన్సీ విధిస్తే బీజేపీ హయాంలో ఎమర్జెన్సీ పరిస్థితులే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కొన్ని దశాబ్దాల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్నా ప్రజల కోసం చేసిందేమీ లేదని మండిపడ్డారు. నిజానికి కాంగ్రెస్ హయాంలోనే దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగాయన్నారు. అన్ని రంగాలు అవినీతిమయమయ్యాయని మాయావతి ఆరోపించారు.

బీజేపీని ఓడించి తీరుతాం

లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తీరుతామని మాయావతి అన్నారు. కోట్లాదిమంది ప్రజలు, మోడీ సర్కార్ పై అసంతృప్తిగా ఉన్నారు. బీజేపీ ప్రభుత్వం పై ఉన్న ఈ అసంతృప్తి ని ఓట్లుగా మలచుకోవడానికే తాము ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు. సమాజ్ వాది పార్టీతో తమ పొత్తు కేవలం లోక్ సభ ఎన్నికలకే పరిమితం కాదని బీఎస్పీ చీఫ్ చెప్పారు. యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అలయెన్స్ కొనసాగుతుందన్నారు. " 1993 లో అప్పటి బీఎస్పీ చీఫ్ కాన్షీరాం, ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్ కలిసి యూపీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మేమిద్దరం కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాం. పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, వెనుకబడిన వర్గాలు,దళితులు, మైనారిటీల ప్రయోజనాల కోసమే గ్రాండ్ అలయన్స్ ఏర్పాటైంది " అని మాయావతి అన్నారు.

ప్రధాని రేసులో మాయావతికి మద్దతు

ఈ సందర్భంగా లోక్ సభ ఎన్నికల తర్వాత ప్రధాని పదవికి మాయావతికి మద్దతు ఇస్తామన్న సంకేతాలు అఖిలేశ్ యాదవ్ ఇచ్చారు. "యూపీ నుంచి గతంలో చాలా మంది ప్రధానులయ్యారు. ఈసారి కూడా ఎవరైనా పీఎం అయితే మాకు సంతోషమే " అని అఖిలేశ్ కామెంట్ చేశారు.



శనివారం లక్నోలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మయావతి, అఖిలేశ్ యాదవ్

- పోటీకి ఎస్పీ, బీఎస్పీ అంగీకారం
- కాంగ్రెస్ కు దక్కని చోటు
- మిత్రపక్షాలకు రెండు సీట్లు
- బీజేపీ ఓటమే కూటమి లక్ష్యం
- అఖిలేశ్ యాదవ్, మాయావతి


ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు నేపథ్యంలో శనివారం వారణాసిలో ఆయా పార్టీల కార్యకర్తల సంబరాలు

2014 లోక్ సభ ఎన్నికల ఫలితాలు (80 సీట్లు)

పార్టీ	ఓట్ షేర్ (శాతం)	గెలిచిన సీట్లు
బీజేపీ	42.30	71
ఎస్పీ	22.20	05
బీఎస్పీ	19.60	0
కాంగ్రెస్	07.50	2
అప్నాదళ్	01.00	02

పొత్తులపై ఎవరేమన్నారు?

"ఒకరంటే మరొకరికి గిట్టదు. వారు మహాకూటమి గురించి మాట్లాడుతున్నారు. అవినీతి, రాజకీయ అస్థిర శక్తుల మధ్య కుదిరిన ఒప్పందం ఇది ."

- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

" వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ, బీఎస్పీ మధ్య కుదిరిన పొత్తును స్వాగతిస్తున్నా"

- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

" ఎస్పీ బీఎస్పీ కూటమితో ఉత్తరప్రదేశ్, బీహార్‌లో బీజేపీ పతనం ప్రారంభమైంది."

- ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్

"వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అన్నీ ఒక్కటి కావడమన్న ఆలోచన సరైంది కాదు. ప్రతిపక్షాల మధ్య కుదిరిన ఎలాంటి కూటమి అయినా ఆయా నాయకుల మధ్య తలెత్తే గొడవలతో కూలకతప్పదు."

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ

"ఎస్పీ, బీఎస్పీ పొత్తులు పెట్టుకున్నది రాజకీయ ఉనికిని కాపాడుకోడానికే. దేశం, ఉత్తరప్రదేశ్ ప్రయోజనాల కోసం కాదు .

- కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్

యూపీలో ఎన్నికల వ్యూహంపై ఇవాళ కాంగ్రెస్ నిర్ణయం

లక్నో: వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ లో ఎస్పీ, బీఎస్పీ కూటమిగా ఏర్పడిన నేపథ్యంలో ఆదివారం లక్నోలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం జరగనుంది. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనుంది. "గులాం నబీ ఆజాద్, యూపీసీసీ అధ్యక్షుడు రాజ్ బబ్బర్, ఇతర సీనియర్ నాయకులు ఆదివారం లక్నోలో సమావేశమై ఎన్నికల వ్యూహంపై తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శులు, నేషనల్ కమిటీలో ఉన్న యూపీ నేతలు హాజరవుతారు" అని యూపీసీసీ అధికార ప్రతినిధి అన్షు అవస్థి శనివారం చెప్పారు.

గెస్ట్‌హౌస్ ఘటన:

అది 1995 , జూన్ 2. లక్నోలోని ఓ గెస్ట్‌హౌస్‌లో మాయావతి మీటింగ్ నిర్వహిస్తున్నారు. అప్పుడే సమాజ్‌వాదీపార్టీకి చెందిన కార్యకర్తలు కొందరు గెస్ట్‌హౌస్‌లోకి దూసుకెళ్లారు. మాయావతి ఉన్న గదిని చిందరవందర చేశారు. ఎస్పీ కార్యకర్తలు ఆమెను కులంపేరుతో దూషించారు. ఈ సంఘటన మాయావతిని కలిచివేసింది. ఇదే ఎస్పీబీఎస్పీ కూటమి కుప్పకూలడానికి కారణమైంది. అంతకుముందు రెండేళ్ల క్రితం.. అంటే 1993లో జరిగిన ఎన్నికల్లో రెండుపార్టీలు కూటమిగా పోటీచేసి ఘనవిజయం సాధించాయి. గెస్ట్ హౌస్ సంఘటనతో రెండేళ్లకే రెండుపార్టీలు దూరమయ్యాయి. వేరుపడిన 23 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఎస్పీబీఎస్పీ కలిసిపోటీచేస్తున్నాయి.

మాయావతి ఏమన్నారు?

- పీఎం మోడి, అమిత్‌షాలకు నిద్రలేకుండా చేస్తాం.
- ఎస్పీ, బీఎస్పీ కలవడం దేశానికి ఎంతో అవసరం
- దేశ ప్రయోజనాల కోసం 1995 నాటి గెస్ట్‌హౌస్ సంఘటనను మరిచిపోవాలని నిర్ణయించుకున్నాం.
- కాంగ్రెస్‌తో పొత్తువల్ల బీఎస్పీఎస్పీకి రాజకీయంగా ఎలాంటి ఉపయోగం లేదు.

అఖిలేశ్ ఏమన్నారు?

- వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విభజించుపాలించు విధానం పనిచేయదు.
- ఉత్తరప్రదేశ్‌ను బీజేపీ కులప్రదేశ్‌గా మార్చింది
- పీఎం అభ్యర్థిగా మాయావతికి మద్దతు ఇస్తా.

ఆర్ఎల్డీకి చోటు దక్కేనా ?

ఎస్పీ, బీఎస్పీల ఆధ్వర్యంలో ఏర్పడ్డ గ్రాండ్ అలయన్స్ లో చోటు కోసం అజిత్ సింగ్ నాయకత్వంలోని 'రాష్ట్రీయ లోక్ దళ్' (ఆర్ఎల్డీ) ఎదురు చూస్తోంది. అలయన్స్ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆర్ఎల్డీకి అధికార ప్రతినిధి అనిల్ దూబే చెప్పారు. " బీజేపీకి వ్యతిరేకంగా ఇవాళే కూటమి ఏర్పడింది. కూటమి లీడర్లతో మేము మాట్లాడుతున్నాం " అని దూబే అన్నారు. సీట్ల కంటే కూటమిలో ఉండటానికే తాము ప్రాధాన్యం ఇస్తామన్నారు. యూపీలో బీజేపీ ఓటమే తమ టార్గెట్ అని స్పష్టం చేశారు. దీనికోసం భావసారూప్యం గల పార్టీలు ఒక జట్టుగా ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. కాగా కూటమి తమకు గౌరవప్రదమైన సీట్లు ఇస్తుందని ఆశిస్తున్నట్లు రాష్ట్రీయ లోక్ దళ్ నాయకులు చెప్పారు.



అమెరికా ప్రెసిడెంట్ పదవికి గురిపెట్టిన తులసి

వాషింగ్టన్: 2020 లో జరగనున్న అమెరికా ప్రెసిడెంట్ ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన ఉన్నట్టు డెమోక్రటిక్ పార్టీ నేత తులసి గబ్బార్డ్ ప్రకటించారు. వారం రోజుల్లోగా అధికారికంగా తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని 37 ఏళ్ల తులసి చెప్పారు. డెమోక్రాటిక్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసేందుకు మరో 12 మంది నాయకులు కూడా ఆసక్తి చూపిస్తున్నారని, వీరు కూడా త్వరలోనే తమ పేర్లను అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. వీరిలో ఇండియన్ సంతతికి చెందిన కాలిఫోర్నియా సెనేటర్ కమలా హారిస్ కూడా ఉన్నారు. హవాయ్ నుంచి హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు నాలుగుసార్లు తులసి ఎన్నికయ్యారు. చిన్నవయసులోనే హిందూ మతాన్ని స్వీకరించిన ఆమె..ఒకవేళ పార్టీ నుంచి అధ్యక్ష ఎన్నికలకు పోటీచేసే చాన్స్ లభిస్తేగనక ..అమెరికా అధ్యక్షబరిలోకి దిగనున్న తొలి హిందూగా రికార్డుల్లోకి ఎక్కుతారు.

కారణాలు ఎన్నో!

ప్రెసిడెన్షియల్ ఎన్నికల్లో పోటీచేయాలన్న ఆలోచన ఎందుకొచ్చిందో గబ్బార్డ్ చెప్పుకొచ్చారు. వాటికి గల కారణాలను ఆమె ఇలా చెప్పారు.

1. ప్రతి అమెరికన్‌కు ఆరోగ్య రక్షణ కల్పించడం.2.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నీరు, గాలి అందించడం.3. పర్యావరణాన్ని పరిరక్షించడం. అన్నింటి కన్నా ముఖ్యంగా శాంతి కోసం పోటీ చేయాలని భావిస్తున్నానని అన్నారు. తన మద్దతుదార్లకు ఈమేరకు ఈమెయిల్ కూడా రాశారు. "దేశం కోసం కలిసికట్టుగా ఉండాలని, మీతో కూడా మాట్లాడతాను" అని అభిమానులకు తులసి ట్వీట్ చేశారు.

అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా 2020 ప్రారంభంలో ప్రైమరీ ఎలక్షన్లో గెలుపొందినవారిని డెమోక్రాటిక్ అభ్యర్థిగా పార్టీ నామినేట్ చేస్తుంది. ఆ అభ్యర్థి అదేఏడాది నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థితో తలపడతారు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే రెండోసారి కూడా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తానని ప్రకటించారు. డెమోక్రటిక్ ప్రైమరీలో ఎన్నికైనవారే ట్రంప్‌తో తలపడతారు.



తులసి ప్రస్థానమిదీ..

- తులసి అమెరికాలోని సమోవా టెరిటరీలో పుట్టారు.
- చిన్న తనంలోనే హిందూ మతం తీసుకున్నారు.
- అమెరికా సైన్యం తరఫున ఇరాక్ యుద్ధంలో సేవలందించారు.
- హవాయి నుంచి అమెరికా ప్రతినిధుల సభకు నాలుగు సార్లు ఎన్నికయ్యారు.
- తండ్రి మైక్ గబ్బార్డ్ కూడా ఓ సెనేటర్.

ఫ్రాన్స్ లోని బేకరీలో పేలుడు, నలుగురు మృతి

చనిపోయినవారిలో ఇద్దరు ఫైర్ సిబ్బంది

ప్యారిస్: ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లోని ఓ బేకరీలో శనివారం ఉదయం భారీ పేలుడు జరిగింది. ఈఘటనలో నలుగురు చనిపోయారు. ఇందులో ఇద్దరు ఫైర్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు చెప్పారు. మరో 47మందికి తీవ్రంగా గాయాలయ్యాయని, 10మంది పరిస్థితి సీరియస్‌గా ఉందని ఇంటీరియర్ మంత్రి తెలిపారు. బేకరీలో గ్యాస్ పైప్ లీక్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ఆయన చెప్పారు. పేలుడు ధాటికి బేకరీ పూర్తిగా ధ్వంసం అయింది. భారీగా మంటలు ఎగసిపడ్డాయి. పార్కింగ్‌లోని కార్లు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకుని ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలు ఆర్పే క్రమంలో ప్రమాదవశాత్తు ఇద్దరు సిబ్బంది మంటల్లో చిక్కుకుని చనిపోయినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్యారిస్ మేయర్ హిడాల్గో మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.



అసహనం రాజ్యమేలుతోంది

దుబాయ్: నాలుగన్నరేళ్లలో ఇండియా లెక్కలేనంత అసహనాన్ని, ఆవేశాన్ని చవిచూసిందని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ చెప్పారు. ఇదంతా పాలకుల పుణ్యమేనని ఆరోపించారు. దుబాయ్ పర్యటనలో భాగంగా రెండో రోజు ఆయన ఐఎంటీ దుబాయ్ వర్సిటీని సందర్శించారు. వర్సిటీ విద్యార్థులతో మాట్లాడుతూ..సంస్కృతిలోనే సహనం ఇమిడి ఉందని, అలాంటిది గడిచిన నాలుగున్నరేళ్లలో దీనికి వ్యతిరేకమైన సంఘటనలు ఇండియాలో చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు. సమాజంలోని వివిధ మతాలు, కులాల మధ్య విద్వేషాలు కమ్ముకున్నాయని చెప్పారు. పాలకుల మనస్తత్వానికి ఇవి అద్దం పడుతున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితులను మార్చాలని, వచ్చే లోక్‌సభ ఎన్నికలలో ఎదురయ్యే సవాలు ఇదేనని రాహుల్ చెప్పారు.


అమెరికా షట్ డౌన్ రికార్డు

వాషింగ్టన్: అమెరికాలో కొనసాగుతున్న ప్రభుత్వ షట్ డౌన్‌శనివారంతో ఎక్కువకాలం పాటూ సాగిన షట్ డౌన్ గా చరిత్రలో నిలిచింది. మెక్సికో బోర్డర్ వాల్ విషయమై రేగిన వివాదం ప్రభుత్వ షట్ డౌన్ కు దారితీసింది. ఇటు ప్రభుత్వం, అటు ప్రతిపక్షాలు పట్టువిడవకపోవడంతో ఆర్థిక స్తంభన ఎంతకూ తొలగడంలేదు. గతంలో అత్యంత ఎక్కువ కాలం సాగిన షట్ డౌన్‌ల రికార్డులను మించి తాజా షట్ డౌన్ కొనసాగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రెసిడెంట్ డొనాల్డ్‌ట్రంప్‌దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆయన ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తొందరపడి ఎమర్జెన్సీ ప్రకటించడంవల్ల చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయని భావిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ స్తంభనతో దేశవ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలందడంలేదు.

గతంలో ఎప్పుడెప్పుడు..?

అమెరికా చరిత్రలోనే అతిపెద్ద షట్ డౌన్ బిల్ క్లింటన్ హయాంలో జరిగింది. 1995-96లో అప్పటి ప్రెసిడెంట్ క్లింటన్ నిర్ణయాలను రిపబ్లికన్లు తప్పుబట్టారు. విద్య, వైద్యం, ఎన్విరాన్మెంట్ పబ్లిక్‌హెల్త్‌కు సంబంధించి బడ్జెట్‌కేటాయింపులపై డెమోక్రాట్ ప్రెసిడెంట్ క్లింటన్, రిపబ్లికన్ల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాలు తీవ్రమయ్యాయి. రిపబ్లికన్లు సమర్పించిన స్పెండింగ్ బిల్లు ప్రతిపాదనలను క్లింటన్‌తోసిపుచ్చారు. ఫలితంగా నిధులు విడుదల కాక ప్రభుత్వం షట్ డౌన్ అయింది. షట్ డౌన్‌ను ఎత్తేసేందుకు ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో 1995 డిసెంబర్ 16 న అమెరికా ప్రభుత్వం ఆర్థికంగా స్తంభించిపోయింది. ఆ తర్వాతి ఏడాది జనవరి 6 వరకు ప్రభుత్వ కార్యకలాపాల్లో మెజారిటీ పనులపై షట్ డౌన్‌ప్రభావం పడింది. ఈ పీడియడ్ లో షట్‌డౌన్ 21 రోజుల పాటు కొనసాగింది.

- శనివారంతో 22 రోజులు
- చరిత్రలో ఎక్కువ కాలం కొనసాగిందిదే
- గతంలో క్లింటన్ హయంలో 21 రోజులు



గల్ఫ్‌వలసలు తగ్గుతున్నయ్

ముంబై: ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టే ఇండియన్ల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా తగ్గుతోందని ఇమిగ్రేషన్ లెక్కలు చెబుతున్నాయి. గతేడాది నవంబర్లో ప్రకటించిన గణాంకాలలో ఈ విషయం వెల్లడైంది. మొత్తంగా పదకొండు నెలల కాలంలో(2018 ఏడాదిలో) వలస వెళ్లిన వాళ్ల సంఖ్య 2.95 లక్షలు. 2014 ఏడాది నుంచి 2018 వరకు అయిదేళ్లలో గల్ఫ్ కు వెళ్లిన వలసదారుల సంఖ్య 62 శాతం తగ్గింది. 2017 ఏడాదితో పోలిస్తే ఈ తగ్గుదల 21 శాతంగా ఉంది. అదే 2014లో గల్ఫ్‌విమానం ఎక్కిన ఇండియన్ల సంఖ్య 7.76 లక్షలు. ఈమైగ్రేట్ ఎమిగ్రేషన్‌క్లియరెన్స్‌డాటా ఈ వివరాలు వెల్లడించింది. ఇక 2018లో ఇండియన్ కార్మికులు ఏయే దేశాలకు ఎక్కువగా వలస వెళ్లారనే వివరాలు చూస్తే..యూఏఈ 1.03 లక్షలు(35 శాతం), సౌదీ అరేబియా 65 వేలు, కువైట్ 52 వేలమంది వలస వెళ్లారు. 2017 లో భారతీయ కార్మికులు గల్ఫ్‌దేశాల్లో ఎక్కువగా సౌదీ అరేబియా వెళ్లేందుకే మొగ్గుచూపారు. ఖతార్ కు వెళ్లే ఇండియన్‌కార్మికుల సంఖ్య తగ్గకపోగా ఏటేటా పెరుగుతోంది.


నిఖిల్ కుమారస్వామి


ప్రజ్వల్ రేవణ్ణ

రాజకీయాల్లోకి దేవెగౌడ మనవలు?

లోక్ సభకు పోటీ చేసే అవకాశం

బెంగళూరు: మాజీ ప్రధాని హెచ్ డీ దేవెగౌడ కుటుంబం నుంచి మూడో తరం రాజకీయాల్లోకి వస్తోందా? రాజకీయ వారసుల జాబితాలోకి దేవేగౌడ మనవలు ప్రజ్వల్ రేవణ్ణ, నిఖిల్ కుమారస్వామి చేరబోతున్నారా? అంటే అవుననంటున్నాయి జేడీఎస్ వర్గాలు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో వారు పోటీ చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. గతనెల మంగళూరులో జేడీఎస్ నేత, ఎమ్మెల్సీ బీఎం ఫరూక్ కూతురు ఫిజా పెళ్లి వేడుకలో దేవెగౌడ, ఆయన కుమారులు కర్నాటక సీఎం కుమారస్వామి, మంత్రి రేవణ్ణ, కోడలు, ఎమ్మెల్యే అనితా కుమారస్వామి, మనవలు ప్రజ్వల్ రేవణ్ణ, నిఖిల్ కుమారస్వామిలు పాల్గొన్నారు. ఆ వేడుకలో ప్రజ్వల్, నిఖిల్ ప్రధాన ఆకర్షణగా ఉన్నారు. దేవెగౌడతో సరదాగా కలిసి పోయారు. అప్పట్నుంచి వారి రాజకీయ ప్రవేశంపై పుకార్లు మొదలయ్యాయి. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి రెండో తరం కుమారస్వామి, రేవణ్ణ కర్నాటక రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. కుమారస్వామి భార్య అనిత రెండు సార్లు ఎమ్మెల్యే. రేవణ్ణ భార్య భవానీ హాసన్ జిల్లాలో జడ్పీ మెంబర్ గా ఉన్నారు. దేవెగౌడ కుటుంబ సభ్యులే కీలక పదవుల్లో ఉండటంపై పార్టీ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. మూడో తరం రాజకీయాల్లోకి రావడంపై కార్యకర్తల్లో మాత్రం జోష్ కనిపిస్తోంది.

ఐఎంఎఫ్ బెయిల్ ఔట్ అక్కర్లే

వేరేదారులు చూస్తున్నాం: పాకిస్థాన్

కరాచీ: ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. బెయిల్ అవుట్ ప్యాకేజీ కోసం ఐఎంఫ్ ను కలిసేది లేదని, వేరేదారులు చూస్తున్నామని పాకిస్థాన్ ఆర్థిక మంత్రి అసద్ ఉమర్ శనివారం ప్రకటించారు. కరాచీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఇమ్రాన్ ఖాన్ సర్కారు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ 8 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ కోసం ఐఎంఎఫ్ తో చర్చలు జరిపింది. సౌదీ, చైనా, యూఏఈ లాంటి సన్నిహిత దేశాలతోనూ సంప్రదింపులు జరిపింది. ఐఎంఎఫ్ బెయిల్ అవుట్ ప్యాకేజీతో కఠినమైన ఆర్థిక నిర్ణయాలు అమలు చేయాల్సి ఉంటుందని, అందుకే ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని ఉమర్ అన్నారు. పాకిస్థాన్‌కు 6.2 బిలియన్ డాలర్ల సాయంపై గత నెల యూఏఈ టెర్మ్స్ అండ్ కండిషన్లను ఫైనల్ చేసింది. త్వరలో 3 బిలియన్ డాలర్లు ఇస్తామని ప్రకటన కూడా చేసింది. గత ఏడాది అక్టోబర్ లో సౌదీలో పాక్ ప్రధాని ఇమ్రాన్ పర్యటించారు. ఆ సమయంలో 6 బిలియన్ డాలర్ల సాయానికి సౌదీ ఒప్పుకుంది.

మంచు గడ్డలా కాశ్మీర్

శ్రీనగర్: కాశ్మీర్ లోయలో మంచు కురవడం ఆగట్లేదు. శ్రీనగర్, ఖ్వాజిగండ్, కుప్వారా, గుల్‌మార్గ్, రాజౌరి, సోన్‌మార్గ్, బందీపురాతో పాటు చాలా ప్రాంతాల్లో రోడ్లపై మంచు పేరుకుపోయింది. కాశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచు కారణంగా శ్రీనగర్‌లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎదురవుతోంది. ప్రధాన రహదారులన్నీ మూతపడ్డాయి. శుక్రవారం రాత్రి దక్షిణ కాశ్మీర్, శ్రీనగర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 0.8డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. హిమాచల్ ప్రదేశలోనూ టెంపరేచర్లు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. ట్రైబల్ జిల్లా కీలాంగ్‌లో మైనస్ 10.5 డిగ్రీలు, కిన్నూర్, కల్పలో మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని వాతావరణ అధికారులు తెలిపారు. సిమ్లా, చంబా జిల్లాల్లో మైనస్ 0.5, మైనస్ 1.2డిగ్రీలు నమోదయ్యాయని చెప్పారు. ఉత్తర భారతంలోని చాలా ప్రాంతాలు చలితో వణికిపోతున్నాయి.



శనివారం శ్రీనగర్‌లోభారీగా కురుస్తున్న మంచులో స్థానికులు

క్విక్ బైట్స్

స్కూల్ లైఫ్ ఎన్నటికీ మరువలేం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.వివేక్ వెంకటస్వామి
- 1993--94 ఎస్ఎస్‌సీ బ్యాచ్ఆత్మీయ సమ్మేళనం

పెద్దపల్లి, వెలుగు: విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మర్చిపోకుండా ఓల్డ్ స్టూడెంట్స్ కలిసి సన్మానించడం స్ఫూర్తి దాయకమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రం ప్రగతినగర్‌లోని ఇండియన్ మిషనరీ సెకండరీ స్కూల్‌కు చెందిన 1993-94 టెన్త్ స్టూడెంట్స్ సమ్మేళనం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి స్టూడెంట్ లైఫ్ మరిచిపోలేని అనుభూతి అన్నారు. ఈ స్కూల్‌లో చదువుకున్న ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సైతం ఇదే స్కూల్‌లో టీచర్‌గా చేశారని గుర్తు చేశారు. ఇండియన్ మిషన్ హైస్కూల్ అభివృద్ధికి విశాక చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యాబుద్ధులు నేర్పిన స్కూల్ రుణం తీర్చుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా స్థిరపడినవారు వారి అభివృద్ధికి కారణమైన స్కూల్, ఉన్న ఊరు, సమాజానికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఓల్డ్ స్టూడెంట్, టీఎస్‌టీఎస్ చైర్మన్ డా.చిరుమల్ల రాకేష్ మాట్లాడుతూ మిషన్‌హైస్కూల్ తనలాంటి ఎందరికో వెలుగు ప్రసాదించిందని, తమ ఉన్నతికి కారణమైన టీచర్లందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. పాత రోజుల్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం డా.వివేక్ వెంకటస్వామి, దాసరి మనోహర్‌రెడ్డి, చిరుమిల్ల రాకేష్, మున్సిపల్ చైర్మన్ రాజయ్య, ఉపాధ్యాయ బృందాన్ని పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు.



డా.వివేక్‌ను సన్మానిస్తున్న ఓల్డ్ స్టూడెంట్స్

ధాన్యాన్ని అమ్ముకునేందుకు వచ్చి

చలి తీవ్రత తట్టుకోలేక రైతు మృతి

మహబూబాబాద్, వెలుగు: ధాన్యాన్ని అమ్ముకుందామని వచ్చిన ఓ రైతు చలి తీవ్రత తట్టుకోలేక మృతిచెందిన సంఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ జరిగింది. గూడూరు మండలం నాయకపల్లికి చెందిన రైతు సత్తయ్య (65) తన భార్యతో సత్తెమ్మతో కలిసి శుక్రవారం ఉదయం 10 బస్తాల ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చాడు. కాంటాలు వేసే వరకు రాత్రి 11 కావడం, అప్పుడు తన గ్రామానికి వెళ్లేందుకు బస్సులు, ఆటోలు లేకపోవడంతో మార్కెట్‌లోని షెడ్‌లోనే పడుకున్నారు. తెల్లవారుజామున లేచిన సత్తయ్య ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. గమనించిన అతడి భార్య సత్తెమ్మ కేకలు వేయడంతో సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి వచ్చి చూసే వారికి అతడు మృతిచెందాడు. వెంటనే పోలీసులు, మార్కెట్ అధికారులకు సమాచారం అందించారు. కాగా జేసీ డేవిడ్, మార్కెట్ చైర్మన్ ఉమా భరత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశం, డీఎంవో సురేఖ, ఎస్ఐ సతీష్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ ఆఫీస్‌లో పడుకోనివ్వకపోవడంతోనే షెడ్‌లో పడుకున్నామని, ఆఫీస్‌లోగానీ, విశ్రాంతి గదిలో కానీ పడుకుంటే తన భర్త బతికే వాడని సత్తెమ్మ తెలిపింది.




కరీంనగర్ మహిళా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శాప్ ఎండీ దినకరన్‌బాబు, జిల్లా కలెక్టర్

ఖోఖో పోటీల విజేత కరీంనగర్

యాదాద్రి, వెలుగు: రాష్ట్ర స్థాయి 52వ సీనియర్ ఖోఖో పోటీల చాంపియన్‌గా కరీంనగర్ జిల్లా నిలిచింది. మహిళల, పురుషుల విభాగాలు రెండింట్లోనూ విజయకేతనం ఎగురవేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజులుగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి పురుషులు, మహిళల విభాగంలో ఒక్కో జట్టు చొప్పున పాల్గొన్నాయి. శనివారం సెమీఫైనల్స్ జరిగాయి. మహిళల విభాగంలో కరీంనగర్-నిజామాబాద్, రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జట్లు తలపడగా కరీంనగర్, మహబూబ్‌నగర్ జట్లు గెలిచాయి. పురుషుల విభాగంలో రంగారెడ్డి-వరంగల్, కరీంనగర్-ఖమ్మం జట్లు తలపడగా రంగారెడ్డి, కరీంనగర్ జట్లు గెలుపొందాయి. అనంతరం ఫైనల్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రెండు విభాగాల్లోనూ కరీంనగర్ విజేతగా నిలిచింది. శాప్ ఎండీ దినకరన్‌బాబు, జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, జేసీ రమేశ్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలను బహూకరించారు.



మాక్‌పోలింగ్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు



డమ్మీ బ్యాలెట్ పత్రం

ఏకగ్రీవానికి ఎన్నికలు

పంచాయతీల్లో నయా ట్రెండ్

జోరుగా సాగుతున్న మాక్ పోలింగ్

గెలిచిన వారే సర్పంచ్

పంచాయతీలను ఏకగ్రీవం చేస్తే రూ. 10 లక్షలు వస్తయ్. ఊర్ల సూస్తే ఎట్లయిన మేం పోటీ చేస్తమంటే మేం చేస్తమని ముగ్గురు నలుగురు ముందుకొస్తున్నరు. ఎంత సంజాయించిన ఎవరూ మాట ఇనట్లే. అందుకే ఊర్లలో ముందే మాక్ పోలింగ్ పెడుతున్నరు. పోటీల గెలిచినోళ్లనే ఏకగ్రీవం చేసి నజరానా తెచ్చుకోవాలని సోచాయిస్తున్నరు.

నిర్మల్, వెలుగు: గెలిస్తే ఏకగ్రీవం.. ఇదేంటి గెలిచిన తర్వాత ఇంకా ఏకగ్రీవమేంటని అనుకుంటున్నారా.. అవును ఇది నిజమే. నిర్మల్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవి ఏకగ్రీవం చేసేందుకు జోరుగా మాక్ పోలింగ్‌నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఎన్నికలంటే ఓటింగ్ జరిగి గెలుపొందడం.. లేదంటే గ్రామస్థులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. కానీ నిర్మల్ జిల్లాలో మాత్రం కొన్ని పంచాయతీల్లో ముందే ఎన్నికలు పెట్టి గెలిచిన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం అందుకునేందుకు కొన్ని గ్రామాల్లో ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 10 లక్షలు నజరాన ప్రకటించడంతో ఇలా చేస్తున్నారు. ఈ క్రమంలో పలు పంచాయతీల్లో ఏకగ్రీవం చేయాలంటే ముందుగా మాక్‌పోలింగ్‌నిర్వహించక తప్పడం లేదు. ఏకగ్రీవం చేసేందుకు పంచాయతీ పెద్దలు పోటీలో ఉన్న అభ్యర్థులకు నచ్చజెప్పినప్పటికి వారు వినకపోవడంతో మాక్ పోలింగ్ ద్వారా తేల్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారం నుంచి జిల్లాలో మాక్‌పోలింగ్ జోరు కొనసాగుతోంది.



తాంశ గ్రామంలో ఓటు వేస్తున్న గ్రామస్తులు

రోజుకో గ్రామంలో...

జిల్లాలో మాక్ పోలింగ్ చేపట్టినట్లు రోజుకో గ్రామంలో వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే నిర్మల్ మండలంలోని తాంశ, ఖానాపూర్‌లోని గోడల్‌పంప్‌తో పాటు మరో రెండు గ్రామాల్లో మాక్ పోలింగ్ నిర్వహించారు. కడెం మండలంలో కొత్తగా ఏర్పడిన కొర్రతండాలో శుక్రవారం ఇద్దరు అభ్యర్థుల మధ్య మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఒకరికి కత్తెర, మరొకరికి నాగలి గుర్తు ఏర్పాటు చేసి బ్యాలెట్‌పద్ధతిలో ఓటింగ్‌నిర్వహించారు. ఇందులో గెలిచిన వారిని ఏగగ్రీవంగా ఎన్నుకుంటారు. మరో వ్యక్తి పోటీ నుంచి విరమించుకుంటూ నామినేషన్ విత్‌డ్రా చేసుకోనున్నట్లు తెలిసింది. అదేవిధంగా దస్తూరాబాద్ మండలంలో ఓ గ్రామంలో సర్పంచ్ కోసం ఐదుగురు నామినేషన్ దాఖలు చేయగా, రూ. 6.35 లక్షలకు వేలం వేశారు. దీనిని పోటీలో ఉన్న అభ్యర్థి అడ్డుకున్నారు. ఈ నెల 6న కుంటాల మండలం సూర్యాపూర్ గ్రామంలో నిర్వహించిన వేలం పాటను గ్రామస్తులు అడ్డుకున్నారు. శనివారం ఖానాపూర్ మండలంలోని ఓ గ్రామంలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. అయితే ఇలా మాక్‌పోలింగ్ జరుగుతున్న గ్రామాలకు మీడియాతో పాటు ఇతరులు ఎవరినీ రానివ్వడం లేదు.

కొత్త పంచాయతీలే టార్గెట్

జిల్లాలో పాత పంచాయతీలు 240 ఉండగా కొత్తగా 156 ఏర్పడ్డాయి. ఈ కొత్త పంచాయతీలే ఏకగ్రీవానికి టార్గెట్‌గా పెట్టుకున్నారు. జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో ఏకగ్రీవ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఇందులో ఏకగ్రీవానికి ప్రయత్నించిన 31 పంచాయతీల్లో సింగిల్ నామినేషన్లు వచ్చాయి. ఈ గ్రామాలన్ని ఏకగ్రీవం కానున్నాయి. ఈ నెల 13న నామినేషన్ల ఉపసంహరణ ఉండడంతో ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈలోగానే వేలం పాట, మాక్‌పోలింగ్ ద్వారా అభ్యర్థులను పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

సోషల్ మీడియాలోనూ...

ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో ముందుగానే తెలుసుకోవడానికి కొందరు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుంటున్నారు. పోటీలో ఉన్నవారి పేర్లను వాట్సప్‌లో పంపిస్తూ ఆన్‌లైన్‌లో ఓటు వేయాల్సిందిగా కోరుతున్నారు. అయితే ఈ విధానంలో అభ్యర్థిని ఎన్నుకోవడంపై పూర్తి స్థాయిలో ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. ప్రధానంగా పల్లెల్లో చాలామంది వృద్ధులకు స్మార్ట్‌ఫోన్లను వినియోగించడంపై అంతగా అవగాహన లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఓటు వేయడం లేదు. ఇక నమూనా ఎన్నికలైతే అసలు ఎన్నికల్లానే పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. దీంతో ఈ విధానంపైనే చాలామంది మొగ్గు చూపుతున్నారు. ఎన్నికలతోనే అభ్యర్థిని ఏకగ్రీవం చేయాలని ఆలోచిస్తున్నారు. వచ్చే నజరానా రూ. 10 లక్షలు గ్రామాభివృద్ధికి వెచ్చించాలని అనుకుంటున్నారు.

ముందే ఒప్పందం

- గ్రామ అభివృద్ధికి నిధులిస్తామంటున్న అభ్యర్థులు
- ఏకగ్రీవం చేసేందుకు ముందుకొస్తున్న గ్రామస్తులు

మిర్యాలగూడ, వెలుగు పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్‌అయ్యేలా ఉన్నాయి. గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన తండాల్లో గ్రామస్థాయి లీడర్లను సమన్వయపరుస్తున్న మండల స్థాయి నేతలు ఏకగ్రీవం చేసేందుకు అవసరమైన ఒప్పందాలను కుదురుస్తూ ముందుకు సాగుతున్నారు. దామరచర్ల మండలంలోని ఓ తండాలో 200 లోపు ఓట్లున్నాయి. తండాను ఏకగ్రీవం చేసేందుకు సర్పంచ్ అభ్యర్థి రూ. 3 లక్షలు గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేటాయించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. మరో తండాలో సుమారు రూ. 4 లక్షలు గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఇస్తామనడంతో అతడినే సర్పంచిగా ఏకగ్రీవం చేసేందుకు నిర్ణయించారు. మరో తండాలో సర్పంచ్ అభ్యర్థి శ్మశానవాటికకు 8 గుంటల స్థలం ఇచ్చి, దానికి రూ. 8 లక్షలతో ప్రహరీ నిర్మిస్తానని ముందుకు రావడంతో అతడిని ఏకగ్రీవం చేయాలని భావిస్తున్నారు.

మానవ అనుబంధాల అల్లికే సాహిత్యం

ఖమ్మంటౌన్, వెలుగు: కన్నీళ్ల లోతులు చూడలేని వారు సాహిత్యాన్ని రాయలేరని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ అన్నారు. రావులపాటి నారాయణ మాణిక్యం పేరిట ఇచ్చే 'సాహితీ మాణిక్యం 2018' అవార్డును శనివారం ఖమ్మంలోని జమ్మిబండలో గల కవి సీతారాం ఇంటి వద్ద కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ప్రసాదమూర్తులకు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అనుబంధాల అల్లికే సాహిత్యమని అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో సాహితీవేత్తలు చేసిన సాహిత్య సృష్టి చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ వేదకుమార్ మాట్లాడుతూ హక్కులు, పర్యావరణం, సమాజం, పిల్లల కోసం రచనలు చేసే వారికి ఈ అవార్డు ఇవ్వడం సముచితంగా ఉంటుందన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు జి. లక్ష్మీనర్సయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ పాల్గొన్నారు.



పోలీస్‌ఆఫీసర్‌పై సీపీకి ఫిర్యాదు

ఖమ్మం టౌన్, వెలుగు : పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలన్న పోలీస్ బాస్ ఆదేశాలను కొంతమంది ఆఫీసర్లు పట్టించుకోవడం లేదు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవద్దని చెబుతున్నా చెవికెక్కించుకోవడం లేదు. ఖమ్మం నగర పరిధిలోని కోట్ల రూపాయల విలువైన భూవివాదంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి కలుగజేసుకోవడంపై ఫిర్యాదు అందడంతో సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ ఖైకొం డాయిగూడెం ల్యాండ్ ఇష్యూ గురించి కొందరు వచ్చిన ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టేటస్ కో మెయింటేయిన్ చేయాలని వారికి చెప్పాం. భూమికి సంబంధించిన కేసుల్లో చట్టం, న్యాయం ప్రకారమే చర్యలుంటాయి... ఎంక్వైరీ తర్వాతే ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ వివాదంపై సీపీ మాట్లాడుతూ.. 'నగరంలోని 1వ డివిజన్ ఖైకొండాయిగూడెంకు చెందిన 9 మంది రైతులకు సర్వే నంబర్ 222, 224 లో 13.16 ఎకరాల భూమి ఉంది. దానిని ఇటీవల ఓ వ్యక్తికి అమ్మారు. ఆయన అక్కడ వెంచర్ వేసేందుకు ప్రయత్నించగా అదే ప్రాంతానికి చెందిన కొందరు అక్కడ తమ భూమి కూడా ఉందని అడ్డుకున్నారు. వారు ఈ వివాదాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. భూమిని విక్రయించిన రైతులను ఆఫీస్‌కు పిలిపించిన ఓ పోలీసు ఆఫీసర్‌పరుష పదజాలంతో బెదిరించాడని, చంపుతానని అన్నట్లు బాధితులు చెబుతున్నారన్నారు. దీనిపై వారు సీపీకి ఫిర్యాదు చేశారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆటలాడండి.. అభివృద్ధిని చూడండి

- జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించిన హరీశ్‌రావు
- 29 రాష్ట్రాలకు చెందిన 700 మంది క్రీడాకారుల హాజరు

సిద్దిపేట, వెలుగు: సీఎం కేసీఆర్ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి క్రీడాకారులకు ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆధ్వర్యంలో 64వ జాతీయ అండర్ 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపి ఒలింపిక్స్, ఏషియాడ్, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని గమనించాలని కోరారు. సిద్దిపేట అభివృద్ధిని చూడండి, కోమటి చెరువును సందర్శించండి.. ఇక్కడి భోజనాన్ని ఆస్వాదించాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు జ్యోతి వెలిగించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించి కేరళ, చత్తీస్‌గఢ్ మధ్య జరిగిన పోటీని చూశారు. ఈ పోటీలకు 29 రాష్ట్రాలకు చెందిన 700 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మొదటి రోజు బాలుర విభాగంలో ఒడిశాపై ఢిల్లీ, నవోదయ విద్యా సమితిపై ఆంధ్రప్రదేశ్, హర్యానాపై పంజాబ్ జట్లు, బాలికల విభాగంలో ఉత్తరాఖండ్‌పై తెలంగాణ, పంజాబ్ పై ఢిల్లీ, చత్తీస్‌గఢ్ పై కేరళ జట్లు విజయం సాధించాయి. పోటీలు ఈనెల 16వ తేదీ వరకు జరగనున్నాయి.



సిద్దిపేటలో జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న హరీశ్ రావు



పోటీలో తలపడుతున్న బాలికలు



పిచ్ రెఢీ..!

- కోడి పందేలకు బిర్రులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- పెరటి కోళ్ల రూపంలో పెంపకం
- ఆహారంగా జీడిపప్పు, పిస్తా, బాదం
- రేపటి నుంచి షురూ

సంక్రాంతి వచ్చిందంటే గుర్తుకొచ్చేది కోడి పందేలే. ఈ పందేలు ఎక్కువగా ఆంధ్రలో జరిగేవి. ప్రస్తుతం మన రాష్ట్రంలోనూ జోరందుకుంటున్నాయి. ఏపీ సరిహద్దు జిల్లాల్లోని పలు మండలాల్లో కోడి పందేలకు బిర్రులు (పందేలు నిర్వహించే ప్రాంతాలు) రెడీ అయ్యాయి. పలు తోటలు వీటికి కేంద్రంగా మారుతున్నాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో కూడా పందెం కోళ్లు ఫైటింగ్‌కు సిద్ధమవుతున్నాయి. పందెంరాయుళ్లు పెరటి కోళ్ల రూపంలో వీటిని పెంచుతున్నారు. జీడిపప్పు, బాదం, పిస్తాలు పెట్టి బలంగా తయారు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేల నిర్వహణపై ప్రత్యేక కథనం..

వెలుగు నెట్‌వర్క్: పోరాటనికి కోడి పుంజులను తయారుచేయడం అంటే ఆషామాషీ పని కాదు. ప్రత్యేక బలవర్ధక ఆహార నియమావళి, వ్యాయామం, పోరాట శిక్షణ.. ఇలా ఎన్నో అంచెలుగా జాగ్రత్తగా ఒక్కో కోడి పుంజును పెంచుతారు. గుడ్డు నుంచి పిల్లగా మారిన తర్వాత 40 నాటు కోడి గుడ్లలోని పచ్చ సొనని తినిపిస్తారు. ఆ తర్వాత ఘుంటేలు, సోళ్లు, రాగులు ఇంకా పలు రకాల మేతలు ఒక్కో కోడి పుంజుకి పెడతారు. ఇవే కాకుండా ప్రతీ రోజు బాదం, పిస్తా, జీడిపప్పు, వేట మాంసం పెడతారు. ఒక్క కోడి పుంజును పెంచడానికి సుమారుగా సంవత్సరానికి రూ. ఆరువేల నుంచి ర.పదివేల దాకా ఖర్చు చేస్తారు. కోడి పుంజుల ఆరోగ్య పరిస్థితి గమనించుకుంటూ, వాటిని కంటికి రెప్పలా చూస్తుంటారు. ఒక్కో పెంపకందారుడు సుమారుగా 200 పందెం పుంజులను ఒకే చోట పెంచుతుంటారు. నిర్వాహకులు పందెం కోడి పుంజులను పెంచేందుకు సుమారుగా రెండు ఎకరాలు స్థలం ఉండేలాగా ఏర్పాటు చేసుకుంటారు. ఎందుకంటే ఇంత బలవర్ధకమైన ఆహారం శరీరానికి పట్టడానికి కోడిపుంజులతో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయిస్తారు. ఈ వ్యాయామాలను శాఖలు అంటారు. శాఖలలో భాగంగా కోడిపుంజులను పరుగు పెట్టించడం, కొంచెంసేపు సాటి పుంజులతో పోరాటం చేయడం నేర్పిస్తారు. ప్రతీ రోజు చన్నీళ్లలో ఈత కొట్టించి ఎండలో వదిలిపెడతారు. వారానికోసారి వేడి నీళ్లలో స్నానం చేయిస్తారు. ఇలా చేస్తే శరీరం గట్టిపడుతుందని చెబుతుంటారు. ఇవే కాకుండా కోడిపుంజు పోరాట పటిమ కోసం రహస్యంగా కొన్ని తర్ఫీదులను ఇస్తున్నారు. ఏపీలోని అమరావతి, నెల్లూరు, భీమవరం, ఏలూరు, రాజమహేంద్రవరం ఇలా పలు ప్రాంతాల నుంచి వచ్చి సత్తుపల్లి, అశ్వారావుపేట సరిహద్దుల్లో కోడిపుంజులను కొనుగోలు చేస్తుంటారు. పందెం కోళ్లు సుమారు 50 రకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన పందెం కోళ్లు కాకి, నెమలి, డేగ, పచ్చ కాకి, పర్లా, సేతువు, పులా, పింగళి, కౌజు, నల్లమచ్చల సేతువు, ఎర్ర బోరా, నల్ల బోరా, మైలా, కొక్కిరై, నల్ల సవాలా, ఇలా అనేక రకాలు ఉన్నాయి. ప్రాంతాలను బట్టి పేర్లు మారిపోతుంటాయి. వీటిలో కాకి, డేగ, నెమలి రకం కోళ్లు పందేలకు పెట్టింది పేరు. వీటి ధరలు రూ.5వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతాయి. రాష్ట్రంలో కోడి పందేలపై నిషేధం ఉండడంతో సంక్రాంతి పండుగ సందర్భంగా పందేలు నిర్వహించకుండా పోలీసులు ముందస్తు ప్రచారం చేస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లో మైకులతో అనౌన్స్ మెంట్ చేయిస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే పందేలు జరుగుతుండగా, అలాంటి వాటిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం రామాంజనేయపురంలో కోడి పందేల స్థావరాలపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. అయినా మిగిలిన చోట్ల పందెం రాయుళ్లు మాత్రం రహస్యంగా తమ పనులు తాము చేసుకుపోతున్నారు.





ఖమ్మం జిల్లాలో జోరుగా..

ఖమ్మం, వెలుగు

ఏపీని ఆనుకుని ఉన్న ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేటలో కొంత ఆంధ్రా కల్చర్ ప్రభావం ఉంటుంది. ఈ రెండు నియోజకవర్గాల్లోని ఏపీని ఆనుకొని ఉన్న మండలాల్లో రహస్యంగా ప్రతి యేటా కోడి పందేలు జోరుగా సాగుతాయి. పండుగ మూడు రోజుల పాటు ఇక్కడ కోట్ల రూపాయలు చేతులు మారతాయి. ఈ ఏడాది కూడా రహస్యంగా పందెం కోళ్లు పోరాటాలకు రెడీ అవుతుండగా, పోలీసులు మాత్రం చట్టరీత్యా చర్యలు తప్పవని వార్నింగ్ ఇస్తున్నారు. కోడి పందేలకు, పేకాటలకు పామాయిల్, కొబ్బరి, మామిడి తోటల్లో అత్యంత రహస్యంగా నిర్వాహకులు గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు.

ఇప్పటికే సత్తుపల్లి పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు పలు తోటల్లో పందెం కోళ్లను పోటీలకు సిద్ధం చేస్తున్నారు. పెరటి కోళ్ల రూపంలో ఒకే చోట కోడి పుంజులను మాత్రమే పెంచుతూ వాటికి స్విమ్మింగ్, ఫైటింగ్ లో ట్రైనింగ్ ఇస్తున్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, జీడిపప్పు, పిస్తా, బాదం లాంటివి మేపుతూ.. పందెం కోళ్లను బలంగా తయారుచేస్తున్నారు. వేంసూరు, కల్లూరు, సత్తుపల్లి మండలాల్లో ఈ జోరు ఎక్కువగా కనిపిస్తోంది. మేడిశెట్టివారిపాలెం, తుంబూరు గ్రామాలు కోడి పందేలకు చాలా ఫేమస్. ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో ఉన్న మామిడితోటలన్నీ పందెం బిర్రులుగా మారుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్ జనరేటర్లు అమర్చి మరీ లోన పేకాట, బయట కోడి పందేలు నిర్వహిస్తుంటారు. గతంలో రెప్పపాటులో కోట్ల రూపాయలు చేతులుమారి జూదరులు వీధిన పడిన సంఘటనలన్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ, ఈ మూడు రోజులు పందెం రాయుళ్లకు గడియ రికాం ఉండదు. అశ్వారావుపేట, సత్తుపల్లి శివారులోని చింతలపూడి, జంగారెడ్డిగూడెం మండలాల్లో పందేలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో, భీమవరం, కోప్పాకలో భారీ సెట్టింగులతో పందేలు నిర్వహిస్తారు. రెండు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ రంగాల ప్రముఖులు ప్రత్యక్షంగా పాల్గొంటారు.

హైదరాబాద్ శివారులో

పందెం కోళ్లు ఆంధ్రా నుంచి నగర శివారుకు తరలివస్తున్నాయి. శివారులోని ఖాళీ ప్రాంతాలు, ఫాం హౌజ్ లలో పందేలను నిర్వహించడానికి కొంతమంది సన్నాహాలు చేస్తున్నారు. పందేల కోసం ఫాం హౌజ్‌ల్లో ప్రత్యేకంగా కోళ్లను పెంచుతున్నారు. కోళ్లకు పౌష్టికాహారం అందిస్తూ వాటిని రెడీ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, ఆరుట్ల, మంచాల, గుర్రంగూడ, జిల్లెలగూడ, బడంగ్‌పేట్, హయత్‌నగర్, కవాడీపల్లి, ఎల్‌బీనగర్, నాదర్‌గుల్, తుర్కయాంజల్ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది.

అన్ని మతాల వారు కలిసి ఉండాలె

- ఎంపీ జితేందర్ రెడ్డి

మహబూబ్ నగర్ వెలుగు: తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాల వారు కలిసి ఉండాలని, మతాలను ప్రభుత్వం గౌరవిస్తున్నదని ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణపేట మండలం కొల్లంపల్లి దర్గాలో సర్వధర్మ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమ్మేళనం నిర్వహించడం 16 ఏళ్లుగా కొనసాగుతుందన్నారు. తెలంగాణ వచ్చాక ఒక్క మత ఘర్షణ కూడా జరగలేదని, అన్ని మతాలకు టీఆర్ఎస్ ప్రభుత్వం సమాన గౌరవం కల్పిస్తుందన్నారు. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మలకు దుస్తుల పంపిణీ చేసి అన్ని మతాలను గౌరవించిందన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు పెద్ద విజయం వచ్చిందన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని మతాల సారాంశం ఒకటే అన్నారు. అన్ని మతాల వారు కలిసి మెలసి ఉండాలన్నారు. సర్వధర్మ సమ్మేళనంలో అన్ని మతాల గురువులను పీఠాధిపతులను ఆహ్వానించి ఒకే వేదికపై కూర్చోపెట్టి సమాజానికి సందేశం వినిపిస్తారన్నారు.





శనివారం బాన్సువాడలో కల్తీ నెయ్యి తయారు చేసిన అయిదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కల్తీ నెయ్యి పట్టివేత

- 130 లీటర్లు స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు

బాన్సువాడ, వెలుగు: కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్న ఐదుగురిని శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సాయన్న తెలిపిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర్ కాలనీ 4వ నంబర్ రోడ్డులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఐదుగురు కమ్మరి శంకర్ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వారు గత రెండు నెలల క్రితం ఇక్కడికి వచ్చి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు శనివారం దాడులు చేశారు. మలావత్ శంకర్, మలవత్ రాజు, పెద్దవాత్ రాజు, సిక్యా, డింగ్య అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు నుంచి 130 లీటర్ల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం...

బాన్సువాడ పట్టణంలో ఇదే కాలనీలో పదేళ్ల క్రితం కూడా కల్తీ నెయ్యి తయారు చేస్తున్నా కొందరిని పోలీసులు అరెస్టు చేసిన ఘటనలున్నాయి. మళ్లీ ఇప్పుడు ఈ కల్తీ నెయ్యి తయారీ బయటపడింది. ఎన్నాళ్ల నుంచి దీనిని తయారు చేస్తున్నారోనని అనుమానాలు రేకేత్తుతున్నాయి. వీరు నూనె, డాల్డా తదితర వాటిని కలిపి కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

ఈ నెయ్యి తిన్నవారు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఈ కాల నీలో మరికొంతమంది సైతం కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అలాంటి వారిని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల ఏర్పాట్లు ఎట్లున్నయ్?

- ఎన్నికల పరిశీలకుడు నాయక్

వనపర్తి,వెలుగు : గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర సాధారణ ఎన్నికల పరి శీ లకులు కేవై నాయక్ శనివారం వన పర్తి జిల్లాలోని దంతనూరు, పాలెం గ్రామాల్లో పరిశీలించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నేతలు తలదూర్చొద్దని ఆయన ఈ సందర్భంగా సూచించారు. పంచాయతీ ఎన్నికల్లో ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. నామినేషన్‌కు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అడిగిన వెంటనే సంబంధిత అధికారులు జారీ చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. బలవంతంగా గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఏకగ్రీవం చేయడం నేరమని, గ్రామంలోని అందరి ఏకాభిప్రాయంతోనే ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. కొత్తకోట మండలం పాలెం మదనాపురం మండలం దంతనూరు గ్రామాల్లో రెండో దశ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించి ఏర్పాట్లు బాగున్నాయన్నారు.



క్విక్ బైట్స్



టిటా గ్లోబల్ ప్రెసిడెంట్‌గా సందీప్

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) గ్లోబల్ ప్రెసిడెంట్‌గా సందీప్‌కుమార్ మక్తాల, ఉపాధ్యక్షుడిగా రాంప్రతాప్ ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్ శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఫలితాలు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రం సహా పలు దేశాల్లో కొత్త కమిటీలు ఎన్నికయ్యాయని, వీటి నుంచి 39 మంది కార్యవర్గ సభ్యులతో గ్లోబల్ వర్కింగ్ కమిటీని ఏర్పాటైందని ఆయన చెప్పారు. కొత్త కమిటీ 2022 వరకు కొనసాగుతుంది.

మావోళ్లూ పోటీ చేస్తున్నరు: కోదండరాం

హైదరాబాద్, వెలుగు: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీజేఎస్ పోటీ చేస్తోందని, పార్టీ తరఫున ఇప్పటికే చాలా మంది నామినేషన్లు వేశారని ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం శనివారం వెల్లడించారు. గ్రామాభివృద్ధికి కట్టుబడిన వారికే తాము మద్దతిస్తామని చెప్పారు. రాజకీయ ఒత్తిడితో పంచాయతీలను ఏకగ్రీవం చేయడం సరికాదని, వీటిపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలని కోరారు. 'కాంగ్రెస్‌లో టీజేఎస్ విలీనం నిరాధారం. లోక్‌సభ ఎన్నికల్లోనూ అగ్గిపెట్టె గుర్తుతోనే పోటీ చేస్తాం. ఎన్ని స్థానాల్లో పోటీచేయాలో త్వరలో నిర్ణయిస్తాం' అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై ఉద్యమం చేస్తామని చెప్పారు. సీఈవో పనితీరుపై అనుమానం ఉందని, లక్షల్లో ఓట్ల తొలగింపుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సీఈవోపై ఈసీకి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో తాము చేయాల్సింది చాలా ఉందని, ఏపీకి వెళ్లే తీరిక లేదన్నారు.

అటవీ అధికారుల మెరుపు దాడులు

లింగంపేట,వెలుగు: ఎల్లారెడ్డిలో ఫర్నీచర్, లింగంపేటలో చైనామాంజా (పతంగుల దారం) విక్రయిస్తున్న దుకాణాలపై శనివారం అటవీశాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైనామాంజ ద్వారా పక్షుల ప్రాణాలకు ముప్పు ఉందని విక్రయదారులకు సూచించారు. అలాంటి దారం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎల్లారెడ్డిలోని పలు ఫర్నీచర్ తయారీ దుకాణాలను తనిఖీ చేశారు . టేకు కలపను అక్రమంగా ఉంచిన పలువురికి రూ.19వేల జరిమానాలను విధించారు. దాడుల్లో ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల డిప్యూటీ రేంజ్ అధికారులు బాలకృష్ణంరాజు, రమేశ్, బీట్ అధికారులు సాబేర్, భూపతి, ఖదీర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ

- గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు
- వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి



హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చే ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా రూపొందించాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా క్రాప్ కాలనీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే దిశగా కార్యాచరణ రూపొందించడానికి ఆయా శాఖల ఉన్నతాధికారులతో శనివారం సమావేశమయ్యారు. రైతులు పండించే ప్రతి పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరి సాగు పెరగకుండా సాగునీటి ప్రాజెక్టులున్న ప్రాంతంలో ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మండలాల వారీగా వివిధ పంటల విస్తీర్ణాన్ని సేకరించి వారం రోజుల్లో అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు అందజేయాలన్నారు. 25వ తేదీ లోపు ఈ కార్యాచరణ ప్రణాళికను పూర్తి చేయాలని సూచించారు.

శాండ్ ట్యాక్స్‌లో అక్రమాలు చేయొద్దు



నల్లగొండ, వెలుగు: శాండ్ ట్యాక్స్ విధానంలో అక్రమాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఏవీ. రంగనాథ్, జేసీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో శాండ్ ట్యాక్స్ విధానాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నామని, అయినా ఇంకా చాలా ప్రాంతాల్లో మాన్యువల్ చలాన్స్‌తో ఇసుక రవాణా జరుగుతుందన్నారు. మాన్యువల్ చలాన్స్‌తో ఇసుక రవాణాను అనుమతించమని,ఈ విషయంలో ఇప్పటికే రెవెన్యూ అధికారులకు అదేశాలు జారీ చేశామన్నారు. శాండ్ ట్యాక్స్ విధానంలో ఇసుక కోసం సులువుగా దరఖాస్తు చేసుకునేలా మీసేవ, ఈసేవలతో పాటు తహసీల్దార్ కార్యాలయాల వద్ద కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ల ఏర్పాటు కోసం ఆసక్తి కలిగిన వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆన్‌లైన్ కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విధానంలో ఎవరు నిబంధనలు ఉల్లంఘించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మైనింగ్ అధికారి వెంకటేశ్వర్లు, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డీఎస్పీలు గంగారాం పాల్గొన్నారు.



జాతీయస్థాయిలో మెరిశారు

ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించిన దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో భద్రాచలం పట్టణంలోని సెయింట్ పాల్స్ స్కూల్ పిల్లలు ప్రతిభ చాటారు. ఈ స్కూల్‌కు చెందిన స్టూడెంట్స్‌రామశ్రీ, పీ సాయిపవన్‌గైడ్ టీచర్ డాక్టర్‌కే రాధామంజరి పర్యవేక్షణలో ప్రదర్శించిన 'యాక్సిడెంట్‌ఎలర్ట్స్ ఆన్ ట్రాప్స్‌అండ్‌రోడ్స్' అనే ప్రాజెక్టుకు ఫస్ట్‌ప్రైజ్‌లభించింది. ఇది తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని స్కూల్‌కరస్పాండెంట్ డాక్టర్ అబ్రహం వెల్లడించారు. తమ స్కూల్ పిల్లలు ఫస్ట్‌ప్రైజ్ సాధించడం మూడోసారి అని చెప్పారు.

లోక్‌పాల్ లేకనే అలోక్‌కి ఇలా..

ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)పై ఆరోపణలు వస్తే స్వతంత్ర లోక్‌పాల్ పరిధిలో సీబీఐ విచారణ చేస్తుంది. కానీ, దేశంలో ఇంతవరకు లోక్‌పాల్ నియామకమే జరగలేదు. ఆ లోటు బాగా కనిపిస్తోంది. పీఎంఓపై దర్యాప్తు విషయాన్ని తేల్చే కమిటీకి ప్రధాన మంత్రే అధ్యక్షత వహించటం నైతికంగా, చట్టపరంగా సరి కాదు. సెలెక్ట్ కమిటీ కసరత్తు మొత్తం అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించటమే లక్ష్యంగా జరిగినట్లు తెలుస్తోంది. వర్మను ఫైర్ సర్వీస్‌కి బదిలీ చేసినా ఆయన అందులో చేరకుండానే గుడ్ బై చెప్పేశారు.

అలోక్ వర్మకే కాదు. ఎం.కె.సిన్హా, ఏ.కె.శర్మ వంటి సీబీఐలోని ఇతర సీనియర్ ఆఫీసర్లకూ గతంలో ఇలాగే జరిగింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతున్న కొన్ని ముఖ్య కేసుల్లో మోడీ ఆఫీసు కల్పించుకోవటమే దీనికి కారణం. సీబీఐలో యాంటీ కరప్షన్ విభాగానికి అధిపతిగా చేసిన డీఐజీ సిన్హాకి సమర్థుడు, నిజాయితీపరుడు అనే పేరుంది. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాపై నమోదైన లంచం కేసు విచారణలో పీఎంఓ తరఫున జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ జోక్యం చేసుకోవటంపై సిన్హా చాలా సీరియస్‌గా స్పందించారు. సీబీఐని 'సెంటర్ ఫర్ బోగస్ ఇన్వెస్టిగేషన్'గా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడీ)ని 'ఎక్స్‌టార్షన్ డైరెక్టరేట్'(దోపిడీ డైరెక్టరేట్)'గా వర్ణించారు.

వర్మని సీబీఐ డైరెక్టర్ కుర్చీ నుంచి రాత్రికి రాత్రే దించేసిన తర్వాత డీఐజీగా ఉన్న సిన్హానూ బదిలీ చేశారు. సీబీఐ, ఈడీల గురించి సిన్హా ఇంత పచ్చిగా మాట్లాడటాన్ని బట్టి పీఎంఓ వంటి ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ వ్యవస్థలు ఏ స్థాయిలో కుళ్లిపోయాయో తెలుస్తోంది. వర్మ కేసును 'సీబీఐ వర్సెస్ సీబీఐ'లా భావించకూడదు. 'సీబీఐ లేదా ఈడీ వర్సెస్ పీఎంఓ'గా పరిగణించాలి.

సీబీఐ, ఈడీ వ్యవహారాల్లో పీఎంఓ నేరుగా జోక్యం చేసుకోవటం జగమెరిగిన సత్యం. ఈడీకి హెడ్‌గా పనిచేసి గతేడాది రిటైరైన కర్నాల్‌సింగ్ పీఎంఓపై ఓపెన్‌గా దుమ్మెత్తిపోశారు. రాజకీయ నేతలు, వ్యాపారులపై నమోదైన కీలకమైన మనీ లాండరింగ్ కేసులను ఇన్వెస్టిగేట్ చేసే ఈడీ జాయింట్ డైరెక్టర్ రాజేశ్వర్ సింగ్‌పై పీఎంఓ కత్తి కట్టింది. ఆయన అవినీతికి సంబంధించి పీఎంఓ ఫిర్యాదుల చిట్టా తయారుచేసింది. ఈ చర్యను కర్నాల్ సింగ్ తప్పుపట్టారు.

ఆరోపణల్లోని నిజాల సంగతి పక్కన పెడితే అలోక్ వర్మ, ఏకే శర్మ ఇద్దరూ ఒకప్పుడు పీఎంఓకి చాలా దగ్గరి మనుషులు. వర్మని పీఎంఓనే ఏరికోరి సెలెక్ట్ చేసుకుంది. మరీ ముఖ్యంగా అజిత్ ధోవల్ పట్టుబట్టి తెచ్చారు. ఆ తర్వాత ఏమైందో ఏమో! వర్మ గిట్టనివాడయ్యాడు. వాళ్లు చెప్పినట్లు ఆయన వినకపోవటం వల్లే మంచోడు కాస్తా చెడ్డోడిగా కనిపించి ఉంటాడు. సమర్థుడిగా పేరొందిన గుజరాత్ కేడర్ ఐపీఎస్ ఆఫీసర్ ఏకే శర్మని సీబీఐలోకి జాయింట్ డైరెక్టర్‌గా పీఎంఓనే తెచ్చింది. శర్మ కూడా వర్మ లాగే స్ట్రిక్ట్‌గా ఉండటంతో ఆయన్నీ శత్రువుగానే భావించి పీఎంఓ దూరం పెట్టింది.

దీన్నిబట్టి పొలిటికల్ కరప్షన్, మనీ లాండరింగ్ కేసుల విచారణల తీరును పీఎంఓనే పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ విషయాలు బయటకు రాకుండా ఉండటానికే సీబీఐలో, ఈడీలో అధికారుల మధ్య గొడవలు పెడుతోంది. ఆఫీసర్లతో ఇష్టమొచ్చినట్లు ఆడుకునే ఇలాంటి తతంగాలు గుజరాత్‌లో మోడీ సీఎంగా, అమిత్ షా హోం మంత్రిగా ఉన్నప్పుడు జరిగాయి. ఆ 'గుజరాత్ మోడల్'ని ఢిల్లీలోనూ ప్రయోగించాలని చూశారు. కానీ, వ్యవస్థాపరమైన చెక్ లిస్టులు కేంద్రంలో ఎక్కువ. దాంతో వాళ్లిద్దరి ఆటలు బయటపడ్డాయి.

– ఎం.కె.వేణు ('ది వైర్' సౌజన్యంతో..)


అలోక్ వర్మ


ఏ.కె.శర్మ

అలోక్ వర్మ ఆత్మగౌరవంగా బయటకు వెళ్లిపోయారు. అలా అనడం కంటే అవమానకరంగా గెంటేశారని చెప్పాలి. సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్ వర్మను తొలగించి, మరో చోటకి బదిలీ చేయడం నైతికంగా లేదా విధానపరంగా ఏ రకంగా చూసినా కరెక్ట్ కాదు. కనీసం తన వాదనను వినిపించుకునే అవకాశమైనా అలోక్ వర్మకు ఇవ్వాల్సింది. లోక్‌పాల్ ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. మోడీ, అమిత్ షా గుజరాత్‌లో ఆడిన ఇలాంటి ఆటలను కేంద్రంలోనూ సాగిస్తున్నారు.

బండారం బయటపడకుండా..

రాఫెల్ డీల్‌పై యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఇచ్చిన కంప్లయింట్‌లోని ప్రాథమిక సాక్ష్యాధారాలను అలోక్ వర్మ పరిశీలిస్తున్నారు. ఈ విషయం తెలియటంతో కేంద్రం అలర్ట్ అయింది. ఫిర్యాదుని తమ దృష్టికి తీసుకురాకుండా వర్మ స్వతంత్రంగా వ్యవహరించటాన్ని సహించలేకపోయింది. అలాగే, మోడీ వద్ద ఓఎస్‌డీగా పనిచేసే భాస్కర్ ఖుల్బే కేటాయించిన గనికి సంబంధించి అవినీతి జరిగిందన్న కేసు కూడా అలోక్ వర్మ వద్దే విచారణలో ఉంది. దర్యాప్తులు ముందుకు సాగితే తమ బండారం బయటపడతాయేమోనని మోడీ గవర్నమెంట్ భయపడింది.

'కోటా' గరీబులెవరు?



రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకాలు కాదు. రిజర్వేషన్ల వెనక వేల సంవత్సరాల అణచివేత, వివక్ష, సామాజిక సాంస్కృతిక కట్టుబాట్లు ఉన్నాయి. ఇది సామాజికంగా విద్యాపరంగా వెనకబాటుకు గురైన వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆయా వర్గాలకు న్యాయం చేయడానికి ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక వెసులుబాటు మాత్రమే అంతేకానీ, రిజర్వేషన్లు అన్ని సమస్యలకు పరిష్కారం చూపే మంత్రదండం కానే కాదు.

అగ్రవర్ణాలు అంటూనే మళ్లీ పేదలు అనడం కొంచెం విడ్డూరంగా ఉంది. అసలు పేదలను గుర్తించే విధానంలోనే చాలా లోపాలు కనిపిస్తున్నాయి. గణాంకాల ప్రకారం దేశంలో 95 శాతం మంది 8 లక్షల లోపు ఆదాయం కలిగిన వారే. గ్రామీణ ప్రాంతాల్లోని వారి నెలవారీ ఆదాయం 2011-12 గణాంకాల ప్రకారం రూ. 2,600 ఉండగా, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ఆదాయం రూ. 6000గా ఉంది. దేశంలో 86 శాతం మంది ఐదెకరాల లోపు భూమి కలిగిన వారే. అంటే దాదాపు దేశంలోని 95 శాతం మంది ఈ 10 శాతం రిజర్వేషన్లకు అర్హులేనన్నమాట. వెయ్యి చదరపు అడుగుల లోపు ఇళ్ళు కలవారు కూడా అటుఇటుగా అంతే మంది ఉన్నారు. ఇది మొత్తం రిజర్వేషన్ల ఉద్దేశానికే విరుద్ధం కాదా?

అంతేకాదు 90 శాతం ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఉద్యోగులు కూడా 8 లక్షల లోపు ఆదాయం కలిగినవారే మరి. వారందరినీ ఈ కోటాలో కలుపుతారా లేదా అనేది తేల్చాల్సిన అవసరం ఉంది. కేవలం 15.18 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లను కల్పిస్తే 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 27 శాతం మాత్రమే ఇవ్వడం అన్యాయం కాదా? ఒకవైపు 3 లక్షల వార్షికాదాయం కలిగిన వారిని ఇన్‌కం ట్యాక్స్ పరిధిలోకి తీసుకువచ్చి వారిని సంపన్నులుగానే పరిగణించే ప్రభుత్వం రిజర్వేషన్ల విషయానికి వచ్చేసరికి భిన్న వైఖరి అనుసరిస్తోంది. ఏడాదికి 8 లక్షలు అంటే నెలకు 65,000 వేలకు పైగా సంపాదించేవాళ్ళు పేదవాడు అవుతాడా? మూడెకరాల తరి, అయిదెకరాల మెట్ట వ్యవసాయ భూమి ఉన్న రైతులు ప్రభుత్వ పరంగా లభించే సబ్సిడీలకు అనర్హులు, ఆరు లక్షల పైబడి ఆదాయంగల బీసీలు క్రీమీలేయర్ పరిధిలోకి వచ్చినప్పుడు... ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చే స్కాలర్‌షిప్పులు, పై చదువులకు ఇచ్చే ఆర్థిక చేయూతకు 2.5 లక్షల ఆదాయ పరిమితిని విధించిన ప్రభుత్వం అగ్రవర్ణాల విషయంలో ఇంత ఉదారంగా ఎందుకు వ్యవహరిస్తోంది. ఇది హాస్యాస్పదంగాను కుట్రపూరితంగాను కనిపిస్తుంది. 'ఇప్పుడు రిజర్వేషన్లు అనుభవిస్తున్న కులాలకు ఒక్కో కుటుంబానికి ఐదెకరాల భూమి కేవలం రెండు లక్షల వార్షికాదాయం వచ్చే మార్గాన్ని చూపిస్తే గనుక, వారు ఇంత కాలంగా అనుభవిస్తున్న రిజర్వేషన్లను వదులుకోవడానికి సిద్ధమే' అని ఆయా వర్గాలలోని మేధావులు కోరుతున్నారు. దానికి ప్రభుత్వం సిద్ధమేనా? ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు రోజురోజుకు కుంచించుకుపోతుంటే కొత్త ఉద్యోగాలు ఎక్కడనుంచి ఇస్తారు? వంటి మౌలిక అంశాలను వదిలేసి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం తప్ప మరోటి కాదు.

మొత్తంగా ఎన్నికలముందు మందిరం, హిందుత్వం, పెద్ద నోట్ల రద్దు, నల్లధనం, సర్జికల్ స్టయిక్స్ వంటివి ఓట్లు రాల్చవని గ్రహించారు. ఎలాగైనా వచ్చే ఎన్నికలలో లాభపడడానికి బీజేపీ వేసిన ఎత్తుగడ తప్పించి మరేమీ కాదు. ఉన్నఫళంగా ఎవరూ డిమాండ్ చేయక పోయినప్పటికీ ఎటువంటి చర్చ లేకుండా, పౌరసమాజం పాత్ర లేకుండా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగియడానికి ఒక్క రోజు ముందు ఈ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టి ఆదరాబాదరాగా పాస్ చేయించాల్సిన అవసరం ఏముంటుంది? ఈ బిల్లును వ్యతిరేకిస్తే ఆయా వర్గాల ఓట్లు పోతాయన్న దురాలోచనతో ఇతర పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. రాబోయే ఎన్నికల క్రీడలో నెగ్గడానికి బహుజన పార్టీలని చెప్పుకునే బిఎస్పీ, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా ఈ బిల్లుకు మద్దతు తెలిపాయి. అయితే, అసలైన పరీక్ష ముందుంది. ఇంత హడావుడిగా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ బిల్లు న్యాయ పరీక్షకు నిలబడుతుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

– జి.పరమేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్

కోర్టులు ఏం చెప్పాయి?

ఒక కులానికి లేదా సామాజిక వర్గానికి చెందినవారికి ప్రభుత్వ పరంగా విద్య ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యాన్ని కలిగిలేరని, దీనికి సామాజిక వెనుకబాటు ద్వారా కలిగిన ఆర్థిక లేమి కారణమని రుజువు చేయగలినప్పుడే కొన్ని ప్రత్యేక సందర్భాలలో రిజర్వేషన్లు కల్పించవచ్చునని వివిధ సందర్భాలలో ఇచ్చిన తీర్పుల ఆధారంగా సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

- ఆర్థిక వెనకబాటు ఆధారంగా కల్పించిన రిజర్వేషన్లు రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ఇంద్రా సాహ్ని vs యూనియన్ గవర్నమెంట్ కేసులో 9 మందితో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.
- అడ్డగోలుగా రిజర్వేషన్లు కల్పించే ఇలాంటి చట్టాలకు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ కూడా న్యాయ సమీక్షకు అతీతం కాదని కేశవానంద భారతి vs కేరళ ప్రభుత్వం కేసులోనూ తేలిపోయింది.
- బీజేపి పాలిత రాష్ట్రమైన గుజరాత్‌లో అగ్రవర్ణాల పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది.

పాత తప్పులతోనే 'లోకల్' ఓటర్ల లిస్ట్!

పంచాయతీ ఎన్నికలకు విడుదలైన ఓటర్ల జాబితాను చూస్తే అధికార యంత్రాంగం తీరులో మార్పు లేదని వెల్లడవుతోంది. వాస్తవానికి ఆరు నెలల ముందే స్థానిక సంస్థల పదవీ కాలం పూర్తవగా, స్పెషలాఫీసర్ల పాలన మొదలైంది. ఈలోగా అసెంబ్లీ ముందస్తు ఎన్నికలకు తెరదీసిన టీఆర్ఎస్ సర్కారు ఘన విజయం కూడా సాధించింది. అయితే, అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకోసం హైకోర్టులో పిటీషన్ దాఖలు కావటం, మూడు నెలల్లోపు (జనవరి 10లోపు) ఎన్నికల ప్రక్రియను ముగించాలంటూ కర్టు ఉత్తర్వులు జారీ చేయటం జరిగింది. ఒకవైపు శాసనసభ ఎన్నికల ప్రక్రియ సాగుతుండగా పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. అయినప్పటికీ ఓటర్ల జాబితాని కనీసం ఇంటర్నెట్‌లోనైనా అందుబాటులో ఉంచకపోవటం, వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా జరపటం, ప్రజాభిప్రాయం పట్టించుకోకపోవడం, ఓట్ల తొలగింపు మార్పుచేర్పులకు అవకాశం లేకపోవటం, అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల లిస్టుని యధాతథంగా విడుదల చేయటం అనేక విమర్శలకు తావిస్తోంది.

అసెంబ్లీ ఓటర్ల జాబితాలో చాలా ఓట్లు గల్లంతయ్యాయని స్వయంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ప్రకటించగా, దానిని సరిజేయకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం అమలుచేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు, లోకల్ బాడీస్ ఎలక్షన్‌కి చాలా వ్యత్యాసం ఉంటుందనే విషయం మరువరాదు. ఎందుకంటే, ఎమ్మెల్యే ఎలక్షన్‌లో చిరునామా తప్పుగా పడినా పెద్దగా ఇబ్బంది ఉండదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుడి ఎన్నికకు అదే కీలకం. చాలా చోట్ల ఒకే అడ్రస్‌గల వ్యక్తులను వేర్వేరు వార్డుల్లో చూపటం, చిరునామా తప్పుగా వేయటం, ఒకరి ఇంటి అడ్రస్ మరొకరికి వేయటం, వార్డుల విభజన తమకు తోచినట్లు చేయటం వంటివి జరిగాయి.



పకడ్బందీగా, పారదర్శకంగా జరగాల్సిన ఓటర్ల జాబితా తయారీ ఈ విధంగా ఉండడం విచారకరం. ఓటర్ల జాబితా నిర్వహణ, మార్పులు చేర్పులు, అభ్యంతరాలు, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులకు అవకాశం కల్పించాలి. ఓటర్ల జాబితాలో తప్పొప్పులకు సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ తగు చర్యలు గైకొనాలి. రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదనే విషయం గమనించాలి.

- సుద్దాల వినోద్ కుమార్

ఏమన్నారంటే



ప్రజాస్వామ్య గొప్పతనం

ప్రజలు తొందరపడి తప్పుడు వ్యక్తిని ప్రధానిగా ఎన్నుకుంటే సరిజేసుకోవచ్చు. ప్రజాస్వామ్యంలో ఐదేళ్ల తర్వాత ఆ వ్యక్తిని మార్చగలిగే హక్కు ప్రజలకు ఉంది.

– అజిత్ సింగ్, రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్డీ)



చర్చలద్వారానే శాంతి

చేతులు ముడుచుకుని కూర్చుంటే శాంతి సాధ్యం కాదు. చర్చల ద్వారానే సాధ్యమవుతుంది. సిరియాతో చర్చించాల్సిందే.

– తులసి గబ్బార్డ్, యూఎస్ కాంగ్రెస్ మెంబర్

మీరూ రాయొచ్చు!
సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com

రాజా రాణీ కట్టూ బొట్టూ ఇదే.. నీతూ కనికట్టు!





బిగ్ స్క్రీన్‌పై కనిపిస్తున్న దృశ్యాన్ని ఎంజాయ్ చేయాలంటే కేవలం అందమైన హీరో హీరోయిన్లుంటే చాలదు. సీన్‌లోకి ప్రేక్షకుడు ప్రవేశించాలి. వందల ఏళ్లనాటి హిస్టరీతో సినిమాలు తీస్తే ఇక చెప్పనక్కరలేదు. ప్రేక్షకుడిని అప్పటి కాలానికి లాక్కెళ్లాలి. కాస్ట్యూమ్స్ విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా సీన్ తేలిపోతుంది. సినిమా పేలిపోతుంది. హిస్టారికల్ మూవీస్ తీసేటప్పుడు డిజైనింగ్ ప్రధానమైంది. ఈ నెల 25న విడుదల కానున్న 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'కోసం కాస్ట్యూమ్ డిజైనర్ నీతా లుల్లా మొత్తం చరిత్రనే ఆకళింపుజేసుకుంది.

అందరికీ తెలిసిన విషయాలనే మళ్లీ కొత్తగా చెప్పాలనుకోవడం కత్తిమీదసాము లాంటిది. హిస్టరీలోని సీన్లు మార్చడం అసాధ్యం. స్క్రిప్టులో ఉద్దేశపూర్వకంగా మిస్‌ఇంటర్‌ప్రిటేషన్స్‌కు పోవడమూ దుస్సాహసమే. విమర్శలు, అట్టర్‌ఫ్లాప్ లాంటి రూపాల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది మరి! కాబట్టే బయోపిక్స్ విషయంలో ఫిలిం మేకర్స్ ఆచితూచి అడుగులేస్తున్నారు. మూల కథకు అదనంగా ఎలాంటి హంగులు ఉంటే సినిమాకు ప్లస్ అవుతుందో వాటిపై ఎనలేని శ్రద్ధపెడుతున్నారు. ఆ అదనపు హంగుల జాబితాలో అన్నింటికంటే ముందుండేది కాస్ట్యూమ్స్. అవును. పిరియాడిక్, హిస్టారికల్, బయోపిక్ సినిమాల్లో కాస్ట్యూమ్స్‌కు ఉండే ఇంపార్టెన్స్ తెలిసిందే. డిజైన్లు ఎంత బాగా కుదిరితే, ఫస్ట్‌లుక్ నుంచే ప్రేక్షకుల్ని కన్విన్స్ చేయగలిగితే ఇక ఆ సినిమాకు టేబుల్ ప్రాఫిట్ ఖాయమైనట్లే. అలా ఇప్పటి వరకు హిట్టైన రాజుల సినిమాల్లో సినిమాల్లో తనదైన స్టైల్ చూపించారు కాస్ట్యూమ్ డిజైనర్ నీతా లుల్లా. 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' కోసం ఆమె డిజైన్ చేసిన డ్రెస్‌లు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీస్‌గా మారాయి.

స్కూల్ డేస్‌లో చరిత్ర సబ్జెక్ట్ పేరు వింటేనే చిర్రెత్తుకొచ్చేది. పట్టుమని 12వ తరగతైనా పూర్తికాకముందే స్కూల్ నుంచి డ్రాప్‌ఔట్. 16 ఏండ్లకే పెండ్లి. ఒకేఒక్క డొక్కు కుట్టుమిషన్‌తో కెరీర్ మొదలుపెట్టింది. ముప్పై ఏండ్లు అలా గిర్రున తిరిగాయి. హైదరాబాద్‌లో పుట్టి, ఇక్కడే చదువుకుని, ముంబై కేంద్రంగా పనిచేస్తోన్న నీతూ లుల్లా.. ఇప్పుడు వరల్డ్ ఫేమస్ ఫ్యాషన్ స్టైలిస్ట్ కమ్ కాస్ట్యూమ్ డిజైనర్. చరిత్రమీద అయిష్టంతో బడి మానేసిన ఆమే.. సినిమాల కోసం ఏకంగా రీసెర్చ్‌లు చేసేస్తోంది. సూయి-ధాగా స్థాయి నుంచి చేతిలో 10 లక్షల మంది క్లయింట్స్ కలిగిన సక్సెస్‌ఫుల్ బిజినెస్ విమెన్‌గా ఎదిగింది. ఇప్పటికే నాలుగు సార్లు బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా నేషనల్ అవార్డులు పొందిన నీతూ.. నేషన్ ప్రైడ్ ఝాన్సీ లక్ష్మీబాయికి అదిరిపోయే స్క్రీన్ లుక్‌ను అద్దారు. ఒక కాస్ట్యూమ్ డిజైనర్‌గా వీరనారి జీవితంపై తెరకెక్కిన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' సినిమాకి పడిన కష్టం మర్చిపోలేనిదని అంటారు.


'మణికర్ణిక' కంటే ముందే ఝాన్సీ లక్ష్మీబాయి కథతో వేరే నిర్మాతలు కొందరు నీతూ లుల్లాని సంప్రదించారు. కాబట్టి ఆమెకు స్టోరీ బేస్‌లైన్ తెలుసు. సినిమాకి సైన్ చేసిన తర్వాతి రోజు నుంచే నీతా తన టీమ్‌తో కలిసి రీసెర్చ్ మొదలుపెట్టారు. ఇండియా, లండన్‌లలోని మ్యూజియంలు, లైబ్రరీలు అన్నింటినీ జల్లెడపట్టి ఝాన్సీలక్ష్మీబాయికి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని సేకరించగలిగారు. నాలుగు నెలలపాటు సాగిన రీసెర్చ్ వల్ల నీతాకి అర్థమైనదేమిటంటే... ఝాన్సీ లక్ష్మీబాయిని సౌందర్యవతిగానే కాదు శక్తిశాలిగానూ చూపించాలని. ఝాన్సీలక్ష్మీబాయి జీవితంలోని ఐదు ప్రధాన దశల్ని ఎంచుకున్నారు. యుక్తవయసులో ఆమెనొక యోధురాలిగా, తర్వాత పెండ్లి కూతురిగా, ఆనక మహారాణిగా, విధవరాలిగా, చివరి దశలో బ్రిటిష్ సైన్యానికి వెన్నులో వణుకు పుట్టించిన విప్లవ నాయకురాలిగా చూపించబోతున్నారు. సిట్యుయేషన్‌ను బట్టి మూడ్ ఎలివేట్ అయ్యేలా ప్రతి దశలోనూ రకరకాల రంగులను ఉపయోగించి అద్భుతమైన డిజైన్లు రూపొందించారు నీతా లుల్లా. హ్యాండ్‌స్పిన్ ఫ్యాబ్రిక్, ఖాదీ వస్త్రాల మీద సహజ రంగులతో చేసిన డిజైన్లు మణికర్ణికలో రాచరికాన్ని ఎలివేట్ చేసేలా ఉంటాయి. మహారాణి దశలో రిచ్ రెడ్ కలర్, ఆరెంజ్, గ్రీన్ కలర్స్‌ని ఉపయోగించారు. భర్తను కోల్పోయిన దశలో విషాదం ప్రతిబింబించేలా లైట్ కలర్స్‌ని వాడారు. ఇక, యుద్ధరంగంలో రౌద్రం ఉట్టిపడేలా 'అంగారఖా కుర్తా' ఖరారు చేశారు. సాధారణంగా వార్ సీన్లలో పాత్రధారులు ఇనుప కవచాలు ధరించడం చూస్తుంటాం. వాటికి బదులుగా లెదర్‌తో బాడీగార్డుల్ని డిజైన్ చేశారు. ఒక్క కాస్ట్యూమ్స్ కోసమే కాదు, జ్యువెలరీ సెలెక్షన్ కోసం కూడా పెద్ద కసరత్తు చేసింది నీతా. పెండ్లికి ముందు, తరువాత మణికర్ణిక వేసుకునే నగల విషయంలో ప్రత్యేకత చూపారు.

'బాహుబలి' విజయేంద్ర ప్రసాద్ కథతో, క్రిష్, కంగనా రనౌత్‌ల సంయుక్త దర్శకత్వంలో తెరకెక్కిన హిస్టారికల్ బయోగ్రాఫికల్ మూవీ 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' జనవరి 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. రూ.125 కోట్ల భారీ బడ్జెట్‌తో కమల్ జైన్, నిషాంత్ పిట్టి నిర్మించిన ఈ సినిమాని జీ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. మూడుసార్లు నేషనల్ అవార్డు అందుకున్న లిరిసిస్ట్ ప్రసూన్ జోషి పాటలతోపాటు డైలాగ్స్ రాశారు. సినిమాలో మణికర్ణిక (ఝాన్సీ లక్ష్మీబాయి)గా కంగనా, ఆమె భర్త గంగాధర్ రావు పాత్రలో జిష్షుసేన్‌గుప్తా, తాంతియా తోపేగా అతుల్ కులకర్ణి, బ్రిటిష్ జనరల్ రోజ్ పాత్రలో బ్రిటిష్ మోడల్ రిచర్డ్ కీప్ నటించారు.



టాలీవుడ్‌లోనూ అదరగొట్టింది!


సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్లో ఆగిపోయిన నీతా చదువు... పెండ్లి తర్వాత కంటిన్యూ అయింది. భర్త శ్యామ్ లుల్లా (డాక్టర్) సహకారంతో ముంబైలోని ప్రఖ్యాత ఎస్ఎన్‌డీటీ విమెన్స్ యూనివర్సిటీలో చేరి, 'ప్యాటర్న్ మేకింగ్, గార్మెంట్ మ్యానుఫ్యాక్చర్' కోర్సులో డిప్లొమా సాధించారు. 1988లో 'తమాచ'సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంటరై ప్రత్యేకంగా గాడ్‌ఫాదర్‌లంటూ లేకుండానే ఇండస్ట్రీలో రాణించారు. లమ్హే (1991) సినిమాకు గానూ మొదటిసారి, ఆ తర్వాత దేవదాస్ (2002), జోధా అక్బర్ (2007), బాలగంధర్వ (2011) సినిమాలకి బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా నేషనల్ అవార్డులు దక్కాయి. ఈ కేటగిరీలో ఇన్నిసార్లు అవార్డు పొందిన ఏకైక డిజైనర్ ఆమె ఒక్కరే. తెలుగులో చేసిన రెండు సినిమాలు కూడా రాజుల కాలంనాటివే కావడం విశేషం. చరిత్రలో పేర్లే తప్ప ఆహార్యంలో ఎలా ఉంటారో తెలియని 'రుద్రమదేవి', 'గౌతమీ పుత్ర శాతకర్ణి'లను ఆమె చూపించిన విధానానికి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు.





కట్ చేస్తే... ఫ్లాష్‌బ్యాక్

**కట్ చేస్తే... సహజంగా అయితే సీన్ మారుతుంది.
కానీ కొన్ని సినిమాల్లో కథే మారిపోతుంది.
ఒక జీవితాన్ని గడుపుతున్న హీరోకి మరో జీవితం ఉందని తెలుస్తుంది.
ఆ జీవితం ఊహించని విధంగా ఉంటుంది.
దాన్ని వదిలి అతడు అజ్ఞాతంలో ఎందుకు
గడుపుతున్నాడు అన్న ప్రశ్న ప్రేక్షకుడి బుర్రలో పుడుతుంది.
ఇలాంటివి చాలా చూశాం అనుకుంటున్నారు కదూ!
అవును... చాలా చూశాం.
అయినా ఇప్పటికీ ఈ కథలు వస్తూనే ఉన్నాయి.**






ఒక హాస్టల్‌కి వార్డెన్‌గా వస్తాడు హీరో. తన మంచి తనంతో స్టూడెంట్స్ అందరికీ దగ్గరవుతాడు. అనుకోకుండా వచ్చిన ఒక సమస్య నుంచి ఓ అబ్బాయిని కాపాడే క్రమంలో ఊహించని పరిస్థితులు ఏర్పడతాయి. కట్ చేస్తే అతని గతం బయటపడుతుంది. ఆ గతంలో అతనో పవర్‌ఫుల్ వ్యక్తి అని తెలుస్తుంది. రీసెంట్‌గా వచ్చిన 'పేట' సినిమా కథ ఇది. ఎక్కడో విన్నట్టుగా అనిపిస్తోంది కదూ! అవును.. చాలాసార్లు విన్నాం. కాదు కాదు.. చూశాం.


ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాడు మాణిక్యం. మెతక మనిషి. ఎవరి జోలికీ పోడు. అలాంటివాడు ఓ సందర్భంలో విశ్వరూపం చూపిస్తాడు. అప్పుడు తెలుస్తుంది... అతడొక సామాన్య ఆటోడ్రైవర్ కాదు పెద్ద డాన్ అని, అతని పేరు బాషా అని. ఈ సినిమా వచ్చిన తర్వాత ఈ తరహాలో ఎన్ని సినిమాలు వచ్చాయో లెక్క లేదు. చాలామంది దర్శకులు హీరోలకు ఫ్లాష్‌బ్యాక్స్ పెట్టి కథలు అల్లుకోవడం మొదలుపెట్టారు.

హీరో అమాయకమైన వంటవాడు. కానీ గరిట పట్టడం వెనుక ఒక పెద్ద కారణం ఉంటుంది. ఆ కారణం బయటపడినప్పుడు 'సమరసింహారెడ్డి' ఉగ్రరూపం తెలిసి వస్తుంది. తల్లి లేని బిడ్డను చూసుకుంటూ సామాన్య జీవితం గడుపుతున్న ఓ డ్యాన్స్ మాస్టర్. అనుకోకుండా ఎదురయ్యే కొన్ని పరిస్థితులు. ఆ క్రమంలో బయటపడే గతం 'నరసింహనాయుడు'ని అందరికీ పరిచయం చేస్తుంది. హీరో ఒక కాలేజీలో చదువుతుంటాడు. హీరోయిన్‌తో లవ్‌లో పడతాడు. 'జల్సా'గా గడుపుతుంటాడు. కానీ అతని వెనుక ఊహించని గతం ఉంటుంది. కాశీలో ట్యాక్సీ డ్రైవర్ 'ఇంద్ర' అని తెలిసినప్పుడు రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఓ మామూలు యువకుడిలా కనిపించే 'సింహాద్రి' ఒక అసాధారణ శక్తి అని, 'బాద్‌షా'లా చెలామణీ అయిన వ్యక్తి పోలీసాఫీసరని తెలిసినప్పుడు ఆశ్చర్యంతో నోళ్లు తెరుచుకున్నాయి. 'పోకిరి'గా అల్లరి చేసినవాడు ఐపీఎస్ ఆఫీసరన్న విషయాన్ని ఎవ్వరూ ఊహించలేకపోయారు. స్నేహితుడి ప్రేమకు సాయపడటానికి వెళ్లిన 'మిర్చి'లాంటి కుర్రాడి వెనుక దిమ్మదిరిగే గతం ఉందన్న సంగతిని అంచనా వేయలేకపోయారు.

ఊహించని విషయం సడెన్‌గా తెలిస్తే సర్‌ప్రైజ్ అవుతాం. అలా సర్‌ప్రైజ్ చేసిన సినిమాలే ఇవన్నీ. ఒక సినిమాలో రెండు కథలు. ఒక హీరోలో రెండు షేడ్లు. ఊహించని ట్విస్టులు. వెరసి ఫుల్ ఎంటర్‌టైన్మెంట్. కానీ ఇక్కడో చిక్కుంది. అంతవరకూ సినిమా ఎంత అలరించిందో... గతంలోకి వెళ్లాక కూడా అంతే ఎంటర్‌టైన్ చేస్తేనే సినిమా సక్సెస్ అవుతుంది. అలా కాకుండా వర్తమానం కంటే గతం కాస్త వీకయ్యిందో... ఇక అంతే సంగతులు. చాలా సినిమాల విషయంలో అలా జరిగింది.



ఇటీవలే వచ్చిన 'పేట' ఫస్టాఫ్ సూపర్బ్‌గా ఉంది. రజనీ స్టైల్, ఆయన డైలాగ్స్, సీన్స్ అన్నీ చాలా ఆకట్టుకున్నాయి. కానీ ఎప్పుడైతే ఫ్లాష్‌బ్యాక్ మొదలయ్యిందో అప్పట్నుంచీ సినిమా బోర్ కొట్టడం మొదలైంది. ఏమాత్రం కొత్తదనం లేని గతం విసుగు తెప్పించింది. అలా అని ఇదే మొదటి ఫెయిల్యూర్ కాదు. గతంలో ఇలాంటివి కొన్ని ఉన్నాయి. పాత గొడవలన్నీ వదిలేసి విదేశాల్లో హోటల్ నడుపుకుంటూ ఉంటాడు 'గాయం 2'లో జగపతిబాబు. మళ్లీ అతణ్ని ఎవరో బలవంతంగా గతంలోకి లాక్కెళ్తారు. అతడితో పాటు వెళ్లిన ప్రేక్షకుడు మామూలుగా డిజప్పాయింట్ అవ్వలేదు. 'టచ్ చేసి చూడు' సినిమాలో తన ఫ్యామిలీ, వ్యాపారం తప్ప మరో ప్రపంచం తెలియనట్టుగా ఉంటాడు రవితేజ. అయితే ఒరిజినల్‌గా అతడు పోలీసాఫీసరని తెలిసినప్పుడు కాస్త థ్రిల్ అనిపించినా, పేలవమైన ఫ్లాష్ బ్యాక్ ఆడియెన్స్‌ని విసిగించింది. సినిమాని ఫ్లాప్ చేసింది. 'ఆక్సిజన్' మూవీలో ఎన్నారై పెళ్లి కొడుకుగా ఎంటరవుతాడు గోపీచంద్ కానీ ఒక పెద్ద లక్ష్యంతో వచ్చానన్న విషయాన్ని ఆ తర్వాత బయటపెడతాడు. 'రాఘవేంద్ర'లో ప్రభాస్ పస లేని గతం, 'బాలు'లో పవన్ గ్యాంగ్‌స్టర్ గతం, 'మృగరాజు'లో చిరంజీవి కనెక్ట్ చేయలేని గతం, 'ఒడియన్'లో మోహన్ లాల్ విచిత్రమైన గతం... ఇలా చాలా సినిమాల్లో హీరోల గతాలన్నీ బోరు కొట్టించాయి. సినిమాని బోల్తా కొట్టించాయి.






ఇవన్నీ చూస్తే దర్శకులు ఫ్లాష్ బ్యాక్‌ని ముందే సృష్టించుకుని, దాని చుట్టూ కథలు అల్లుకుంటున్నారేమో అన్న అనుమానం కలుగక మానదు. ఒకవేళ అలా అల్లుకున్నా తప్పు లేదు. కానీ అది కచ్చితంగా అలరిస్తుందో లేదో అన్న క్లారిటీ మాత్రం ఉండి తీరాలి. వర్తమానాన్నీ, గతాన్నీ బ్యాలెన్స్ చేయగలగాలి. అలా కాకుండా వర్తమానం బాగుండి గతం వీకైతే పరాజయం ఖాయం. గతాన్ని ఎంతో బాగా రాసుకుని వర్తమానాన్ని డల్‌గా నడిపిస్తే అంతవరకూ ప్రేక్షకుడిని థియేటర్లో కూర్చోబెట్టడం కష్టం. కాబట్టి రెండిటినీ బ్యాలెన్స్ చేయలేనప్పుడు స్ట్రెయిట్ నేరేషన్‌కి వెళ్లడమే బెటర్. అది మానేసి అనవసరమైన ప్రయోగాలు చేస్తే ఫ్లాష్‌బ్యాక్‌లో నేనొక పెద్ద డిజాస్టర్ సినిమా తీశాను అని చెప్పుకోవాల్సిన పరిస్థితి దర్శకులకు వస్తుంది.



ఇది మరో రకం

ఫ్లాష్ బ్యాక్‌తో పని లేకుండా హీరోని మన కళ్లముందే అజ్ఞాతవాసంలోకి పంపే పద్ధతి కూడా ఉంది. హీరో ఒక ముఖ్యమైన కారణం వల్ల మరొకరిలా చెలామణీ అవ్వాల్సి వస్తోన్న విషయాన్ని మనకు ముందే తెలిసేలా చేస్తారు. చిరంజీవి 'ఖైదీ', అర్జున్ 'జెంటిల్‌మేన్', పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది, అజ్ఞాతవాసి, రీసెంట్‌గా వచ్చిన కేజీఎఫ్ లాంటి చిత్రాలన్నీ ఈ కోవకే చెందుతాయి. హీరోకి ఒక లక్ష్యం ఉంటుంది. దాన్ని అందుకోడానికి తన అసలు జీవితాన్ని వదిలి మరొకరిలా కొన్నాళ్లపాటు నటిస్తాడు. దాంతో అతడు అనుకున్నది సాధిస్తాడా లేదా అన్న క్యూరియాసిటీ ప్రేక్షకుడిలో ఏర్పడి చివరి వరకూ చూస్తాడు. ఏవో పరిస్థితుల వల్ల కొత్త బాధ్యతలు మీద పడతాయి. వాటిని నిర్వర్తించడానికి కొన్నిసార్లు గెటప్ దగ్గర్నుంచి భాష, అలవాట్లు అన్నీ మార్చేస్తాడు. వేరే చోటికి వెళ్లి తన పనిలో మునిగిపోతాడు. ఏం జరుగుతుందో ప్రేక్షకుడికి అర్థమవుతూ ఉంటుంది. అయితే అతడి నిజ స్వరూపం చుట్టూ ఉన్న ఇతర పాత్రలకు ఎలా తెలుస్తుందన్న ఆసక్తితో సినిమా చూడాలనిపిస్తుంది. అదీ సంగతి.



బాలయ్యదే రికార్డు

ఇలాంటి సినిమాలు చేయడంలో బాలయ్య రికార్డు సృష్టించాడని చెప్పాలి. చాలా సినిమాల్లో ఆయన అజ్ఞాతంలోనే ఉంటాడు. ఏదో ఒక ఇన్సిడెంట్లో సడెన్‌గా ఫ్లాష్‌బ్యాక్ రివీల్ అవుతుంది. ఒక ఊహించని గతం బయటపడుతుంది. ఆ గతంలో ఆయన కచ్చితంగా పవర్‌ఫుల్లే అయ్యుంటాడు. అలాంటివాడు అజ్ఞాతంలోకి ఎందుకొచ్చాడు, ఎందుకు పాత జీవితానికి దూరంగా బతుకుతున్నాడు అన్నది ఫ్లాష్ బ్యాక్ తర్వాత తెలుస్తుంది. ఇలాంటి సినిమాలు చాలానే చేశాడు బాలయ్య. సమరసింహారెడ్డి, నరసింహ నాయుడు చిత్రాలు ఇదే కాన్సెప్టుతో తెరకెక్కాయి. సూపర్ డూపర్ హిట్టయ్యాయి. అయితే తర్వాత ఆ సక్సెస్ కంటిన్యూ కాలేదు. 'లయన్'లో గతం మర్చిపోయినవాడిగా కనిపించాడు. 'డిక్టేటర్'లో పాత జీవితాన్ని వదిలేసి డిపార్ట్‌మెంటల్ స్టోర్ నడిపాడు. 'జై సింహా'లో ప్రేమించిన అమ్మాయి కోసం ఆవేశాన్ని చల్లార్చుకుని కూల్‌గా మారిపోయాడు. 'పైసా వసూల్'లో పోలీసాఫీసరై ఉండి రౌడీ షీటర్‌లా చెలామణీ అయ్యాడు. ఇవన్నీ అనుకున్నంత విజయాన్ని సాధించలేదు.



వాళ్లకీ ఫ్లాష్ బ్యాక్స్ ఉన్నాయ్

ఒక సినిమాలో రెండు కథలు.. ఒక హీరోలో రెండు షేడ్‌లు మన సినిమాల్లోనే కాదు... ఇతర భాషా చిత్రాల్లోనూ కనిపిస్తాయి.

బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'ఫనా'లో కూడా హీరో రెండు రకాలుగా జీవిస్తాడు. మొదట టూరిస్ట్ గైడ్‌గా కనిపిస్తాడు. అందమైన కవితలు చెబుతాడు. హీరోయిన్‌తో రొమాన్స్ కూడా చేస్తాడు. కానీ తర్వాత ఆమెను మోసగించి వెళ్లిపోతాడు. ఆ తర్వాతే అతడొక టెర్రరిస్ట్ అని, తన అవసరం కోసం గైడ్‌గా నటించాడని తెలుస్తుంది. ప్రేమించిన అమ్మాయే అతడిని అంతం చేస్తుంది. ఆమిర్ ఖాన్ లాంటి హీరో... హీరోయిన్ చేతిలో హత్యకు గురవ్వడం అనే పాయింట్ మొదట్లో కొందరిని షాక్ చేసింది. కానీ ఆ కథకి ఆ క్లయిమాక్స్ అవసరమని అర్థమై అందరూ జేజేలు పలికారు. 'కహానీ' చిత్రం కూడా ఇలాంటి కథనంతోనే వచ్చింది. అందులో విద్యాబాలన్ కూడా తన అసలు కథను దాచిపెట్టి మరొక వ్యక్తిగా ఎంట్రీ ఇస్తుంది. భర్తను వెతుకుతున్నట్టుగా నటించి జాలిగొలుపుతుంది. కానీ ఒక తీవ్రవాదిని అంతం చేసేందుకే అలా వచ్చిందన్న విషయం చివరికిగానీ అర్థం కాదు. ఆ ట్విస్టుకి అందరూ ఫిదా అయిపోయారు. అసలు ఆమె గర్భవతే కాదు, అలా నటించిందన్న విషయాన్ని ఎవరూ కనీసం ఊహించనైనాలేదు. అంతగా సస్పెన్స్ మెయింటెయిన్ చేసి అలరించిన ఆ చిత్రం కోట్లు కురిపించింది. అలా అని ఇలాంటి కథనాలన్నీ హిట్టేమీ కాలేదు. మొదటి పార్టు హిట్టయింది కదా అని మరో కొత్త కథతో 'కహానీ'కి సీక్వెల్ తీస్తే ఫ్లాపయ్యింది. తానో బాక్సర్‌నన్న విషయం తెలియకుండా జీవించే రణదీప్ హుడా లవ్ స్టోరీ 'దో లఫ్జోంకీ కహానీ' కూడా ఫెయిలైంది. తమిళంలో 'సికిందర్' లాంటి మూవీస్‌తో పాటు మలయాళ, కన్నడ భాషల్లో బోలెడన్ని ఫ్లాష్ బ్యాక్ స్టోరీలు బోల్తా కొట్టాయి. ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్తే వాటి వివరాలు తెలుస్తాయి.

ప్రయత్నిస్తే ఓడిపోరు

నాని హీరోగా 'మళ్లీరావా' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'జెర్సీ'. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తోంది. సంక్రాంతి సందర్భంగా శనివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. క్రికెట్ నుంచి ఇంటిముఖం పట్టాల్సిన వయసులో.. ఇంటి నుంచి క్రికెట్ గ్రౌండ్‌లో బ్యాట్ పట్టాలనుకునే అర్జున్‌గా నాని కనిపిస్తున్నాడు. ఈ వయసులో క్రికెట్ ఏంటని చాలామంది నిరుత్సాహ పర్చినా, 'ఆపేసి ఓడిపోయినవాడు ఉన్నాడు గానీ .. ప్రయత్నిస్తే ఓడిపోయినవాడు లేడు' అంటూ చివరలో నాని చెప్పిన డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. సినిమా ఆద్యంతం క్రికెట్ నేపథ్యంలోనే ఉండబోతోందని ఈ టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. ఇందులో కన్నడ నటి శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక కాగా అనిరుధ్ రవిచంద్రన్ సంగీత దర్శకుడు. ఏప్రిల్ 19న ఈచిత్రం ప్రేక్షకులముందుకు రానుంది.

టీజర్ టాక్



రివ్యూ



వెంకటేష్, తమన్నా, వరుణ్ తేజ్, మెహ్రీన్‌లతో అనిల్ రావిపూడి తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'ఎఫ్ 2'. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ అనేది ఉపశీర్షిక. కేవలం వినోదమే లక్ష్యంగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఆ టార్గెట్ రీచ్‌అయిందో లేదో చూద్దాం.

ఫుల్ ఫన్.. కాస్త ఫ్రస్ట్రేషన్

కథేంటి...
వెంకీ (వెంకటేష్) ఓ ఎమ్మెల్యే వద్ద పీఏగా చేస్తుంటాడు. హారికతో (తమన్నా) పెళ్లి కుదురుతుంది. ఆలస్యంగా పెళ్లి కుదరడంతో అన్నిటికీ అడ్జస్ట్ అవుతాడు. అయితే పెళ్లయిన ఆరు నెలలకే హారికతో పాటు వాళ్ల ఫ్యామిలీ దెబ్బకు ఫ్రస్ట్రేషన్ చవిచూస్తాడు. ఇది చాలదన్నట్టు అక్క మాటకు వత్తాసు పలికే హనీ (మెహ్రీన్) కూడా రావడంతో వెంకీ ఫ్రస్ట్రేషన్ ఇంకాస్త పెరుగుతుంది. బోరబండ కుర్రాడు వరుణ్ యాదవ్(వరుణ్ తేజ్)తో హనీ ప్రేమ వ్యవహారం బయటపెట్టబోయి వారి పెళ్లికి కారణమవుతాడు వెంకీ. నిశ్చితార్థం అయిన ఆరు రోజులకే వరుణ్‌కి ఆ కుటుంబం చుక్కలు చూపించడంతో ఫ్రస్ట్రేషన్లో వెంకీకి తోడవుతాడు. ఈ ఇద్దరికీ మరో భార్యా బాధితుడు రాజేంద్రప్రసాద్ యాడ్ అవుతాడు. దూరంగా ఉంటేనే భార్యలకు తమ విలువ తెలిసొస్తుందని చెప్పాపెట్టకుండా యూరప్ చెక్కేస్తారు. భర్తలను వెనక్కు రప్పించడానికి అక్కాచెల్లెళ్లు ఏం చేశారు, జీవితాలు ఎలా సరిదిద్దుకున్నారు, ఈ రెండు జంటలు తిరిగి ఎలా కలిశారు అనేది మిగతా కథ.

ఎలా ఉందంటే...
ఒకప్పుడు వెంకటేష్ సినిమా అంటే ఫ్యామిలీ, యూత్ ఆడియెన్స్ తో థియేటర్ లు కళకళలాడేవి. ఈ మధ్య కాలంలో ఆయన ట్రెండ్ మార్చడంతో అటువంటి చిత్రాలు చేయలేదు. మళ్ళీ ఇప్పుడు కామెడీని పండించడంలో తనదైన మార్క్ వేసుకున్న దర్శకుడు అనిల్‌తో జతకట్టడంతో అంచనాలు పెరిగాయి. వాటిని వెంకీ తనదైన స్టయిల్ లో రీచ్ అయ్యాడు. ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడంలో సక్సెస్ అయ్యాడు. చాలాకాలం తర్వాత ఒక ఫ్యామిలీ ఎంటర్టైనర్ ని చూశామన్న ఫీల్ కలుగుతుంది. అనిల్ మంచి ఫన్ డైలాగులు రాశాడు. భార్యా బాధితుడి కష్టాలనే పాయింట్‌గా ఎంచుకున్నా, భార్యాభర్తలు ఒకరినొకరు ఎలా అర్థంచేసుకోవాలో ఒక మెసేజ్ ఇచ్చే ప్రయత్నం కూడా చేశాడు. తొలిసారి కామెడీ రోల్‌లో వరుణ్ తేజ్ మెప్పించాడు. అయితే టైమింగ్‌లో వెంకీని అందుకోవడం వరుణ్‌కు కష్టమైందనే చెప్పాలి. తమన్నా నటన కంటే గ్లామర్‌తోనే మెప్పించగా, మెహ్రీన్ రెండిటినీ బ్యాలెన్స్ చేసింది. ఫస్టాఫ్ నవ్వాపుకోలేనంతగా నవ్వించగా సెకండాఫ్‌లో ఫన్‌గ్రాఫ్‌తగ్గిపోయింది. తెలిసిన కథ కావడంతో పాటు రొటీన్‌గా సాగే సీన్స్‌తో ఫన్ స్థానంలో ప్రేక్షకుడికి కొంత ఫ్రస్ట్రేషన్ కలుగుతుంది. క్లైమాక్స్‌లో ఎలాంటి ట్విస్ట్ లు లేకుండా ఏదోకటి చేస్తారులే అన్నట్టు సింపుల్‌గానే ముగించారు. సినిమా మాత్రం రిచ్‌గా, కలర్‌ఫుల్‌గా ఉంటుంది. ప్రతి పాత్ర తో వినోదం పంచారు. దేవిశ్రీ మార్క్‌పాటల్లో ఎక్కడా కనిపించలేదు. వెంకటేష్ సినిమా క్లైమాక్స్ సీన్స్‌లో ఉండే ఎమోషన్ ఇందులో మిస్ అయింది. ఏదేమైనా బలమైన కథ, కథనాలు లేనప్పటికీ ఆద్యంతం వినోదం నింపుకుని ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా రూపొందిన ఈ సినిమా.. ఆ లక్ష్యాన్ని అందుకోగలిగింది. సంక్రాంతికి హాయిగా నవ్వుకోవాలనుకునే వారంతా ఈ సినిమా చూడొచ్చు.

ఐడియాతో వస్తే చాలు

కలలు నిజం చేసి కంపెనీలు పెట్టించే టీ హబ్



ఇండియాలో స్టార్టప్స్ సంఖ్య గత కొన్నేళ్లుగా భారీగా పెరుగుతోంది. సిలికాన్ వ్యాలీ మోటివేషన్‌తో ఎంతో మంది యువత తమ ఐడియాలను వ్యాపారాలుగా మలుచుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఐడియా ఒక్కటే వ్యాపారం కాదు కదా. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మాన్‌పవర్, మార్కెటింగ్, ఇవన్నీ చేయడానికి పెట్టుబడి ముఖ్యం. అంతే కాదు, అనుభవమున్న వ్యక్తుల గైడెన్స్ కూడా వ్యాపారంలో విజయానికి దోహదపడుతుంది. ఐడియాతో వచ్చిన ఎంట్రప్రెనూర్‌కి ఇవన్నీ ఒకే చోట దొరికితే, అంతకన్నా ఆనందం మరోటి ఉండదు ....అలాంటి ప్రయత్నమే టీహబ్. ప్రారంభమైన మూడేళ్లలోనే దేశంలోని ఇతర నగరాల నుంచీ ఎంట్రప్రెనూర్లను హైదరాబాద్‌కు రప్పించేంత ఆకర్షణ టీహబ్ సాధించిందంటే అతిశయోక్తి లేదేమో.

హైదరాబాద్, వెలుగు: నగరంలో స్టార్టప్స్ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్టార్టప్స్ కోసం ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుండడంతో ఎక్కువ సంఖ్యలో స్టార్టప్స్ ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వం టీహబ్ ద్వారా స్టార్టప్స్ ను తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన టీహబ్ స్టార్టప్స్ కు మెంటార్ షిప్ నుండి కో వర్కింగ్ స్పేస్ తో పాటు ఫండింగ్ లో తోడ్పడడం వరకు అన్ని రకాల సహకారాలను అందిస్తోంది. హైదరాబాద్ ను స్టార్టప్స్ కు డెస్టినేషన్ గా మలచడంలో టీహబ్ పాత్ర చాలా ముఖ్యమైనది. గచ్చిబౌలి లోని ఐఐటి హైదరాబాద్ లో 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన టీహబ్ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 300 స్టార్టప్ లకు నీడనిచ్చింది. దీన్లో 52 స్టార్టప్స్ నిధులు సమకూర్చుకోగా, 36 పేటెంట్స్, ట్రేడ్ మార్క్స్ రిజిస్టర్ అయ్యాయి. టీహబ్ నిర్వహించిన 800లకు పైగా కార్యక్రమాల్లో ఇప్పటిదాకా దాదాపు 56 వేల మంది పాల్గొన్నారు .



డిఎస్ టి నుండి టీహబ్ కు గుర్తింపు

డిపార్ట్ మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ టీ హబ్ ను బిజినెస్ ఇంక్యుబేటర్ గా గుర్తించింది. ఐఐటి, ఐఐఎమ్ ల తరువాత ఇలాంటి గుర్తింపు సాధించిన ఘనత టీహబ్ కే దక్కిందని చెప్పవచ్చు. టెక్నాలజీ ఇనోవేషన్ కు సంబంధించి ఎప్పటికప్పుడు స్టూడెంట్స్ ను ప్రోత్సహించడంతో పాటు సరైన దారిలో నడిచేలా వెన్నుదన్నుగా నిలుస్తోంది. టీహబ్ 2018 లో ప్రారంభించిన కమ్యునిటీ టూర్స్ లో భాగంగా ఇప్పటికే 10 వేల మంది విజిటర్లు టీహబ్ ను సందర్శించారు. దీన్లో పలు దేశాలకు చెందిన 1800 మంది విద్యావేత్తలు, ఉన్నతాధికారులు ఉన్నారు.

కోవర్కింగ్ స్పేస్ తో స్టార్టప్స్ కు తోడ్పాటు

ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ టీహబ్ కు గొప్ప విజయంగా చెప్పవచ్చు. టీహబ్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ ద్వారా స్టార్టప్స్ కు చెందిన 2783 మందికి పలు రకాల ఇండస్ట్రీస్, మెంటార్స్, సర్వీస్ ప్రొవైడర్లను కలిసేందుకు అవకాశం కల్పించింది. దీంతో స్టార్టప్స్ అభివృద్ధికి ఇవి తోడ్పడనున్నాయి. ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమైనప్పటి నుండి 457 స్టార్టప్స్ 5 విభిన్నమైన గ్రూపులుగా కలిసి టీహబ్ బిల్డింగ్ లో కలిసి పనిచేశాయి. ప్రస్తుతం ఉన్న లాబ్ 32 ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ లో 70 స్టార్టప్స్ కు కో వర్కింగ్ స్పేస్ ను అందిస్తోంది టీహబ్. టీహబ్ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల ద్వారా స్టార్టప్స్ తమ టీమ్ ను సులువుగా రిక్రూట్ చేసుకునే అవకాశం ఉండడంతో పాటు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం వెచ్చించే డబ్బును కూడా ఆదాచేసుకోవచ్చు. దీంతో పాటు ఈవెంట్లకు వచ్చే కార్పోరేట్లను నేరుగా కలిసే అవకాశం కూడా ఉంటుంది.

స్టార్టప్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయడం లక్ష్యం

టీహబ్ స్టార్టప్స్ కు తమ సపోర్ట్ అందించేందుకు దాదాపు 30 సర్వీస్ ప్రొవైడర్లు ముందుకువచ్చారు. హైదరాబాద్ లో స్టార్టప్ ఎకోసిస్టమ్ ను పూర్తి స్థాయిలో నిర్మించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్పోరేట్ ఇనోవేషన్ ప్రోగ్రామ్ టీహబ్ మూలస్తంభాల్లో ఒకటి. దీంతో స్టార్టప్స్ ను కార్పోరేట్స్ ను ఒకే తాటిమీదికి తీసుకురావాలనేది టీహబ్ లక్ష్యం. 75 కుపైగా గ్రూప్ స్టార్టప్స్ ఉండగా, దీన్లో 11 స్టార్టప్స్ కు ఆర్డర్లు రాగా, మరో 5 స్టార్టప్స్ ను నార్టెక్, జాగెల్, హిమాక్స్ వంటి కంపెనీలు పూర్తిగా సొంతం చేసుకున్నాయి. యునైటెడ్ టెక్నాలజీస్, ఫేస్ బుక్, ఉబర్, స్టేన్లీ బ్లాక్& డెకర్ వంటి పలు కంపెనీలతో టీహబ్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతోపాటు క్వాల్కామ్, బోయింగ్, శాంసంగ్, సిస్కో వంటి కంపెనీలు తమ సొంత ఐడియాలను డెవలప్ చేయడానికి టీహబ్‌లోని స్టార్టప్స్ తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీటన్నింటి భాగస్వామ్య విలువ రూ. 120 కోట్లు.

అంతర్జాతీయ స్థాయిలో నెట్ వర్క్

గతేడాది ప్రారంభించిన ఇంటర్నేషనల్ రిలేషన్స్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే టీహబ్ లోని స్టార్టప్స్ కు 60 మార్కెట్ కనెక్షన్లు కల్పించాయి. మన స్టార్టప్స్ ను కలిసి వాటి గురించి పూర్తిగా తెలుసుకోవడానికి విదేశీ ప్రతినిధులకు వీలు కల్పించే కార్యక్రమాలు నిర్వహించింది. అలా ఇప్పటిదాకా 40 విదేశీ ప్రతినిధుల బృందాలు టీహబ్ స్టార్టప్స్‌ను కలిసి, తెలుసుకుని వెళ్లాయి. దీంతో పాటు 25 స్టార్టప్స్ అంతర్జాతీయ ఈవెంట్లలో మన ఎంట్రప్రెనూర్లు పాల్గొనడానికి టీహబ్ తోడ్పాటునందించింది. ప్రస్తుతం యుకే, ఇజ్రాయిల్, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాలతో టీహబ్‌కు నెట్ వర్క్ ఉంది. గత రెండేళ్లలో గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్ షిప్ సమ్మిట్, స్లష్, ఫ్రెంచ్ టెక్ టూర్స్, ది పీర్స్ ప్రోగ్రామ్, గ్లోబల్ స్టార్టప్ వర్ల్డ్ కప్ వంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలను నిర్వహించింది. స్థిరమైన స్టార్టప్ ఎకోసిస్టమ్ ను నిర్మించడంలో పలు ఇతర రాష్ట్రాలకు కూడా టీహబ్ మార్గదర్శకంగా నిలుస్తోంది. ముఖ్యంగా తమ ఇనోవేషన్ స్థాయిని పెంచుకోవడంలో మెంటార్ గా వ్యవహరిస్తోంది.



> స్టార్టప్స్ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో టీహబ్ కు గుర్తింపు లభించింది. ఎన్నో కంపెనీలు టీహబ్ తో భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నాయి. స్టార్టప్స్ కు మెంటార్షిప్ నుండి ఫండింగ్ వరకు అన్నిరకాలుగా టీహబ్ చేదోడువాదోడుగా ఉంటుంది. దీనికోసం పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇనోవేషన్ టెక్నాలజీలకు పెద్దపీట వేస్తున్నాం. స్టార్టప్స్ కు ఉపయోగపడేలా భవిష్యత్ లో టీహబ్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం.
>
> - డా.శాంత తౌటం, వైస్ ప్రెసిడెంట్, టీహబ్.

మొండి బాకీలు దండిగా ఉన్నాయ్
తగ్గించుకుంటాం

- ఇందుకోసం 1,500 మందిని నియమించాం
- ప్రత్యేకశాఖలను ఏర్పాటు చేశాం
- జూన్ నాటికి లాభాల్లోకి వస్తాం
- రుణాల మాఫీ వల్ల ఇబ్బందులు వస్తున్నాయి
- సిండికేట్ బ్యాంక్ సీఈఓ, ఎండీ మృత్యుంజయ్ మహాపాత్ర

హైదరాబాద్, వెలుగు: మొండి బకాయిలను (ఎన్‌పీఏలు) తగ్గించుకొని ఈ ఏడాది జూన్ నాటికి లాభాల్లోకి వస్తామని సిండికేట్ బ్యాంక్ సీఈఓ, ఎండీ మృత్యుంజయ్ మహాపాత్ర అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే నికర ఎన్‌పీఏలను 6.83 శాతం నుంచి ఆరు శాతం దిగువకు, స్థూల ఎన్‌పీఏలను 12.98 శాతం నుంచి 12 దిగువకు తగ్గించుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "మొండిబకాయిలను తగ్గించుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. కొన్ని కేసుల్లో సర్ఫేసిని అమలు చేస్తున్నాం. మొండిబకాయిల వసూలుకు ప్రత్యేకంగా 1,500 మందిని నియమించాం. ఎనిమిది బ్రాంచ్‌లు ఇదే పనిమీద ఉన్నాయి. రాబోయే ఆరు నెలల్లో 1,500 కోట్ల వరకు మొండిబకాయిలు వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్బీఐ ఎన్సీఎల్టీకి పంపించిన కేసులు పరిష్కారమైతే మరిన్ని బకాయిలు వసూలవుతాయి. మార్చి వరకు బ్రేక్ ఇవెన్ సాధిస్తాం. జూన్ నాటికి లాభాల్లోకి వస్తాం" అని వివరించారు. పలు రాష్ట్రాల్లో సాగు రుణాలు మాఫీ చేయడంపై అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ తమ రుణం కూడా మాఫీ అవుతుందని చాలా మంది రైతులు అప్పులు కట్టడం మానేస్తున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్రాలు చొరవ చూపాలని, సాగురుణం మొత్తాన్ని ప్రత్యక్ష నగదు లబ్ధి పద్ధతిలో వారి ఖాతాల్లోనే జమ చేయాలని మహాపాత్ర అభిప్రాయపడ్డారు. మూలధనం గురించి ప్రస్తావించగా ఈ ఏడాదిలో తమకు రూ.2,360 కోట్లు వచ్చాయని తెలిపారు. ఎంప్లాయి షేర్ పర్చేజింగ్ పథకం ద్వారా మరో రూ.600 కోట్ల వరకు సమీకరిస్తామని చెప్పారు. వ్యాపారవృద్ధికి సంబంధించిన అంశాలపై స్పందిస్తూ "ప్రస్తుతం డొమెస్టిక్ డిపాజిట్స్‌లో సేవింగ్స్ ఖాతాల వాటా 33.6 శాతం ఉంది. దీనిని ఈ ఏడాది ఆఖరుకల్లా 33.46 శాతానికి తీసుకెళ్తాం. సీఆర్పీ టెక్నాలజీస్ వంటి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకొని కొత్త ప్రొడక్ట్స్ ప్రవేశపెడుతున్నాం. రిటైల్, హౌసింగ్, ఎంఎస్ఎంఈల రుణాలను పెంచుతున్నాం. ప్రస్తుతం మాకు దేశవ్యాప్తంగా నాలుగు వేల శాఖలు ఉన్నాయి. వీటిని మెల్లగా పెంచుతున్నాం" అని మహాపాత్ర వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మహాపాత్ర (కుడి)



ఇండియాలో ఫేస్‌బుక్ అడ్వర్‌టైజింగ్ సగటు ఖర్చు...

- రోజుకు రూ.40 మినిమమ్ బడ్జెట్‌తో ఫేస్‌బుక్‌లో అడ్వర్‌టైజింగ్ ప్రారంభించుకోవచ్చు.
- లింక్ క్లిక్స్ కోసం యావరేజ్ కాస్ట్ ఫర్ క్లిక్ రూ.0.10 నుంచి రూ.2.3
- 1000 ఇంప్రెషన్లకు యావరేజ్ కాస్ట్ రూ.9.3
- ఒక్కో లైక్‌కు యావరేజ్ కాస్ట్ రూ.0.72
- ఒక్కో వీడియో చూసినందుకు యావరేజ్ కాస్ట్ రూ.0.27
- ఒక్కో మొబైల్ యాప్ ఇన్‌స్టాల్‌కు యావరేజ్ కాస్ట్ రూ.13
- యాడ్ రీకాల్‌కు యావరేజ్ కాస్ట్ రూ.0.22

ఫేస్‌బుక్ యాడ్స్ వల్ల లాభాలు...

- ఆన్‌లైన్ సేల్స్ పెంపు
- లోకల్ సేల్స్ పెరుగుతాయ్
- బ్రాండ్ అవగాహన కల్పిస్తుంది
- మీ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తుంది

ప్రచారం ఇప్పుడు ఈజీనే

ఫేస్‌బుక్ ఉందిగా, చాలు

మార్కెటింగ్ అంటే ఒకప్పుడు ఇంటింటికి తిరుగుతూ.. తమ ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేసుకోవడం. లేదా న్యూస్ పేపర్లలో యాడ్స్‌కో, పాంప్లెట్లకో పెద్ద ఎత్తున ఖర్చు పెడుతూ తమ వ్యాపారాలను పెంచుకోవడం చేసేవారు. ఇలా విపరీతంగా ఖర్చు చేయలేక, తమ ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేసుకోలేక చాలా చిన్న కంపెనీలు చతికిలపడేవి. కానీ సోషల్ మీడియా రావడంతో మార్కెటింగ్ స్వరూపమే మారిపోయింది.


వెలుగు బిజినెస్ డెస్క్

చిన్న చిన్న కంపెనీలు, చిరు వ్యాపారులు సొంతంగా ఒక ఇన్నోవేటివ్ ప్రొడక్ట్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలంటే ఇప్పుడు సోషల్ మీడియానే ఎంచుకుంటున్నారు. అంతేనా ఏమిటి, ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేసుకోవడానికి కూడా సోషల్ మీడియానే. ఫేస్‌బుక్ ద్వారా మార్కెటింగ్ జరపడం ఆన్‌లైన్ వర్తకంలో ఓ ట్రెండ్‌గా మారిపోయింది. ఈ మార్కెట్ కూడా శరవేగంగా ఉరకలు పెడుతోంది. అన్ని డిజిటల్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఫేస్‌బుక్ అగ్రస్థానంలో ఉన్నట్టు తాజా డేటాలో వెల్లడైంది. స్టాటిస్టా.కామ్ ప్రకారం సగటు ఫేస్‌బుక్ యూజర్లు 227 కోట్లకు(నెలవారీగా) పెరిగారు. రోజురోజుకు ఫేస్‌బుక్ యూజర్లు పెరుగుతూనే ఉన్నారు. 2004లో ఈ కంపెనీని మార్క్ జుకర్‌బర్గ్ ప్రారంభించారు. పర్సనల్ ప్రొఫైల్ సెట్ చేసుకునే స్థాయి నుంచి బ్రాండ్లను ప్రమోట్ చేసుకునే స్థాయికి ఫేస్‌బుక్ ఎదిగింది. ఈ మధ్య కాలంలో ఎన్నో ఫీచర్లు. 25,000 కోట్లకు పైగా కంటెంట్ ఈ ప్లాట్‌ఫామ్‌పై షేర్ అవుతూ ఉంటోంది. అతిపెద్ద డేటా స్టోరేజ్ యూనిట్‌లో ఇదీ ఒకటి. 17 కోట్లకు పైగా విషయాల గురించి ఈ ప్లాట్‌ఫామ్‌పై ఎప్పుడికప్పుడు చర్చిస్తూ ఉంటారు. దీంతో చాలా మంది తమ బ్రాండ్‌ను ప్రమోట్ చేసుకోవడం కోసం ఫేస్‌బుక్‌నే ఎంచుకుంటున్నారు. ఏదైనా కొత్త ప్రొడక్ట్ తయారు చేస్తే .. వెంటనే దానిని ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసేస్తున్నారు. ఆ ప్రొడక్ట్ ప్రత్యేకతలు, ధర, కాంటాక్ట్ వివరాలు అన్నింటినీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఏ బిజినెస్ సక్సెస్ కావాలన్నా.. మార్కెటింగే కదా కీలకం...అమ్ముకుంటేనే కదా ఆదాయం, లాభాలు వచ్చేది! దానికి ఎంతో ముఖ్యమైన ప్లాట్‌ఫామ్ ఫేస్‌బుకే. కస్టమర్లను చేరుకోవడానికి డిజిటల్ టెక్నాలజీస్ ఎంతో సహకరిస్తున్నాయి. దీంతో ట్రెడిషినల్ అడ్వర్‌టైజ్‌మెంట్ కొంత వెనకపడుతోంది. ఫేస్‌బుక్ కూడా కస్టమర్లను చేరుకోవడానికి, కనెక్ట్ కావడానికే ఎక్కువగా ఫోకస్ చేస్తోంది.

- డిజిటల్ అడ్వర్‌టైజ్‌మెంట్‌లో ఫేస్‌బుక్ ఉరుకులు
- క్లిక్ అయితే చాలు, లాభాలే లాభాలు

ఫేస్‌బుక్‌లో అడ్వర్‌టైజింగ్‌కు అంతులేని మార్గాలు..

ఫేస్‌బుక్ ఎన్నో వ్యాపారాలు వృద్ధి చెందడానికి మధ్య మార్గంగా ఉపయోగపడుతూ ఉంది. వ్యాపారాలు చేసే వారు కొత్త కస్టమర్లను చేరుకోవడానికి సహకరిస్తోంది. దీనికి కారణం ఈ ప్లాట్‌ఫామ్‌పై అత్యధిక మంది యూజర్లుండటమే. అంతేకాక చిన్న వ్యక్తుల నుంచి, పెద్ద బ్రాండ్ల వరకు తమ ఉత్పత్తులను అడ్వర్‌టైజింగ్ చేసుకోవడానికి ఫేస్‌బుక్ చాలా ఆప్షన్లనే అందిస్తోంది. ఇక్కడ మార్కెటింగ్ తేలిక, ఖర్చు కూడా అంతగా ఉండదు. స్వల్ప బడ్జెట్‌లోనే ఎక్కువ మంది ఆడియన్స్ చేరుకోవడానికి ఫేస్‌బుక్ బెస్ట్ ప్లాట్‌ఫామ్. యాడ్స్‌ను కూడా ఫేస్‌బుక్ యూజర్ల వయసు, లొకేషన్, జెండర్ బట్టి వర్గీకరిస్తూ ఉంటోంది. దాని ప్రకారం అనాలసిస్ చేసి, వ్యాపారాలను ప్రమోట్ చేసుకునేలా సంస్థలకు సహకరిస్తోంది. ఫేస్‌బుక్‌లో యాడ్ క్లిక్ అయితే చాలు, ఆ బ్రాండ్ ఎంతో మంది యూజర్లకు చేరువవుతోంది. కంపెనీలకు రెవెన్యూలు కూడా ఇబ్బడి ముబ్బడిగా వచ్చి చేరతాయి. కస్టమర్లు కూడా భిన్నమైన బ్రాండ్లను ఎంపిక చేసుకునేందుకు వీలవుతోంది. ఎన్నో బ్రాండ్లను, ఉత్పత్తులను చూసిన తర్వాత, తమకు కావాల్సింది కస్టమర్లు ఎంపిక చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా లక్షల మందిని ఫేస్‌బుక్ ద్వారా చేరుకోవచ్చు. అంతేకాక ప్రొడక్ట్‌ల విషయంలో కంపెనీలు, కస్టమర్లు ఒకరికొకరు చర్చించుకోవడానికి కూడా చాలా మంచి వేదిక. అయితే ప్రతి దానిలో ఉన్నట్టే ఫేస్‌బుక్ మార్కెటింగ్‌లో కూడా అనుకూలతలు, ప్రతికూలతలు ఉన్నాయి.



గూగుల్‌కి చేరువగా ఫేస్‌బుక్ యాడ్ రెవెన్యూ

ప్రస్తుతం 68 శాతం ఇండియా డిజిటల్ యాడ్ మార్కెట్ 2017లో ఫేస్‌బుక్, గూగుల్ మధ్యనే ఉందని అడ్వర్‌టైజింగ్ బయర్ మాగ్నా తెలిపింది. యాడ్ రెవెన్యూ విషయంలో కూడా ఫేస్‌బుక్, గూగుల్ కు చేరువగా వచ్చేస్తోందని పలు రిపోర్టులు చెప్పాయి. 2018లో ఫేస్‌బుక్ యాడ్ రెవెన్యూ నాన్ యూఎస్‌లో 1895 కోట్ల డాలర్లు ఉంటే, యూఎస్‌లో 1489 కోట్ల డాలర్లు ఉంది. ప్రపంచవ్యాప్తంగా 3384 కోట్ల డాలర్లు ఉంది. ఫేస్‌బుక్ ఇండియా రెవెన్యూలు 2017లో 93 శాతం జంప్ చేసి రూ.341.8 కోట్లుగా రికార్డయ్యాయి. అంతకుముందటి ఏడాది ఇవి రూ.177 కోట్లే ఉన్నాయి. అంటే ఇండియాలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా కూడా ఫేస్‌బుక్ యాడ్ రెవెన్యూ బాగా పెరుగుతోంది.



20 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్

హైదరాబాద్, వెలుగు: అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్ ఈవెంట్ మళ్లీ వచ్చింది. ఈ నెల 20 నుంచి 23 వరకు ఈ సేల్ నిర్వహిస్తామని కంపెనీ ప్రకటించింది. ఈ నాలుగు రోజులపాటు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, హెడ్‌ఫోన్లు, గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్లు, ఆఫర్లు ఇస్తామని తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ కార్డులతో కొంటే 10 శాతం తక్షణ డిస్కౌంట్ ఉంటుంది. ప్రైమ్ మెంబర్లకు ఈ నెల 19 నుంచే సేల్ మొదలవుతుంది. దాదాపు 10 కోట్ల ప్రొడక్ట్స్‌పై నో కాస్ట్ ఈఎంఐ అందిస్తున్నారు. బజాజ్ ఫిన్‌సర్వ్‌తో పాటు మరికొన్ని క్రెడిట్‌కార్డులతో కొంటే ఈ ఆఫర్ వర్తిస్తుంది. వన్‌ప్లస్ 6టీ, రెడ్‌మీ వై2, హువావే నోవా 3ఐ, హానర్ 8ఎక్స్ స్మార్ట్‌ఫోన్లపై భారీ తగ్గింపు ఇస్తామని కంపెనీ తెలిపింది. ఆపిల్, రియల్‌మీ, షావోమీ, ఎల్జీ, ఫిలిప్స్ వంటి కంపెనీల వస్తువులపై 60 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తామని, టీవీలపై, గృహోపకరణాలపైనా 50 శాతం తగ్గింపు ఉంటుందని అమెజాన్ వివరించింది.

సిటీ బ్యాంక్‌కు రూ. 3 కోట్ల జరిమానా!

న్యూఢిల్లీ : సిటీ బ్యాంక్‌కి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.3 కోట్ల జరిమానా విధించింది. బ్యాంక్ డైరెక్టర్ విషయంలో 'ఫిట్ అండ్ ప్రోపర్ క్రైటిరియా' నిబంధనలను పాటించలేదనే విషయంలో సిటీ బ్యాంక్‌కి ఈ జరిమానా పడింది. డైరెక్టర్ల నియామకాల్లో ఆదేశాలను పాటించకపోవడమే ఈ జరిమానాకు కారణమని ఆర్‌బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. 2013లోనే ఆర్‌బీఐ ఈ విషయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.



నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.443	రూ.5.05
వరంగల్	రూ.445	రూ.5.05

టార్గెట్ 289... రోహిత్, ధవన్, కోహ్లీ, ధోనీ, రాయుడు, కార్తీక్‌తో కూడిన జట్టుకు ఇదో లెక్క కాదు. ఆసియా కప్, విండీస్ సిరీస్‌లో దుమ్మురేపి మంచి ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మెన్ ఈ లక్ష్యాన్ని ఊదేస్తారనుకుంటే... స్కోరు బోర్డుపై 4 పరుగులు చేరాయో లేదో ముగ్గురు ప్రధాన బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు తిరిగొచ్చారు. ఆసీస్ కుర్ర పేసర్లు రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్ ధాటికి టాపార్డర్ చేతులెత్తేసిన సమయంలో వన్డే వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ వీరోచిత సెంచరీ... మాజీ సారథి ధోనీ హాఫ్ సెంచరీ టీమిండియాను గెలిపించలేకపోయాయి.

ఇండియాకు రిచర్డ్ స్ట్రోక్!

రోహిత్ శర్మ సెంచరీ వృథా

తొలి వన్డేలో 34 రన్స్‌తో కోహ్లీసేన ఓటమి

దెబ్బకొట్టిన రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్


రిచర్డ్‌సన్ (4/26)


రోహిత్
బంతులు: 129
పరుగులు : 133
ఫోర్లు: 10
సిక్సర్లు: 6

సిడ్నీ: టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన టీమిండియా వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో అనూహ్యంగా తడబడింది. కొత్త కూర్పుతో బరిలో దిగిన ఆస్ట్రేలియా చాలా రోజుల తర్వాత ఓ చక్కటి విజయంతో ఊపిరిపీల్చుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన పోరులో ఆస్ట్రేలియా 34 పరుగుల తేడాతో గెలిచి 1-0తో ముందంజ వేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కంగారూలు 5 వికెట్ల నష్టానికి 288 రన్స్ చేశారు. హ్యాండ్స్‌కోంబ్ (73;), ఖవాజా (59), షాన్ మార్ష్ (54) అర్ధ సెంచరీలు బాదగా... స్టొయినిస్ (47 నాటౌట్) కీలక పరుగులు చేశాడు. భువనేశ్వర్, కుల్దీప్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 289 పరుగుల టార్గెట్‌తో బరిలో దిగిన టీమిండియా 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 254 పరుగులే చేయగలిగింది. రోహిత్ (129 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో133) భారీ సెంచరీతో చెలరేగగా... చాన్నాళ్ల తర్వాత ధోనీ (96 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో51) ఫిఫ్టీ కొట్టాడు. ఆసీస్ బౌలర్లలో రిచర్డ్‌సన్ (4/26), అరంగేట్ర పేసర్ బెరెన్‌డార్ఫ్ (2/39) ఆకట్టుకున్నారు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే మంగళవారం అడిలైడ్‌లో జరగనుంది.

టాప్ ధమాల్..

కష్టసాధ్యంకాని ఛేజింగ్‌లో 4 ఓవర్లు ముగిసేసరికి టీమిండియా స్కోరు 4/3. ఇటీవలి కాలంలో టాపార్డర్ ఇంతగా నిరాశ పరచడం ప్రేక్షకులు చూసి ఉండరేమో. బెరెన్‌డార్ఫ్ వేసిన తొలి ఓవర్ చివరి బంతికి ధవన్ (0) వికెట్ల ముందు అడ్డంగా బుక్కయి గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. నాలుగో ఓవర్‌లో జట్టుకు దెబ్బ మీద దెబ్బ పడింది. కెప్టెన్ కోహ్లీ (3) తో పాటు, అంబటి రాయుడు (0) మూడు బంతుల వ్యవధిలో పెవిలియన్ చేరారు. దీంతో టీమిండియా 10 ఓవర్లు ముగిసేసరికి 21/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇన్నింగ్స్‌ను నడిపించాల్సిన బాధ్యత భుజానెత్తుకున్న రోహిత్... మాజీ సారథి ధోనీతో కలిసి ఒక్కో పరుగు జతచేస్తూ వెళ్లాడు. వీలు చిక్కినప్పుడల్లా భారీ షాట్లు ఆడిన ఈ జోడీ క్రమంగా బలపడుతుండటంతో ఇండియా తిరిగి పోటీలోకొచ్చింది. నాలుగో వికెట్‌కు 137 రన్స్ జోడించాక మహీ ఎల్బీగా పెవిలియన్ చేరాడు. రిప్లేలో బతికిపోయే అవకాశం కనిపించినా... రివ్యూ లేకపోవడంతో ఇండియాకు నిరాశ తప్పలేదు. కాసేపటికే కార్తీక్ (12) అనవసర షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. జోరు తగ్గని రోహిత్ మాత్రం110 బంతుల్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. విజయానికి 6 ఓవర్లలో 76 పరుగులు చేయాల్సి ఉన్నా... రోహిత్ దూకుడు చూస్తుంటే ఇదేం పెద్ద కష్టం అనిపించలేదు. కానీ కీలక దశలో జడేజా (8)ఔటవడంతో... ఇక చేసేది లేక భారీ షాట్లకు దిగిన రోహిత్ ..మ్యాక్స్‌వెల్ చేతికి చిక్కడంతో టీమిండియా ఆశలు ఆవిరయ్యాయి.

ఈ మ్యాచ్‌లో1986 నాటి జెర్సీలతో బరిలో దిగిన కంగారూలు నాటి ఆసీస్ జట్టును తలపించే ప్రదర్శన చేశారు. మొదట బ్యాట్‌తో అదరగొట్టి ఆ తర్వాత బంతితోనూ మెరిశారు. క్లిష్ట సమయంలో దక్కిన ఈ విజయానికి ఇది కూడా ఒక కారణమేనేమో.
మరోవైపు ఆస్ట్రేలియా గడ్డపై రోహిత్ శర్మ సెంచరీ చేసిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఇండియా ఓటమి పాలైంది.

తలో చేయి...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు మంచి ఆరంభం దక్కలేదు. భువీ వేసిన మూడో ఓవర్లో కెప్టెన్ ఫించ్ (6) బౌల్డయ్యాడు. మరో ఓపెనర్ అలెక్స్ కారీ (24)తో జత కలిసిన ఖవాజా నెమ్మదిగా బ్యాటింగ్ చేశాడు. అయితే, కుల్దీప్ చక్కటి బంతితో కారీని బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత షాన్ మార్ష్, ఖవాజా జోడీ ఒక్కో పరుగు జత చేస్తూ ఇన్నింగ్స్ ముందుకు నడిపించింది. మూడో వికెట్‌కు 92 పరుగులు జోడించిన అనంతరం జడేజా బౌలింగ్‌లో ఖవాజా వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ దశలో క్రీజులోకొచ్చిన హ్యాండ్స్‌కోంబ్ ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. హ్యాండ్స్‌కోంబ్‌కు స్టొయినిస్ జత కూడటంతో స్కోరు వేగం మరింత పెరిగింది. వీరిద్దరితో పాటు చివర్లో మ్యాక్స్‌వెల్ (11 నాటౌట్) కూడా ఓ చేయి వేయడంతో ఆసీస్ చివరి 10 ఓవర్లలో 93 పరుగులు పిండుకుంది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: కారీ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 24; ఫించ్ (బి) భువనేశ్వర్ 6; ఖవాజా (ఎల్బీ) జడేజా 59; షాన్ మార్ష్ (సి) షమీ (బి) కుల్దీప్ 54; హ్యాండ్స్‌కోంబ్ (సి) ధవన్ (బి) భువనేశ్వర్ 73; స్టొయినిస్ (నాటౌట్) 47; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు 14; మొత్తం: 50 ఓవర్లలో 288/5; వికెట్ల పతనం:** 1-8, 2-41, 3-133, 4-186, 5-254; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-66-2, ఖలీల్ 8-0-55-0, షమీ 10-0-46-0, కుల్దీప్ 10-0-54-2, జడేజా 10-0-48-1, రాయుడు 2-0-13-0.

ఇండియా : రోహిత్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 133; ధ వన్ (ఎల్బీ) బెరెన్‌డార్ఫ్ 0; కోహ్లీ (సి) స్టొయినిస్ (బి) రిచర్డ్‌సన్ 3; రాయుడు (ఎల్బీ) రిచర్డ్‌సన్ 0; ధోనీ (ఎల్బీ) బెరెన్‌డార్ఫ్ 51; కార్తీక్ (బి) రిచర్డ్‌సన్ 12; జడేజా (సి) మార్ష్ (బి) రిచర్డ్‌సన్ 8; భువనేశ్వర్ (నాటౌట్) 29; కుల్దీప్ (సి) ఖవాజా (బి) సిడిల్ 3; షమీ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 1; **ఎక్స్‌ట్రాలు 14; మొత్తం: 50 ఓవర్లలో 254/9; వికెట్ల పతనం:** 1-1, 2-4, 3-4, 4-141, 5-176, 6-213, 7-221, 8-247, 9-254; **బౌలింగ్:** బెరెన్‌డార్ఫ్ 10-2-39-2, రిచర్డ్‌సన్ 10-2-26-4, సిడిల్ 8-0-48-1, లైయన్ 10-1-50-0, స్టొయినిస్ 10-0-66-2, మ్యాక్స్‌వెల్ 2-0-18-0.

3

టీమిండియా తరఫున అత్యధిక వన్డే సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో రోహిత్ మూడో స్థానానికి చేరాడు. 22 శతకాలతో గంగూలీతో సమమయ్యాడు. సచిన్ (49), కోహ్లీ (38) ముందున్నారు.

7

ఆస్ట్రేలియాపై రోహిత్ చేసిన సెంచరీలు. కంగారూలపై అత్యధిక సార్లు వంద రన్స్ చేసిన క్రికెటర్లలో సెకండ్ బెస్ట్. సచిన్ 9 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్ క్రికెటర్ డెస్మండ్ హేన్స్ ఖాతాలో ఆరు సెంచరీలు ఉన్నాయి.

3

ఇండియా–ఆస్ట్రేలియా మధ్య వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మూడో క్రికెటర్ రోహిత్ శర్మ. 29 మ్యాచ్‌ల్లో 1726 రన్స్ చేసిన అతడు.. ఆడమ్ గిల్‌క్రిస్ట్ (1622)ను దాటి థర్డ్ ప్లేస్‌కు వచ్చాడు. సచిన్ 3077 రన్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉండగా.. రికీ పాంటింగ్ 2164 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు

ధోనీ @ 10000



వెటరన్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ ఖాతాలో మరో ఘనత చేరింది. మహీ వన్డేల్లో పదివేల పరుగుల మైలురాయిని దాటాడు. సిడ్నీ వన్డేలో ఎదుర్కొన్న ఏడో బంతికి సింగిల్ తీసి పదివేల మార్కును చేరుకున్నాడు. దాంతో, ఈ ఘనత సాధించిన ఇండియా ఐదో క్రికెటర్‌గా ధోనీ నిలిచాడు. వాస్తవానికి 2017లో ఇంగ్లండ్ టూర్ సందర్భంగానే మహీ పదివేల రన్స్ పూర్తిచేశాడు. కానీ, అందులో ఆసియా లెవెన్ తరఫున మూడు మ్యాచ్‌ల్లో చేసిన 174 పరుగులు కూడా ఉన్నాయి.

1000

అంతర్జాతీయ మ్యాచ్ (టెస్టులు, వన్డేలు, టి20)ల్లో ఆస్ట్రేలియాకు ఇది వెయ్యో విజయం. 1877లో ఇంగ్లండ్‌పై తొలి విజయాన్ని నమోదు చేసుకున్న ఆసీస్ 1000 విజయాలు సాధించిన తొలి జట్టుగా రికార్డులకెక్కింది.

కార్తీక్‌కు గోల్డ్ మెడల్

శివరామకృష్ణ





కార్తీక్

- జిమ్నాస్ట్ మేఘనకు కాంస్యం
- ఖేలో ఇండియా యూత్ గేమ్స్

పుణె: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాళ్లు సత్తాచాటారు. పుణె వేదికగా జరుగుతోన్న ఈ పోటీల్లో అండర్-17 విభాగంలో తెలంగాణకు చెందిన హలావత్ కార్తీక్ బంగారు పతకం చేజిక్కించుకోగా... ఆంధ్ర లిఫ్టర్ శివరామకృష్ణ యాదవ్ ఓ గోల్డ్, ఓ సిల్వర్ గెలుచుకున్నాడు. ఏపీకే చెందిన లిఫ్టర్ లలిత రజతం నెగ్గింది. జిమ్నాస్టిక్స్‌లో హైదరాబాద్‌కు చెందిన మేఘనా రెడ్డి కాంస్య పతకంతో మెరవగా... బ్యాడ్మింటన్‌లో ప్రణవ్ రావు బంగారు పతక పోరుకు అర్హత సాధించాడు. బాలుర అండర్-17 (89 కేజీలు) విభాగంలో 258 కేజీల (స్నాచ్‌లో-112, జెర్క్‌లో-146) బరువెత్తిన కార్తీక్ (తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్) అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం అందుకున్నాడు. భోలా సింగ్ (219 కేజీలు, బీహార్), గుర్‌కరణ్ (213 కేజీలు, పంజాబ్) రజతం, కాంస్యం దక్కించుకున్నారు. అండర్-17 (81 కేజీలు) బాలుర విభాగంలో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన శివరామకృష్ణ 267 కేజీల బరువెత్తి స్వర్ణం నెగ్గాడు. అండర్-21 జూనియర్ మహిళల 64 కేజీల కేటగిరీలో 195 కిలోల బరువెత్తిన ఏపీ లిఫ్టర్ జి. లలిత రజతం గెలిచింది. అండర్-21 రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో మేఘనా రెడ్డి (39.30 పాయింట్లు) మూడో స్థానంతో కాంస్యం గెలిచింది. ఈ విభాగంలో అదితీ (46.40; మహారాష్ట్ర), కిమయా (41.00; మహారాష్ట్ర) తొలి రెండు స్థానాలు దక్కించుకున్నారు. బ్యాడ్మింటన్ బాలుర అండర్-17 సెమీస్‌లో ప్రణవ్ 21-19, 12-21, 21-12తో తుకుమ్‌పై నెగ్గి తుది పోరుకు అర్హత సాధించాడు.

హైదరాబాద్ ఔట్

- సెమీస్‌లో హంటర్స్‌కు షాకిచ్చిన ముంబై రాకెట్స్
- నేడు రాప్టర్స్‌తో టైటిల్ ఫైట్
- ఫైనల్ రా. 7 నుంచి



బెంగళూరు : ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో ఎడిషన్‌లో హైదరాబాద్ హంటర్స్ పోరాటం ముగిసింది. డిఫెండింగ్ చాంపియన్‌గా సీజన్‌ను ప్రారంభించిన హంటర్స్ శనివారం జరిగిన రెండో సెమీఫైనల్‌లో 2-4 తేడాతో ముంబై రాకెట్స్ చేతిలో ఓడిపోయింది. గతంలో రెండు సార్లు ఫైనల్ చేరి ఓడిపోయిన ముంబై రాకెట్స్ ఆదివారం బెంగళూరు రాప్టర్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ముంబైతో సెమీస్‌లో కెప్టెన్ పీవీ సింధు మినహా హంటర్స్ జట్టు మొత్తం చేతులెత్తేసింది. తొలుత జరిగిన పురుషుల డబుల్స్‌లో ఇసారా-సారంగ్(హంటర్స్) జోడీ14-15, 12-15 తేడాతో కిమ్‌జి జంగ్-లి యాంగ్(రాకెట్స్) జంట చేతిలో ఓడిపోయింది. ఆపై, పురుషుల తొలి సింగిల్స్‌లో రాకెట్స్ ప్లేయర్ కాల్‌జౌ 8-15, 7-15తో సమీర్ వర్మ(రాకెట్స్) చేతిలో ఓడిపోయాడు. రాకెట్స్‌కు ఇది ట్రంప్ మ్యాచ్ కావడంతో 0-3తో ఆధిక్యం సాధించింది. హంటర్స్ ట్రంప్‌గా ఎంచుకున్న మహిళల సింగిల్స్‌లో కెప్టెన్ సింధు 15-6, 15-5తో శ్రీయాన్షి (రాకెట్స్)ను చిత్తుగా ఓడించింది. దాంతో, హైదరాబాద్ 2-3తో రేసులోకొచ్చింది. కానీ, టోర్నీలో నిలవాలంటే గెలిచి తీరాల్సిన పురుషుల రెండో సింగిల్స్‌లో హంటర్స్ ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో హ్యాన్ 13- 15, 8-15తో ఆంటన్‌సన్(రాకెట్స్) చేతిలో చిత్తయ్యాడు. దీంతో 2-4కు ఆధిక్యం పెంచుకున్న ముంబై మిక్స్‌డ్ పోరు అవసరం లేకుండానే ఫైనల్‌కు చేరుకుంది.

భారీ ఆధిక్యం దిశగా సౌతాఫ్రికా

జొహాన్నెస్ బర్గ్: పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడో టెస్టులో సౌతాఫ్రికా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సెకండ్ ఇన్నింగ్స్‌లో 135/5 చేసిన ప్రొటీస్ జట్టు 212 రన్స్ లీడ్‌లో ఉంది. హషీమ్ ఆమ్లా(42 బ్యాటింగ్), డికాక్(34 బ్యాటింగ్) క్రీజులో ఉన్నా రు. ఫహీమ్ అష్ర ఫ్(2/19) రెండు వికెట్లు తీశాడు. శనివారం ఒక్కరోజే 13 వికెట్లు పడ్డాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు17/2తో రెండో రోజు శనివారం ఆట కొనసాగించిన పాక్ జట్టు పేసర్ ఒలివర్(5/51) ధాటికి 185 రన్స్‌కే ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్(50) , బాబర్ అజమ్ (49) రాణించారు. ఫిలాండర్ (3/43)మూడు, రబాడ(2/41) రెండు వికెట్లు తీశారు.

రన్నరప్ పేస్ జోడీ

న్యూఢిల్లీ: వియత్నాంలో జరిగిన ఏటీపీ డా నాంగ్ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో ఇండియా స్టార్ ప్లేయర్ లియాండర్ పేస్.. మిగుల్ రెయేస్ (మెక్సికో)తో కలిసి రన్నరప్‌గా నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ పేస్ జంట 3-6. 6-2, 9-11తో రెండోసీడ్, చెంగ్ పెంగ్ (చైనీస్‌తైపీ)-క్రిస్టోఫర్ (ఇండోనేసియా) చేతిలో సూపర్ టైబ్రేకర్‌లో పోరాడి ఓడిపోయింది. తొలి సెట్‌లో ఓడిపోయిన పేస్ జంట.. రెండోసెట్‌లో అద్భుత పోరాటపటిమ కనబర్చడంతో మ్యాచ్ సూపర్ టై బ్రేకర్‌కు దారితీసింది. ఇందులో చివరికంటా పోరాడిన ఇండో-మెక్సికన్ జంటకు నిరాశే ఎదురైంది.

‘సిడ్నీ’ క్వీన్ క్విటోవా



సిడ్నీ : ప్రపంచ ఆరో ర్యాంకర్ పెట్రా క్విటోవా(చెక్ రిపబ్లిక్) సిడ్నీ ఇంటర్నేషనల్ టెన్నిస్ టైటిల్ గెలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో క్విటోవా 1–6, 7–5, 7–6(7/3)తో ఆస్ట్రేలియా ప్లేయర్ యాష్లే బార్టీతో విజయం సాధించి టైటిల్‌ను ముద్దాడింది. సిడ్నీ ఇంటర్నేషనల్ గెలవడం క్విటోవాకు ఇది రెండో సారి. రెండు గంటల 19 నిమిషాల పాటు సాగిన ఫైనల్‌లో తొలి సెట్‌ను కోల్పోయిన క్విటోవా రెండో సెట్‌ను గెలిచింది. చివరి సెట్ ప్రారంభంలో 0–3తో వెనకబడినప్పటికీ పుంజుకుని ఆధిక్యం సాధించింది. ఓ క్రాస్ కోర్ట్ ఫోర్ హ్యాండ్ షాట్‌తో మ్యాచ్ పాయింట్ సాధించింది.ఈ మ్యాచ్‌లో క్విటోవా 31 విన్నర్లు సంధించగా, బార్టీ 23 కొట్టింది.

పాండ్యా, రాహుల్ ప్లేస్‌లో మయాంక్, శంకర్

న్యూఢిల్లీ: సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్ స్థానాల్లో మయాంక్ అగర్వాల్, విజయ్ శంకర్ ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో టీమిండియాలో చోటు దక్కించుకున్నారు. వీరిద్దరూ వీలైనంత త్వరలో టీమ్‌తో కలుస్తారని బీసీసీఐ సీనియర్ అధికారు ఒకరు తెలిపారు. ఆసీస్‌తో టెస్ట్ సిరీస్‌లోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మయాంక్.. తొలిసారి పరిమిత ఓవర్ల టీమ్‌కు ఎంపికయ్యాడు. తమిళనాడుకు చెందిన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ ఇప్పటికే ఐదు టీ20ల్లో ఆడాడు.

వినోద్ X డయానా

- పాండ్యా, లోకేశ్‌పై విచారణ ఫాస్ట్‌గా చేయాలన్న రాయ్
- రాహుల్ జోహ్రీతో ఎంక్వైరీ ఎలా చేయిస్తారు– ఎడుల్జీ




న్యూఢిల్లీ: టీవీ షోలో చెత్తగా వాగిన టీమిండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్ వ్యవహారం కొత్త మలుపు తిరిగేలా కనిపిస్తోంది. పాండ్యా, రాహుల్‌ను ఆసీస్ టూర్ నుంచి వెనక్కు రప్పించి.. ఈ వివాదంపై విచారణ చేపట్టాలన్న నిర్ణయంలో బీసీసీఐ పరిపాలక కమిటీ (సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్, డయానా ఎడుల్జీ మధ్య బేదాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. క్రికెటర్లపై విచారణను త్వరగా పూర్తి చేయాలన్న రాయ్ ప్రతిపాదనపై ఎడుల్జీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. విచారణను వేగంగా పూర్తి చేయడం అంటే క్రికెటర్లను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేసినట్టు అవుతుందని ఆమె వాదన. అదే సమయంలో గతంలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీతో ఈ ఎంక్వైరీ చేయించడాన్ని ఆమె తప్పుబడుతోంది. రాయ్ మాత్రం.. పాండ్యా, రాహుల్ విషయం టీమ్‌పై ప్రభావం చూపకుండా ఉండేందుకు ఆసీస్‌తో రెండో వన్డేకల్లా ఈ విచారణను ముగించాలని భావిస్తున్నారు. ఎడుల్జీ వాదన మరోలా ఉంది. ‘ఎంక్వైరీ విషయంలో మనం తొందరపడకూడదు. దీన్ని తొందరగా ముగిస్తే.. క్రికెటర్లను కవర్ చేసేందుకు ప్రయత్నించామన్న అభిప్రాయం కలుగుతుంది. ఇద్దరు క్రికెటర్ల స్థానాలను భర్తీ చేసే పనిలో సెలెక్టర్లు ఉన్నారు కాబట్టి ఇండియా త్వరలోనే ఫుల్ స్ట్రెంత్‌తో ఉంటుంది. ఇప్పటికే లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న సీఈవోతో విచారణ జరిపించాలన్న నిర్ణయం సరైనది కాదు. దీనిపై విమర్శలు వస్తాయి. జోహ్రీతో విచారణ చేయిస్తే న్యాయం జరగదు. ముగ్గురు బీసీసీఐ ఆఫీస్ బేరర్లతో కలిసి గానీ, బోర్డు సెక్రటరీతో కలిసి గానీ సీవోఏ ఎంక్వైరీ చేస్తేనే బాగుంటుంద’ని రాయ్‌కు ఎడుల్జీ మెయిల్ చేసింది.

కార్డు గుంజారా.. ఖరాబవుడు ఖాయం

మారిన ఏటీఎంల పనితీరు.. స్లాట్‌లో కార్డ్ లాక్

డబ్బుల కోసం ఏటీఎంకు వెళుతున్నారా? మరి, ఏటీఎంలు మునుపటిలా కాకుండా కొత్తగా పనిచేస్తున్నాయన్న విషయం తెలుసా? తెలుసుకోకుండా వెళితే మీ ఏటీఎం కార్డు ఖరాబయ్యే చాన్సులున్నాయ్. వాటి కొత్త పనితీరు ఎలా ఉందో తెలుసుకుందామా..?



- లావాదేవీ పూర్తయ్యాకగానీ బయటకు తీయొద్దు
- ఎర్ర లైట్ ఉంటే లావాదేవీ.. పచ్చ లైట్ వస్తేనే బయటకు

డిసెంబర్ 31 తర్వాత మాగ్నటిక్ స్ట్రిప్ (ఏటీఎం/డెబిట్ కార్డుపై నల్లటి ప్యాచ్)గల కార్డులు పనిచేయట్లేదు కదా. వినియోగదారుల లావాదేవీలను మరింత భద్రం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'చిప్' ఉన్న కార్డులనే ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశాలిచ్చిన సంగతి తెలుసు కదా. జనవరి 1 నుంచి బ్యాంకులు చిప్‌లున్న ఏటీఎం కార్డులనే ఇస్తున్నాయి. అంతే కాదు, వాటికి తగినట్టు ఏటీఎంల పనితీరును మార్చాయి బ్యాంకులు.

పాత పద్ధతులు..

- ఇప్పటిదాకా మూడు రకాల ఏటీఎంలు మనకు అందుబాటులో ఉన్నాయి.
- ఒకటి.. కార్డును పెట్టేసి వెంటనే తీయడం. ఆ తర్వాత కావాల్సిన లావాదేవీని మనం చేసుకునే వాళ్లం.
- రెండు.. కార్డును పెట్టగానే ఏటీఎం దానిని రీడ్ చేసేసి వెనక్కు ఇచ్చేది. ఆ తర్వాత మనం లావాదేవీలు చేసుకునేవాళ్లం.
- మూడు.. కార్డును పెట్టగానే ఏటీఎం లోపలికి తీసేసుకునేది. మనం చేసే లావాదేవీ పూర్తయ్యాక గానీ మళ్లీ ఆ కార్డు బయటకు వచ్చేది కాదు.
- ఇప్పుడు ఈ పాత పద్ధతులేవీ కొత్త కార్డుకు సరిపోవు.

ఏటీఎంల కొత్త పద్ధతి..

- మునుపటి వాటితో పోలిస్తే కొత్త ఏటీఎంల పనితీరు కొత్తగా ఉంటుంది.
- కార్డును ఏటీఎం స్లాట్‌లో పెడతాం కదా. పెట్టి వెంటనే గుంజేయొద్దు. మన లావాదేవీ పూర్తయ్యే వరకు అలాగే ఉంచాలి. ఒకవేళ కార్డు పెట్టి వెంటనే గుంజడానికి ప్రయత్నిస్తే కార్డు పాడయ్యే ప్రమాదం ఉంటుంది.
- వినియోగదారుడు కార్డును వెంటనే వెనక్కు తీసేయకుండా ఏటీఎం కార్డ్ స్లాట్‌లో కార్డ్ లాక్ అయిపోతుంది. అంటే కార్డు బయటకు మనకు కనిపిస్తుంది కానీ, ఆ స్లాట్‌లోనే కార్డును ఏటీఎం పట్టి ఉంచుతుంది. లావాదేవీ జరుగుతున్నంత సేపు అలాగే ఉంటుంది.
- ఒకవేళ కార్డును లాగడానికి ప్రయత్నించినా బలం పెట్టాలి. ఆ క్రమంలో కార్డుకుండే ప్రత్యేకమైన చిప్ పాడవ్వొచ్చు.
- లావాదేవీ జరుగుతున్నప్పుడు కార్డు స్లాట్ వద్ద ఎర్ర లైటు (ఏటీఎంను బట్టి ఉండొచ్చు. కొన్ని కొన్ని ఏటీఎంలలో ఆ సౌకర్యం ఉండకపోవచ్చు) వెలుగుతూ ఉంటుంది.
- లావాదేవీ పూర్తయితే ఆకుపచ్చ లైట్ వస్తుంది. కాబట్టి పచ్చ లైటు వచ్చే వరకు కార్డు తీయొద్దు.
- ఈ కార్డు పనితీరు అంతా కూడా పీవోఎస్ (షాపులు, సూపర్ మార్కెట్లు, షోరూంలలో కార్డు స్వైప్ చేసే మెషీన్లు) పనితీరులాగే ఉంటుంది. స్వైపింగ్ మెషీన్లో కార్డును పెట్టి ఉంచితేనే లావాదేవీ జరుగుతుంది కదా.. అలా అన్నమాట.
- అన్ని బ్యాంకులూ అప్పుడే ఈ కొత్త ఏటీఎంలను తీసుకురాలేదు. కొన్ని బ్యాంకులు మాత్రమే ఇప్పుడు అమలు చేస్తున్నాయి. మామూలు పాత ఏటీఎం అయితే.. ఎప్పటిలాగానే పాత పద్ధతిలో ఏటీఎం కార్డును వాడుకోవచ్చు. లావాదేవీలు చేయొచ్చు. కానీ, తొందరలోనే అన్ని ఏటీఎంలు కొత్త వ్యవస్థలోకి మారిపోతాయి. కాబట్టి ఇప్పటి నుంచే జాగ్రత్తపడితే మంచిది.
- ఎస్బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ తదితర ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు చాలా వరకు ఈ కొత్త పద్ధతిలోకి మారాయి. కొన్ని చోట్ల కొత్త ఏటీఎంలను పెట్టాయి.
- కొత్త ఏటీఎంలు, వాటి పనితీరు గురించి ఇప్పటికే ఆయా బ్యాంకులు వినియోగదారులకు మెసేజ్‌లు పంపుతున్నాయి.
- ఒకవేళ కొత్త కార్డ్ (చిప్ ఉన్న ఏటీఎం కార్డ్) తీసుకోకపోతే వెంటనే వెళ్లి మార్చుకుంటే బాగుంటుంది.

కార్డు నంబర్ చెప్పక్కర్లే..

టోకెన్ నంబర్‌తో భద్రమైన లావాదేవీలు.. ఆర్బీఐ కొత్త రూల్స్

డెబిట్ కార్డు కావొచ్చు.. క్రెడిట్ కార్డు కావొచ్చు.. ఆ కార్డుపై ఉండే 16 అంకెల నంబర్ చాలా కీలకం. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తే కార్డు నెంబర్ ఇవ్వాలి. పీవోఎస్ (స్వైపింగ్ మెషీన్)లో కార్డు పెట్టినా ఆ నంబర్ రికార్డవుతుంది. మరి, ఆ కార్డు నంబర్ ఇవ్వకుండా మన లావాదేవీలను మరింత భద్రం చేసుకునే అవకాశం ఉంటే బాగుంటుంది కదా. అందుకే ఐదు రోజుల క్రితం (జనవరి 8న) ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది. కార్డు నంబర్‌కు బదులు టోకెన్ నంబర్‌ను వాడుకునేలా వెసులుబాటు కల్పించింది. అంతేకాదు, దానికి పిన్ లేదా అడిషనల్ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (ఏఎఫ్ఏ)ను కల్పిస్తోంది.

టోకెన్ నంబర్ అంటే...

కార్డు వివరాలను దాచేసి ఆ కార్డుపైనే 16 అంకెల (కార్డుపై ఉన్న నంబర్లు కాకుండా) టోకెన్‌ను బ్యాంకులు ఇస్తాయి. లావాదేవీలు చేసేటప్పుడు ఒరిజినల్ కార్డు వివరాలకు బదులుగా ఈ టోకెన్ నంబర్‌ను వాడితే సరిపోతుంది. పాయింట్ ఆఫ్



సేల్స్ (పీవోఎస్) టెర్మినళ్లు, క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ పేమెంట్లలో కార్డు వాడకం లేకుండా ఆ నంబర్‌ను ఇస్తే సరిపోతుంది. అంతేకాదు.. ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేసినప్పుడూ కార్డు నంబర్‌కు బదులుగా ఈ 16 అంకెల టోకెన్‌నే వాడితే సరిపోతుంది. అయితే, తొలుత మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్ల ద్వారానే ఈ రకమైన లావాదేవీలు జరిపేందుకు ఆర్బీఐ అవకాశమిచ్చింది. కొద్ది రోజుల్లో ఇతర వ్యవస్థలకూ దానిని విస్తరించనుంది.


ఎలా తీసుకోవచ్చు.. లాభమేంటి?

ఒరిజినల్ కార్డు నంబరిస్తే స్వైపింగ్ మెషీన్లలో ఆ నంబర్ రికార్డయ్యే చాన్సులుంటాయి. టోకెన్ సిస్టమ్ అయితే అలాంటి భయం అక్కర్లేదు. ప్రతి లావాదేవీకి కొత్త టోకెన్ నంబర్‌ను జారీ చేస్తారు. అంటే ప్రతి లావాదేవీకి ఒక్కో టోకెన్ నంబర్ ఉంటుందన్నమాట. ఎప్పటికప్పుడు అది మారుతుండడం వల్ల ఒరిజినల్ కార్డు వివరాలు తెలుసుకోవడం చాలా కష్టం. టోకెన్ నంబరిచ్చే అధికారాన్ని బ్యాంకులకే ఇచ్చింది ఆర్బీఐ. అయితే, మాస్టర్ కార్డ్, వీసా, రూపే వంటి థర్డ్ పార్టీ సంస్థలే కార్డుల వ్యవహారాలు చూస్తున్నాయి కాబట్టి.. ఆ విషయంలో మినహాయింపునిచ్చింది. అంటే మాస్టర్‌కార్డ్, వీసాలు టోకెన్ నంబర్‌ను జారీ చేసే అధికారం ఇచ్చింది. అయితే, ఎప్పటికప్పుడు థర్డ్‌పార్టీలతో టోకెన్‌ల జారీ విషయంపై ఆడిట్ చేయాల్సిందిగా బ్యాంకులను ఆదేశించింది ఆర్బీఐ. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్ ఇన్) ఆధ్వర్యంలో ఆడిట్ జరుగుతుంది. టోకెన్‌ను జారీ చేసే సంస్థల యాప్‌ల ద్వారా (మాస్టర్‌కార్డ్, వీసా తదితర థర్డ్‌పార్టీ టోకెనైజర్లు) ఈ టోకెన్లను వినియోగదారులు తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా ఆ సంస్థల యాప్‌లలో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ టోకెన్లపై బ్యాంకులు ఎలాంటి అదనపు చార్జీలను వేయవు. ఆ విషయంపైనా బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశాలిచ్చింది.



33 ఏళ్లుగా చాయ్‌తోనే బతుకుతోంది

ఒక రెండు రోజులు ముద్ద ముట్టకుండా, బుక్క నీళ్లు మింగకుండా ఉండగలరా? వామ్మో.. కడుపును ఆకలికి మాడ్చి, దూపతో గొంతును ఏడ్చేలా చేస్తామా ఏంటి అనేస్తారా?.. కానీ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 44 ఏళ్ల ఓ మహిళ 33 ఏళ్లుగా ఏం తినకుండానే బతికేస్తోంది తెలుసా? అన్నేళ్ల నుంచి ఆమె తీసుకుంటున్న ఆహారం కేవలం చాయ్! కోరియా జిల్లాలోని బరాదియా గ్రామానికి చెందిన పిల్లి దేవి అనే మహిళ 11 ఏళ్ల వయసులోనే తిండి తినడం మానేసింది. చాయ్‌తో పొట్టు నింపుకుంటూ ఆరోగ్యంగా బతికేస్తోంది. అందుకే అక్కడోళ్లు ఆమెని 'చాయ్ వాలీ చాచీ (చాయ్ బామ్మ)' అని పిలుస్తారు. ఆమె పాట్నా స్కూల్లో ఆరో తరగతి చదువుతుండగా జిల్లా స్థాయి ఆటలపోటీలకు వెళ్లిందని, అక్కడి నుంచి వచ్చిన మరుక్షణం నుంచి తిండి తినడం మానేసిందని ఆమె తండ్రి రతి రామ్ చెప్పాడు. మొదట్లో పాలల్లో బిస్కెట్లు, బ్రెడ్డు తిన్నా ఆ తర్వాత చిన్నచిన్నగా టీ డికాషన్ (బ్లాక్ టీ) వైపు మళ్లిందన్నాడు. అప్పటి నుంచి ఆ టీ డికాషనే తప్ప వేరే ఏం ముట్టుకోవట్లేదని చెప్పాడు. ఆమెకి ఏదైనా సమస్య ఉందనుకుని ఎన్నో హాస్పిటళ్లు తిప్పినా అలాంటిదేమీ లేదని డాక్టర్లు చెప్పారంటూ ఆమె అన్న బిహారీ లాల్ రాజ్వాడే చెప్పాడు. ఇన్నేళ్లుగా ఏం తినకపోయినా సంపూర్ణ ఆరోగ్యంగా ఉందన్నాడు. ఆమె ఇల్లు వదిలి బయటకు రావడం చాలా అరుదని, ఎక్కువగా శివుడిని ఆరాధిస్తూ గడిపేస్తుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 33 ఏళ్లుగా ఏం తినకుండా టీ తాగి బతకడమన్నది చాలా కష్టమని కోరియా జిల్లా ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. కానీ, ఈమె విషయంలో చాలా ఆశ్చర్యమేస్తోందన్నారు.



సూర్యుడు సల్లారుతడు

ఆ తర్వాత రాయిగా మారతాడట

- ఇది జరగడానికి 1000 కోట్ల ఏళ్లు పట్టొచ్చు
- అంచనా వేసిన సైంటిస్టులు

ఈ జగత్తుకి మూలం సూర్యుడు. విశ్వమంతా వెలుగును ప్రసరిస్తూ జీవ కోటి ప్రాణాలను నిలబెడుతున్నాడు. వేడి, వర్షం, చలి ఇలా భూమ్మీద జరిగే ప్రతి క్రియకు సూర్యుడితో సంబంధం ఉంది. మరి అలాంటి సూర్యుడు చనిపోతే? అదేంటి సూర్యుడికి మరణం ఉందా అనుకోవద్దు. ఉంది. నక్షత్రాలు మరణిస్తాయని మీకు తెలుసుగా. సూర్యుడు ఈ విశ్వంలోని అతి పెద్ద నక్షత్రం. ఇతర నక్షత్రాలు చనిపోతున్నట్టుగానే ఏదో ఒక రోజు సూర్యుడు శాశ్వతంగా అస్తమిస్తాడు. తన మరణానికి ముందు భూమ్మీద ఉన్న జీవరాశిని తన శక్తితో తుడిచిపెట్టేస్తాడు.

రాయిగా మారిపోతాడట!

వయసైపోయాక సూర్యుడు భారీ రాయిగా మారిపోతాడని సైంటిస్టులు చెబుతున్నారు. 50 ఏళ్లుగా భూమికి 300 కాంతి సంవత్సరాల దూరంలో మరణించబోతున్న నక్షత్రాలపై బ్రిటన్, కెనడా, అమెరికా సైంటిస్టులు రీసెర్చ్ చేస్తున్నారు. గైయా స్పేస్ టెలిస్కోప్ ద్వారా వాటిని అధ్యయనం చేశారు. సాధారణంగా నక్షత్రాల్లో కార్బన్, ఆక్సిజన్ కలిసి మండుతుంటాయి. ఆ శక్తే మనకు భూమ్మీద నుంచి కాంతి మాదిరి కనిపిస్తుంది. వయసైపోయిన తర్వాత నక్షత్రాలు తొలుత కాంతిని కోల్పోతాయి (వైట్ డ్వార్ఫ్‌గా మారడం అంటే ఇదే). ఎలాంటి చర్యలు లేకపోవడంతో కొంతకాలానికి నక్షత్రం పూర్తిగా చల్లబడిపోతుంది. ఆ తర్వాత రాయిగా మారుతుందనేది ఎప్పటినుంచో ఉన్న వాదన. సైంటిస్టులు గమనిస్తున్న మరణదశలోని నక్షత్రాలు కూడా క్రమంగా రాయిగా మారుతున్నట్లు తేలడంతో ఈ సిద్ధాంతం సరైనదేనని తేలింది.

ఈ ఫార్ములానే విశ్వంలోని అతి పెద్ద నక్షత్రం సూర్యుడికి వర్తింపజేసి, ఎప్పుడు మరణిస్తాడో తెలుసుకునేందుకు సైంటిస్టులు ప్రయత్నం చేశారు. దాదాపు 1000 కోట్ల ఏళ్ల తర్వాత సూర్యుడు చనిపోతాడని అంచనా వేస్తున్నారు. సూర్యుడిలో అత్యధికంగా హైడ్రోజన్, హీలియం వంటి వాయువులు ఉన్నాయి. ఇవి జరిపే న్యూక్లియర్ ఫ్యూజన్ చర్య వల్ల విశ్వానికి సరిపడేంత కాంతి వస్తోంది. వయసు పెరిగేకొద్దీ ఈ కాంతి తగ్గుతూ, చివరకు సూర్యుడు చల్లబడిపోయి పెద్ద వైట్ డ్వార్ఫ్‌గా మారిపోతాడని సైంటిస్టులు అంటున్నారు. ప్రస్తుతం సూర్యుడు 'ఎల్లో డ్వార్ఫ్' స్టేజ్‌లో ఉన్నాడట. వచ్చే ఐదు బిలియన్ సంవత్సరాల్లో చల్లబడుతూ తొలుత 'రెడ్ డ్వార్ఫ్'గానూ, ఆ తర్వాత వైట్ డ్వార్ఫ్‌గానూ మారిపోతాడని వివరించారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పూర్తి రాయిగా (బ్లాక్ డ్వార్ఫ్) మారతాడని చెబుతున్నారు. ఈ రాయిలో ఎక్కువగా వాయువుల పరిమాణం ఉండటం వల్ల లోహంలా మెరుస్తూ కనపడొచ్చని అంచనా వేస్తున్నారు.

మరి భూమి పరిస్థితేంటి?

వచ్చే 500 కోట్ల ఏళ్లలో సూర్యుడు వందల రెట్లు పెరిగిపోతాడట. ఈ దశను 'రెడ్ జెయింట్ స్టార్' అని పిలుస్తారు. కొంతకాలానికి మెల్లగా సూర్యుడి నుంచి వాయువులు విడుదల కావడం మొదలవుతుందట. ఇది సగానికిపైగా సూర్యుడిని కప్పేస్తుందట. ఈ దశ దాటితే తొలుత సూర్యుడి అంతర్భాగం 'వైట్ డ్వార్ఫ్'గా మారిపోతుందట. ఇలా కొన్ని వేల ఏళ్ల పాటు ప్రకాశిస్తూనే ఉంటాడు. ఇది సౌర కుటుంబంలో పెద్ద మార్పులకు దారి తీయొచ్చనేది సైంటిస్టుల అంచనా వేస్తున్నారు. అయితే కచ్చితంగా ఇదే జరుగుతుందని వాళ్లు చెప్పలేకపోతున్నారు. సూర్యుడు పెరిగే కొద్దీ, వేడి పెరిగి భూమిపై జీవరాశి అంతరించిపోతుందని అంటున్నారు. చివరకు భూమి కోర్ (అంతర్భాగం) ఒక్కటే మిగలొచ్చని అభిప్రాయపడుతున్నారు.

యూజర్ల డేటాను అమ్మబోయిన ఫేస్‌బుక్?

కొన్నేళ్ల క్రితం ఫేస్‌బుక్ యూజర్ల డేటాను అమ్మబోయిందట. డీల్ ఓకే అవుతుందనుకుంటున్న టైంలో ఉన్నట్టుండి మనసు మార్చుకుందట. 2012లో కొన్ని డేటా కంపెనీలకు యూజర్ల డేటాను 1.75 కోట్ల రూపాయలకు అమ్మాలని ఫేస్‌బుక్ భావించిందని తాజాగా రిపోర్టులు వచ్చాయి. యూజర్ల డేటా ఉండే 'గ్రాఫ్ ఏపీఐ వెర్షన్ 1'లోకి వెళ్లే అర్హతను నిస్సాన్, రాయల్ బ్యాంక్ ఆఫ్ కెనడా, క్రిస్లర్, ఫియట్, లైఫ్ట్, ఎయిర్ బీఎన్‌బీ, నెట్‌ఫ్లిక్స్ తదితర కంపెనీలకు ఇచ్చిందట. కానీ 2014లో మనసు మార్చుకుని కంపెనీలకు ఇచ్చిన అర్హతలను లాగేసుకుందట. ఆ వెంటనే గ్రాఫ్ ఏపీఐ వెర్షన్ 2.0ను రూపొందించి డేటాను అందులో చేర్చింది. అటుపైన డేటా కంపెనీలకు చేరకుండా జాగ్రత్త పడింది. ఈ విషయాలన్నీ ఫేస్‌బుక్‌కు చెందిన ఓ కోర్టు డాక్యుమెంట్‌లో ఉన్నట్లు తెలిసింది. దీనిపై



స్పందించిన ఫేస్‌బుక్ అధికార ప్రతినిధి పొరబాటున కంపెనీల పేర్లు డాక్యుమెంట్లో పడ్డాయని చెప్పారు.

అసలేం జరిగింది?

అమెరికాకు చెందిన సిక్స్4థ్రీ కంపెనీతో ఫేస్‌బుక్ ఓ కాంట్రాక్టును కుదుర్చుకుంది. కొద్దిరోజుల తర్వాత సిక్స్4థ్రీ రూల్స్‌ను పాటించలేదని ఫేస్‌బుక్ ఆరోపించింది. ఈ మేరకు 2015లో కోర్టు మెట్లెక్కింది. కాంట్రాక్టును ఎక్కడా ఉల్లంఘించలేదంటూ సిక్స్4థ్రీ కూడా కోర్టుకు వెళ్లింది. ఈ రెండు పిటిషన్లు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. ఈలోగా బ్రిటన్ పార్లమెంట్ ఫేస్‌బుక్ యూజర్ల డేటాను వాడుకుంటుందా అని చేస్తున్న విచారణకు సిక్స్ 4థ్రీ కొన్ని డాక్యుమెంట్లను పంపింది. వాటిలోని ఒకటి ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. యాప్స్ ద్వారా యూజర్లు, వారి స్నేహితుల డేటాను ఫేస్‌బుక్ తీసుకుందని సిక్స్4థ్రీ ఆరోపణ. అయితే దీన్ని ఫేస్‌బుక్ నిరాకరిస్తోంది.

మనసుంటే మార్గముంటది

చాయ్ దుక్నం దంపతులు 23 దేశాలు చుట్టొచ్చారు

"హమ్‌మ్‌మ్... పొలాచ్చి పోదామనుకుంటే చేతిలో పైసల్లేవ్.." "వెనిస్ వెళ్దామంటే టైం కుదరట్లేదాయే.. ఏం చెయ్యాలి?".. టూర్లకు వెళ్లాలని మనసులో ఉన్నా చాలా మందిది ఇలాంటి పరిస్థితే. మనసుండాలే గానీ ప్రతి దానికీ మార్గముంటుంది అని నిరూపిస్తున్నారు ఈ వృద్ధ దంపతులు. ప్రపంచాన్ని చుట్టి రావాలన్నా తమ ఆకాంక్షను, కలను సాకారం చేసుకుంటున్నారు. అలాగని వాళ్లేదో బాగా డబ్బున్నోళ్లేం కాదు.. ఇద్దరూ కష్టపడితేగానీ పూట గడవని పరిస్థితి. అయినా కూడా 45 ఏళ్లలో 23 దేశాలను చుట్టొచ్చారు. మహీంద్రా ఓనర్ ఆనంద్ మహీంద్రా మనసును దోచేశారు. కృష్ణా, రామ అనుకుంటూ గడపాల్సిన వయసులో.. హద్దుల్లేని పక్షుల్లా రెక్కలు కట్టుకుని విదేశాలకు ఎగిరిపోతున్న ఆ ముసలి మనసులకు అదెలా సాధ్యమయ్యిందో చూద్దాం.

విజయన్, మోహన.. ఇద్దరూ ఏడు పదుల వయసులోకి అడుగుపెట్టబోతున్నారు. పెళ్లయి 45 ఏళ్లవుతోంది. బతుకు బండిని లాగేందుకు 56 ఏళ్ల క్రితం 1963లో కొచ్చి నడిబొడ్డున శ్రీ బాలాజీ కాఫీ హౌస్ అనే చిన్న టీ కొట్టును తెరిచారు. రోజంతా ఇద్దరూ కష్టపడితే మిగిలేది రూ.300 (ఇప్పటి లెక్క). కానీ, అంత చిన్న బతుకే అయినా.. ప్రపంచాన్ని చుట్టి రావాలి అని వాళ్ల మనసు ఉరుకులు పెట్టించేది. మరి, అంత చిన్న సంపాదనతో అది సాధ్యమేనా? కాదు కదా.. వచ్చిన దాంట్లోనే బతుకీడుస్తూ కొంత దాచుకుంటూ.. మరికొంత మొత్తాన్ని బ్యాంకుల నుంచి లోన్ తీసుకుంటూ విదేశాలకు వెళ్లేవారు. దేశాన్ని బట్టి టూర్ వెళ్లొచ్చాక మూడేళ్లకు ఆ లోన్ మొత్తాన్ని తీర్చేసేవారు. ఇలా వాళ్లు వెళ్లిన ప్రతి ట్రిప్‌కు లోన్లే వాళ్ల కలను తీర్చాయి. ఎక్కువగా తిరిగిన దేశాల్లో సింగపూర్, స్విట్జర్లాండ్, అమెరికా అంటే చాలా ఇష్టమని ఈ దంపతులు చెబుతారు. ఇప్పుడు స్వీడన్, డెన్మార్క్, నెదర్లాండ్స్, గ్రీన్లాండ్, నార్వేలను చుట్టి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాళ్లు చుట్టొచ్చిన ప్రాంతాల్లో తీసుకున్న ఫొటోలు,



- పైసల్లేకున్నా లోన్లతో టూర్లు.. వచ్చాక చెల్లింపులు
- ఈసారి టూర్లకు డబ్బులిద్దామంటున్న ఆనంద్ మహీంద్రా

అక్కడ అయిన ఖర్చుల బిల్లులను టీ షాప్ గోడలపై పెట్టారు. అంతేకాదు, వాళ్లపై ఇన్విజిబుల్ వింగ్స్ అనే డాక్యుమెంటరీ కూడా వచ్చింది. హరి ఎం మోహనన్ అనే డైరెక్టర్ తీసిన ఆ నిజ జీవితపు డాక్యుమెంటరీ.. 2018 ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. వాళ్ల కథ ఆనంద్ మహీంద్రాను బాగా కట్టిపడేసింది. రెక్కలు కట్టుకు ఎగిరిపోతున్న ఆ వృద్ధ దంపతులకు ఆర్థికంగా చేయూతనివ్వాల్సిన అవసరముందని ఆయన ట్వీట్ చేశారు. "ఫోర్బ్స్ డబ్బున్నోళ్ల జాబితాలో వాళ్లు లేకపోవచ్చు. కానీ, నా దృష్టిలో మాత్రం మన దేశంలో వాళ్లే అత్యంత సంపన్నులు. వాళ్లకున్న సంపద జీవితంపై వాళ్లకున్న యాటిట్యూడే. వాళ్ల పట్టణానికి వెళ్లినప్పుడు కచ్చితంగా వాళ్ల షాపులో టీ తాగుతా. వాళ్ల పెళ్లి రోజు కానుకగా తర్వాతి ట్రిప్పుకు నిధులిస్తే ఎలా ఉంటుంది.. ఏమంటారు" అంటూ ఆయన ట్వీట్ చేశారు.

'రెడీమేడ్' కూడా తక్కువేంగాదు

పరిశ్రమలతో పర్యావరణ, సామాజిక సమస్యలు

వాషింగ్టన్: ఫాస్ట్ ఫ్యాషన్ ఇండస్ట్రీ.. రెడీమేడ్‌గా బట్టలను అందిస్తున్న పరిశ్రమ.. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 8 వేల కోట్ల కొత్త క్లాత్ అమ్ముడవుతోంది. వీటి ద్వారా ఫ్యాషన్ పరిశ్రమలో రూ. కోటి కోట్ల వ్యాపారం జరుగుతోంది. చైనా, బంగ్లాదేశ్‌లలో ఎక్కువగా బట్టల అసెంబ్లింగ్ జరుగుతుండగా అమెరికా ఎక్కువగా టెక్స్‌టైల్స్‌ను కొంటోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ రెడీమేడ్ ఫ్యాషన్ పరిశ్రమల వల్ల సామాజిక సమస్యలొస్తున్నాయట. పర్యావరణం దెబ్బతింటోందట. బట్టలెలా తయారవుతాయి.. పత్తి నుంచి. కానీ పత్తి నీటిని ఎక్కువగా తీసుకునే పంట. కాబట్టి నీటి కొరత పెరుగుతుంది. పత్తి ఉత్పత్తి అయ్యాక పరిశ్రమలకు తరలిస్తారు. రెడీమేడ్ పరిశ్రమల్లో రకరకాల రంగుల్లో బట్టలు తయారు చేస్తారు. ఆ రంగులను శుద్ధి చేయకుండా అలానే దగ్గర్లోని నదుల్లోకో, చెరువుల్లోకో వదులుతారు. ఇదో సమస్య. ఇలా ఫ్యాషన్ ఇండస్ట్రీలో ప్రతి దశలో ఎంతలా పర్యావరణం నాశనమవుతోందో 'ఎన్విరాన్మెంటల్ హెల్త్'లో పరిశోధన వ్యాసం ప్రచురితమైంది. రెడీమేడ్ వస్త్ర పరిశ్రమ వల్ల తక్కువ ధరకు నాణ్యమైన బట్టలు వస్తున్న మాట నిజమే అయినా బట్టల వాడకం ఎక్కువైనా కొద్దీ వస్త్ర వ్యర్థాలు ఎక్కువవుతున్నాయి. దీంతో ఆ పరిశ్రమల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.